అనుదినం... జనస్వరం
www.navatelangana.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదివారం 10-12-2023

సంపుటి : 9 | సంచిక : 289 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50

మహాలక్ష్మి, ఆరోగ్యశ్రీ

పథకాలకు శ్రీకారం

అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను వందరోజుల్లో అమలు చేస్తామని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఆరు గ్యారంటీల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించే 'మహాలక్ష్మి' పథకాన్ని, ఆరోగ్య పరిమితిని రూ. 10 లక్షలకు పెంచుతూ మరో పథకాన్ని సీఎం శనివారం ప్రారంభించారు. అసెంబ్లీ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రులు, ప్రొటెం స్పీకర్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా సీఎం మాట్లాడుతూ ఇకపై మహిళలు రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడ నుంచి ఎక్కడికి అయినా బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేయవచ్చని అన్నారు. ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని రూ. ఐదు లక్షల నుంచి రూ.పది లక్షలకు పెంచుతూ ప్రజలకు ఉచిత వైద్యం అందిస్తామని తెలిపారు.

వందరోజుల్లో ఆరు గ్యారంటీల అమలు : సీఎం రేవంత్

- తెలంగాణ అంటే సోనియమ్మ గుర్తొస్తుందని వ్యాఖ్య
- చేయూత కింద బాక్సర్ నిఖత్ జరీన్‌కు రూ.2 కోట్లు
- అసెంబ్లీ నుంచి ట్యాంక్‌బండ్ వరకు మహిళా మంత్రులు, అధికారులతో కలిసి ప్రయాణం
- టికెట్ కొన్న సీఎం



మహిళల హర్షం

ఆర్టీసీ బస్సుల్లో ఫ్రీ జర్నీ ప్రారంభం

- రాష్ట్రమంతటా కిటకిటలాడిన బస్సులు, బస్టాండ్‌లు
- అట్టహాసంగా బస్సుల అలంకరణ
- మాకో వరం అంటున్న బాలికలు
- ప్రభుత్వానికి మహిళల కృతజ్ఞతలు
- టికెట్ల కోసం త్వరలో ప్రత్యేక సాఫ్ట్‌వేర్

వివరాలు 3లో

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

చేయూత పథకం కింద వరల్డ్ బాక్సింగ్ ఛాంపియన్, కామన్వెల్త్ గోల్డ్ మెడలిస్ట్, బాక్సర్ నిఖత్ జరీన్‌కు పారిస్ ఒలింపిక్స్ సన్నద్ధత కోసం రూ.2 కోట్ల చెక్‌ను ఆయన అందించారు. పథకాలు ప్రారంభమవుతున్న వేళ తెలంగాణ ప్రజలకు పండగ రోజని చెప్పారు. సోనియా జన్మదినమైన 2009, డిసెంబర్ తొమ్మిదిన తెలంగాణ ప్రక్రియ ప్రారంభమైందని గుర్తు చేశారు. తెలంగాణ తల్లి అంటే సోనియమ్మ రూపం కనిపిస్తుందని అభిప్రాయపడ్డారు. తనది తెలంగాణ అని చెప్పుకునే అవకాశం మనకు సోనియమ్మ ఇచ్చారని కొనియాడారు. తెలంగాణ ప్రజల కోసం సోనియమ్మ ఆరు గ్యారంటీలను ఇచ్చారనీ, అందులో రెండు గ్యారంటీలను ఆమె పుట్టినరోజు నాడే ప్రారంభించడం చాలా ...11లో

మంత్రులకు శాఖలు కేటాయింపు

భట్టికి ఆర్థికం, ఇంధనం..ఉత్తమ్‌కు భారీసాగునీటి పారుదల

- సీతక్కకు పంచాయతీరాజ్, తాగునీటి సరఫరా
- కీలకశాఖలు సీఎం దగ్గరే
- విస్తరణలో ఇతరులకు ఇచ్చే అవకాశం

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్ర మంత్రులకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి శాఖలు కేటాయించారు. ఇందుకోసం శుక్రవారం ఢిల్లీ వెళ్లిన సీఎం, ఏఐసీసీ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్‌గాంధీ, ప్రధానకార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో సుదీర్ఘ చర్చలు జరిపారు. శనివారం ఉత్తర్వులు జారీచేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని ఆదేశించారు. ఈ మేరకు జీవో నెంబరు 179 విడుదలైంది. సాధారణ పరిపాలన, శాంతిభద్రతలు, హోం, పురపాలక, విద్య, ఎస్సీ, ఎస్టీ, సంక్షేమంతో పాటు మంత్రులకు కేటాయించని ఇతర శాఖలు సైతం ప్రస్తుతం సీఎం దగ్గరే ఉన్నాయి. రెండో విడత విస్తరణ అనంతరం వాటిని ఇతరులకు ...11లో


రేవంత్‌రెడ్డి
సాధారణ పరిపాలన శాంతిభద్రతలు, మంత్రులకు కేటాయించని ఇతర శాఖలు


మల్లు భట్టి విక్రమార్క
ఆర్థిక, ప్రణాళిక, ఇంధన శాఖ


ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి
భారీ నీటిపారుదల, పౌరసరఫరాలు


దామోదర రాజనర్సింహ
వైద్య,ఆరోగ్యశాఖ,కుటుంబ సంక్షేమం, సైన్స్ టెక్నాలజీ


సీతక్క
పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్, ఉమెన్ వెల్ఫేర్, తాగునీటి సరఫరా


శ్రీధర్‌బాబు
ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాలు


కొండా సురేఖ
అటవీ శాఖ, దేవాదాయ, పర్యావరణ


పొంగులేటి శ్రీనివాస్
రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌరసంబంధాలు


కోమటిరెడ్డి వెంకటరెడ్డి
రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ


జూపల్లి
ఎక్సైజ్, పర్యాటకం, పురావస్తు


తుమ్మల నాగేశ్వరరావు
వ్యవసాయం, సహకార, మార్కెటింగ్, చేనేత


పొన్నం ప్రభాకర్
రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖ

బీఆర్ఎస్ ఎల్పీ నేతగా కేసీఆర్

ఏకగ్రీవంగా ఎన్నుకున్న ఎమ్మెల్యేలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీఆర్ఎస్ శాసనసభాపక్ష నేతగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికయ్యారు. ఆ పార్టీ ఎమ్మెల్యేలందరూ ఆయన్ను ఏకగ్రీవంగా తమ నేతగా ఎన్నుకున్నారు. శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కే.కేశవరావు అధ్యక్షతన శాసనసభాపక్ష సమావేశాన్ని నిర్వహించారు. మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి... ఎల్పీ లీడర్‌గా కేసీఆర్ పేరును ప్రతిపాదించగా, మాజీ మంత్రులు కడియం శ్రీహరి, తలసాని శ్రీనివాసయాదవ్ బలపరిచారు. మిగతా కమిటీని ఎంపిక చేసే బాధ్యతను కేసీఆర్‌కు అప్పగిస్తూ శాసనసభాపక్షం ఏకగ్రీవంగా తీర్మానించింది.

వాకర్ సాయంతో నడిచిన కేసీఆర్



ఆరోగ్యం మెరుగుపడుతోంది :డాక్టర్ ప్రవీణ్ రావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు తుంటి ఎముక మార్పిడి శస్త్రచికిత్స విజయవంతమైంది. ప్రస్తుతం ...11లో

ఎమ్మెల్యేల ప్రమాణం...

తొలుత సీఎం రేవంత్, తర్వాత మంత్రులు

కేసీఆర్, కేటీఆర్ సహా 18 మంది గైర్హాజరు

- సభకు రాని బీజేపీ సభ్యులు
- అసెంబ్లీ వాయిదా
- 14న తిరిగి ప్రారంభం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ మూడో అసెంబ్లీ శనివారం కొలువుదీరింది. ప్రొటెం స్పీకర్‌గా అక్బరుద్దీన్ ఒవైసీ ఉదయం తొమ్మిది గంటలకు రాజ్‌భవన్‌లో ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం 11.10 గంటలకు అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. శనివారం వంద మంది ఎమ్మెల్యేల చేత ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ ఒవైసీ ప్రమాణస్వీకారం చేయించారు. తొలుత ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి, ఆ తర్వాత వరుసగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, దామోదర రాజనర్సింహ, శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రమాణం చేశారు. అనంతరం మహిళా సభ్యులు ఆ తర్వాత మిగతా ఎమ్మెల్యేలు ప్రమాణస్వీకారం చేశారు. కాంగ్రెస్ నుంచి 61 మంది, బీఆర్ఎస్ నుంచి 32 మంది, ఎంఐఎం నుంచి ఆరుగురు, సీపీఐ నుంచి ఒకరు ఎమ్మెల్యేగా ప్రమాణం చేశారు. ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ ఒవైసీతో కలిపి మొత్తం 101 మంది ఎమ్మెల్యేలు మొదటిరోజు ప్రమాణస్వీకారం చేశారు. బీఆర్ఎస్ నుంచి మాజీ మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, పి సబితా ఇంద్రారెడ్డి, గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, చామకూర మల్లారెడ్డి, గంగుల కమలాకర్, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎంఐఎం సభ్యులు అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల, జాఫర్ హుస్సేన్, కౌసర్ మొహియుద్దీన్, మీర్ జుల్ఫీకర్ అలీ, మహమ్మద్ మాజిద్ హుస్సేన్, మహమ్మద్ మోబిన్, సీపీఐ సభ్యుడు కూనంనేని సాంబశివరావు ప్రమాణస్వీకారం చేసిన వారిలో ఉన్నారు. చివరిగా కాంగ్రెస్ సభ్యుడు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ప్రమాణం చేశారు. బీజేపీ ...11లో

ప్రమాణస్వీకారాన్ని బహిష్కరించిన బీజేపీ ఎమ్మెల్యేలు

అసెంబ్లీ ఎదుట నిరసనకు యత్నం..అడ్డుకున్న పోలీసులు

- అమరవీరుల స్థూపానికి, అంబేద్కర్ విగ్రహాలకు ఎమ్మెల్యేల నివాళి
- ప్రొటెం స్పీకర్ ఎన్నిక సరిగాదంటూ గవర్నర్ కార్యదర్శికి ఫిర్యాదు

వివరాలు 11లో..

లెక్కకు లెక్క..దెబ్బకు దెబ్బ

ఆర్థిక, విద్యుత్ శాఖలపై శ్వేతపత్రాలు

ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రభుత్వ శాఖలపై విస్తృత కసరత్తు చేస్తున్నారు. ఒకవైపు రాజకీయ వ్యవహారాలు చక్కబెడుతూనే, మరోవైపు సర్కారీ శాఖల పనులు సైతం కొలిక్కితెచ్చే పనిలోపడ్డారు. బీఆర్ఎస్ సర్కారు చేసిన తప్పిదాలు, అవినీతి అంశాలపై ప్రత్యేకంగా దృష్టిసారిస్తున్నారు. ఇందుకు కాంగ్రెస్ హైకమాండ్ సైతం రేవంత్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు వార్తలొస్తున్నాయి. శాఖలవారీగా సమీక్షలు చేపడుతూ గత ప్రభుత్వ అవినీతి మకిలీపై కూపీలాగే పనిలో నిమగ్నమయ్యారు. వ్యవస్థలను ప్రక్షాళన చేసే ప్రయత్నంలో ఉన్నారు.

- సీఎం రేవంత్ విస్తృత కసరత్తు
- అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో పవర్‌పాయింట్ ప్రజేంటేషన్
- అవినీతి అంతు తేల్చేదిశగా అడుగులు
- కాళేశ్వరంపైనా నిపుణులతో సమాలోచన



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన మరుసటి రోజే ఆర్థిక, విద్యుత్ శాఖలపై సీఎం సమీక్ష చేశారు. ఆర్థిక శాఖ ద్వారా 2014 నుంచి ఇప్పటివరకు జరిగిన నిధుల కేటాయింపు, విద్యుత్ శాఖలోని రూ. 85 వేల కోట్ల అప్పులపై ప్రత్యేకంగా సంబంధిత శాఖ ఉన్నతాధికారులతో ఇప్పటికే ఒకదఫా చర్చించారు. పూర్తిస్థాయిలో నివేదిక ఇవ్వాలని ఇప్పటికే ఆ రెండు శాఖలను ఆదేశించారు. దీనిపై మలివిడత శాసనసభ సమావేశాల్లో పవర్‌పాయింట్ ప్రజేంటేషన్ ఇవ్వడం ద్వారా రాష్ట్ర ప్రజలకు ఉన్నది ఉన్నట్టుగా వాస్తవ పరిస్థితి చెప్పే ప్రయత్నాల్లో ఉన్నారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత తొలి ఐదేండ్ల కాలంలో మాజీ సీఎం కేసీఆర్, ప్రాజెక్టులపై ఎమ్మెల్యేలకు పవర్‌పాయింట్ ప్రజేంటేషన్ ఇచ్చినట్టుగా, ఆర్థిక, విద్యుత్ శాఖలపై ఆ తరహా చర్యలకు పూనుకోవాలని అనుకుంటున్నట్టు తెలిసింది. అంతకంటే మునుపే శ్వేతపత్రాలు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ప్రజలు కట్టే ...2లో

సోషల్ మీడియా పోస్టులపై ఉక్కుపాదం

ఐదేండ్లలో 36 వేలకు పైగా పోస్టులపై నిషేధం

- అధిక భాగం 'ఎక్స్'లోనివే

న్యూఢిల్లీ : 2018-2023 అక్టోబర్ మధ్యకాలంలో సామాజిక మాధ్యమాలలో వచ్చిన వేలాది పోస్టులపై కేంద్రం ఉక్కుపాదం మోపింది. ఈ కాలంలో 36,838 పోస్టులను తొలగించారు. వీటిలో ఎక్కువ భాగం 'ఎక్స్' (ఒకప్పటి ట్విట్టర్)లో పెట్టినవే. అందులో పెట్టిన 13,660 పోస్టులను కేంద్రం తొలగించింది. రాజ్యసభలో సీపీఐ(ఎం) సభ్యుడు జాన్ బ్రిట్టాస్ అడిగిన ప్రశ్నకు ప్రభుత్వం ఈ మేరకు సమాధానం ఇచ్చింది. కోవిడ్ వచ్చిన 2020లో అత్యధికంగా 9,849 పోస్టులను ప్రభుత్వం తొలగించింది.



గత ఐదేండ్ల కాలంలో పోస్టుల తొలగింపునకు సంబంధించి ప్రభుత్వం ట్విట్టర్, ఫేస్‌బుక్ సహా సామాజిక మాధ్యమాలకు ఎన్ని ఆదేశాలు జారీ చేసింది పోస్టులలో సమాచారం తొలగింపు, సవరణలకు సంబంధించి జారీ చేసిన ఆదేశాల వివరాలు ఏమిటి? అని బ్రిట్టాస్ ప్రశ్నించారు. సంవత్సరాలు, సంస్థల వారీగా వివరాలు అందజేయాలని కూడా ఆయన కోరారు. దీనిపై ప్రభుత్వం స్పందిస్తూ 'వినియోగదారులందరికీ ఇంటర్నెట్ సౌకర్యం అందుబాటులో ఉండాలని, అది సురక్షితంగా, నమ్మదగినదిగా ఉండాలని, అందరికీ జవాబుదారీగా ఉండాలని ప్రభుత్వం కోరుకుంటోంది. దానికి అనుగుణంగానే ప్రభుత్వం చట్టబద్ధంగా ఆదేశాలు జారీ చేసింది. ఐటీ చట్టం-2000లోని సెక్షన్ 69ఏ ప్రకారం ప్రజలకు సమాచారం అందకుండా వాటిని తొలగించాలని ఆదేశాలు జారీ చేశాం. దేశ సమగ్రతను కాపాడేందుకు, దేశ భద్రతకు, విదేశాలతో స్నేహపూర్వక సంబంధాలు కొనసాగించేందుకు అలాంటి చర్యలు అవసరమని ప్రభుత్వం భావిస్తే అందుకు అనుగుణంగా ఆదేశాలు జారీ చేసే అధికారం ఈ చట్టం ప్రకారం కేంద్రానికి ఉంది' అని తెలిపింది. గడచిన ఐదేండ్లలో ఎక్స్‌లోని 13,660, ఫేస్‌బుక్‌లోని 10,197, యూట్యూబ్ లోని 5,759, ఇతర సామాజిక మాధ్యమా లలోని 4,199, ఇన్‌స్టాగ్రామ్‌లోని 3,023 పోస్టులను కేంద్రం తొలగించింది.ఎలన్ మస్క్ అధీనంలోకి వచ్చిన తర్వాత ఎక్స్ కార్పొరేషన్‌పై భారత్ సహా పలు దేశాలు అనేక ఫిర్యాదులు చేశాయి. భావ ప్రకటనా స్వేచ్ఛకు పెద్దపీట వేస్తానని, సామాజిక మాధ్యమంలో రాజకీయ జోక్యాన్ని అనుమతించబోనని మస్క్ గతంలోనే చెప్పారు. 2022 సెప్టెంబర్ 27-ఈ ఏడాది ఏప్రిల్ 27 మధ్యకాలం లో పోస్టుల తొలగింపునకు సంబంధించి ఎక్స్‌కు కేంద్రం యాభై విజ్ఞాపనలు చేసింది.



హైదరాబాద్‌లో.. బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	62,350	▼	600
22 క్యారెట్లు	57,150	▼	550
కిలో వెండి	78,000	▼	2000



చికెన్ ధరలు
హైదరాబాద్
బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ. 73
రిటైల్ (లైవ్)	రూ. 95
స్కిన్‌తో	రూ. 138
స్కిన్‌లెస్	రూ. 157

గని గుర్తింపు ఎవరిదో..?

27న సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు

బరిలో 13 సంఘాలు

- ఓటు వేయనున్న 39,748 మంది కార్మికులు
- మైన్‌లపై ఎన్నికల ప్రచార జోష్



నవతెలంగాణ- కోల్‌సిటీ

సింగరేణిలో గుర్తింపు కార్మికసంఘం ఎన్నికలు ఈ నెల27న జరగబోతున్నాయి. దీనికోసం కార్మికసంఘాలు సిద్ధమవుతున్నాయి. 13 సంఘాలు బరిలో నిలుస్తున్నాయి. సింగరేణి కార్మికుల హక్కుల సాధన, పరిరక్షణ, సమస్యల పరిష్కారానికి కృషి, కార్మికులు, ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యానికి మధ్య ఒక వారధిలా ఉండేందుకు ఒక యూనియన్‌ను కార్మికులు ఈ ఎన్నికల్లో ఎన్నుకొని ఆ సంఘానికి తగిన ప్రాతినిధ్యం కల్పిస్తారు. ఆ సంఘమే కార్మికుల పక్షాన పోరాడేందుకు అన్ని విధాలుగా ముందుంటుంది. సింగరేణిలో కార్మికులకు ప్రాతినిధ్యం వహించే సంఘాన్ని ఎన్నుకునేందుకు గత అక్టోబర్‌లో నోటిఫికేషన్ జారీ అయింది. అయితే నవంబర్30న అసెంబ్లీ ఎన్నికల ఉన్న నేపథ్యంలో సింగరేణి ఎన్నికలను అధికారులు డిసెంబర్27 వరకు వాయిదా వేశారు. ఇప్పటికే దీనికి సంబంధించిన నామినేషన్లు, ఓటర్ల జాబితా, గుర్తుల కేటాయింపు లాంటి ప్రక్రియలు ముగిసాయి. పోటీ చేస్తున్న గుర్తింపు సంఘాలు ప్రచారం చేపట్టాయి.

11 డివిజన్‌లు..

సింగరేణి బొగ్గు గనులు తెలంగాణలోని ఆరు జిల్లాల్లో విస్తరించి ఉండగా వాటిని 11 డివిజన్‌లు(ఏరియాలు)గా ఏర్పాటు చేసి బొగ్గు ఉత్పత్తి కొనసాగిస్తున్నారు. మొత్తం

డివిజన్‌లు	కార్మికుల సంఖ్య
బెల్లంపల్లి -	985
మందమర్రి -	4876
శ్రీరాంపూర్ -	9124
ఆర్‌జీ 1 -	5430
ఆర్‌జీ 2 -	3479
ఆర్‌జీ 3 -	4007
భూపాలపల్లి -	5350
కార్పొరేట్ (కొత్తగూడెం)	1192
కొత్తగూడెం -	2370
ఇల్లందు -	603
మణుగూరు -	2414
మొత్తం :	39,748

కార్మికులు 39,748 మంది సింగరేణి సంస్థల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. వీరంతా కలిసి తమకు ప్రాతినిధ్యం వహించే సంఘాన్ని ఈ నెల 27న ఎన్నుకోనున్నారు.

గణనీయంగా తగ్గిన కార్మికుల సంఖ్య..

1998లో గుర్తింపు కార్మిక సంఘాల ఎన్నికలు ప్రారంభం కాగా ఆ సమయంలో సింగరేణిలో కార్మికుల సంఖ్య లక్షా20 వేలకుపైగా ఉండేది. 1998కి ముందు ఏ గుర్తింపు సంఘానికి ప్రాతినిధ్యం లేదు. చాలా మంది కార్మికులు రిటైర్ కావడం, కొత్త గనుల ఏర్పాటు లేకపోవడం, వారసత్వ ఉద్యోగాల కల్పన లేకపోవడం లాంటి అంశాలతో ప్రస్తుతం కార్మికుల సంఖ్య క్రమంగా తగ్గుతూ వస్తోంది. ప్రస్తుతం ఈ సంఖ్య 39,748కి దిగజారింది.

గనులపై ప్రచార జోష్..

ఎన్నికలకు మరో 17 రోజులు మాత్రమే మిగిలి ఉండడంతో కార్మిక సంఘాలన్నీ ఎన్నికల ప్రచారం ముమ్మరం చేశాయి. గనులు, కార్మికులు పని చేసే ఇతర స్థలాల్లో ప్రచారం చేస్తూ గుర్తింపు సంఘాన్ని ఎన్నుకోవాలని అభ్యర్థిస్తున్నారు. తమను ఎన్నుకుంటే సంస్థ నుంచి కల్పించాల్సిన హక్కులు, ఇతర సౌకర్యాల కోసం పోరాటం కొనసాగిస్తామని హామీలు గుప్పిస్తున్నారు.

ఇప్పడి వరకు గెలిచిన సంఘాలు..

సుమారు 25 ఏండ్లుగా గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు జరుగుతుండగా 3 సార్లు సీపీఐ అనుబంధ సంఘం ఏఐటీయూసీ, 2 సార్లు బీఆర్ఎస్ అనుబంధ సంఘం టీబీజీకేఎస్, ఒకసారి కాంగ్రెస్ అనుబంధ సంఘం అయిన ఐఎన్‌టీయూసీ గెలుపొందాయి.

ఏడాది	విజేత	కాలపరిమితి
09-09- 1998	ఏఐటీయూసీ	రెండేండ్లు
19-02-2001	ఏఐటీయూసీ	రెండేండ్లు
14-05-2003	ఐఎన్‌టీయూసీ	నాలుగేండ్లు
09-08-2007	ఏఐటీయూసీ	నాలుగేండ్లు
28-06-2012	టీబీజీకేఎస్	నాలుగేండ్లు
05-10-2017	టీబీజీకేఎస్	నాలుగేండ్లు

ఆలస్యంగా ఎన్నికలు..

బీఆర్ఎస్ పార్టీకి అనుబంధంగా ఉన్న టీబీజీకేఎస్ గుర్తింపు సంఘం కాలపరిమితి 2021లోనే ముగిసినా కోవిడ్ కారణంగా ఎన్నికలు నిర్వహించలేదు. అనంతరం పలు కారణాల రీత్యా ఈ ఎన్నికలు వాయిదా పడుతూ వస్తున్నాయి. ఎట్టకేలకు డిసెంబరు 27న ఈ ఎన్నికకు ముహుర్తం ఖరారు అయ్యింది. గతంలో మాదిరిగా రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీకి అనుబంధమైన గుర్తింపు సంఘానికే కార్మికుల మద్దతు ఉంటుందని చర్చ సాగుతోంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపొంది అధికారంలోకి రాగానే వచ్చిన ఈ ఎన్నికలపై ఆ పార్టీ ప్రత్యేక దృష్టి సారించింది. మొన్నటి వరకు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ అనుబంధ సంఘమైన టీబీజీకేఎస్ గుర్తింపు సంఘమైన టీబీజీకేఎస్ తిరిగి తమ ఉనికిని కాపాడుకునేలా ఆ సంఘాల నాయకులు కృషి చేస్తున్నారు. మరో వైపు ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ సంఘాలు సింగరేణిలో తమ పట్టును నిలుపుకునేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. కార్మికులు ఎవరివైపు నిలుస్తారో 27న తేలనుంది.



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు (ఫైల్)

పోటీ చేసే సంఘాలు ఇవే

గుర్తింపు సంఘం ఎన్నికల ప్రారంభానికి ముందు సింగరేణిలో పనిచేసే కార్మికులు వారి విభాగాలుగా యూనియన్లను ఏర్పాటు చేసుకొని వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసేవారు ఎన్నికల ప్రారంభం తర్వాత రిజిస్టర్ సంఘాల పేరుతో కార్మికులకు ప్రాతినిధ్యం వహించేలా నిబంధనలు విధించారు. ఈ మేరకు ప్రస్తుతం 13 సంఘాలు కార్మికుల తరపున తమ పోరాటం కొనసాగిస్తున్నాయి.

పోటీ చేసే సంఘాలు -	గుర్తులు
1) గోదావరిలోయ బొగ్గుగని కార్మిక సంఘం-	చక్రంలో సుత్తి
2) ప్రజా తెలంగాణ సింగరేణి కార్మిక సంఘం-	రెండు ఆకులు
3) సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్ -	కాగడ
4) సింగరేణి కోల్‌మైన్స్ లేబర్ యూనియన్ -	టేబుల్ గడియారం
5) సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్-	ఉదయిస్తున్న సూర్యుడు
6) సింగరేణి కాలరీస్ లేబర్ యూనియన్ -	మోటారు సైకిల్
7) సింగరేణి గని కార్మిక సంఘం -	పిక్ యాక్స్
8) సింగరేణి మైనర్స్ అండ్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ -	తరాజు
9) శ్రామిక శక్తి గోదావరిలోయ బొగ్గు గని కార్మిక సంఘం-	సింహం
10) తెంగాణ బొగ్గుగని కార్మిక సంఘం -	బాణం
11) తెలంగాణ గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం-	పిడికిలిలో పాన
12) సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ -	చుక్క
13) తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం -	ల్యాంప్ హెల్మెట్

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగానే పాలన

- సోనియాగాంధీ జన్మదిన వేడుకల్లో సీఎం రేవంత్‌రెడ్డి



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగానే ప్రజా పాలన ఉంటుందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి తెలిపారు. సోనియాగాంధీ జన్మ దినం తెలంగాణ ప్రజలకు ఓ పండుగ రోజనని ఆయన అన్నారు. డిసెంబర్ 9, 2009న తెలంగాణ ఏర్పాటు ప్రక్రియ మొదలైందని గుర్తు చేశారు. ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా తట్టుకుని ఉక్కు సంకల్పంతో సోనియమ్మ మన ఆకాంక్షలు నెరవేర్చారని గుర్తు చేశారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీ 78 జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 78 కిలోల కేక్‌ను పీసీసీ మాజీ అధ్యక్షులు వి.హనుమంతరావు కేక్ కట్ చేశారు.

ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించడం ద్వారా ప్రజలు సోనియమ్మకు కృతజ్ఞతలను వ్యక్తం చేశారని తెలిపారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేందుకు ప్రజలు తనకు ఈ బాధ్యతను అప్పగించారని చెప్పారు. ఒక సేవకుడిగా ప్రజలందరి ఆకాంక్షలు నెరవేర్చే బాధ్యతను తీసుకుంటాననీ, కార్యకర్తలకు కచ్చితంగా న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ ఇంచార్జి మాణిక్ రావు ఠాక్రే, కాంగ్రెస్ కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీతక్క, కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు కోదండరెడ్డి, జి.నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

లెక్కకు లెక్క..దెబ్బకు దెబ్బ

(మొదటిపేజీ తరువాయి)

పన్నులు, ఇతర మార్గాల ద్వారా వచ్చిన ఆదాయాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం ఎలా వినియోగించిందనే విషయమై అవగాహన చేసుకునే పనిలో ఉన్నారు. విద్యుత్ కొనుగోలు విషయమై మన రాష్ట్రంతోపాటు ఇతర రాష్ట్రాల్లోని పరిస్థితిపై అధ్యయనం చేస్తున్నారు. ఉచిత విద్యుత్ విషయంలోనూ వివరాలు కావాలనీ, నివేదిక ఇవ్వాలని ఇప్పటికే విద్యుత్ శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధానకార్యదర్శి సునీల్‌శర్మను ఆదేశించారు. అయితే అప్పట్లో ఏం జరిగిందో పూర్తిస్థాయి పరిశీలన అనంతరమే చర్యలకు దిగాలనే ఆలోచనలో ఉన్నట్టు తెలిసింది. ఆషామాషీగా ముందుకెళ్లి ఆభాసుపాలయ్యే కంటే, ఆచితూచి అడుగులేస్తూ అవినీతిపరుల పీచమణిచే దిశగా సమాచారాన్ని సమకూర్చుకోవాలనే భావనలో సీఎం ఉన్నట్టు సమాచారం. ఆయా అంశాలపై న్యాయనిపుణులతో కూడా చర్చించే అవకాశాలు ఉన్నాయి. ప్రతిపక్షనాయకుడిగా ప్రజావ్యతిరేక విధానాలపై ఎలాంటి పోరాటం చేశారో, కేసులు వేశారో అదే స్ఫూర్తితో అధికారంలోకి వచ్చాక ప్రజాకోణం నుంచే పనిచేసేందుకు సంసిద్ధులైనట్టుగా సీఎం కనిపిస్తున్నారు. విద్యుత్ వ్యవహారంలో సమీక్ష సమావేశానికి ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు పిలిచినా రాలేదు. దీనిపై సమగ్ర వివరాలు తెలియాలంటే అవసరమైతే ఆయనపై కేసుపెట్టి, అరెస్ట్ చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్టు సచివాలయ వర్గాల్లో చర్చ చోటుచేసుకుంటున్నది. మాజీ సీఎం కేసీఆర్‌ను ఆసరాగా చూసుకుని, ప్రభాకర్‌రావు గతంలో ఆర్థిక శాఖకు చెందిన ఒక ఉన్నతాధికారితో విభేదించి, ఆయన్ను టార్గెట్ చేశారనే ప్రచారమూ ఉంది. విద్యుత్ కొనుగోలు వ్యవహారం సాంతం అడ్డగోలుగా ఉందని అధికారులే అంటుండటం రేవంత్ సర్కారుకు ఊతమిచ్చినట్టవుతున్నది.

బీఆర్ఎస్ పతనానికి కాళేశ్వరం ప్రాజెక్టు కూడా ఒక కారణమని అందరికీ తెలిసిందే. ఎన్నికల ఫలితాల అనంతరం బీఆర్ఎస్ శ్రేణులు సైతం అంగీకరిస్తున్నాయి. దీనిపై కేసీఆర్ కుటుంబంలోనూ అంతర్గతంగా వాగ్వివాదం జరిగినట్టు సమాచారం. అయతే దీనిపై కూడా రేవంత్ ప్రభుత్వం ఆరా తీసున్నది. కేంద్ర ప్రభుత్వ ఆడిట్ సంస్థ కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) ప్రకారం కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి రూ. 1.26 లక్షల కోట్లు ఖర్చుపెట్టారు. అయినా పనులు నాణ్యంగా జరగలేదు. మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల కుంగుబాటే ఇందుకు నిదర్శనం. దీంతో ఈ ప్రాజెక్టుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ(ఎన్‌డిఎస్‌ఏ) సైతం ప్రమాణాల ప్రకారం నిర్మాణం జరగలేదని తేల్చింది. దీనిపై ఆయా రాజకీయపార్టీలన్నీ బీఆర్ఎస్ సర్కారుపై విమర్శల దాడికి దిగాయి. దీనికోసం ఖర్చుపెట్టిన వ్యయంలో కనీసం 30 నుంచి 40 శాతం నిధులు అవినీతిబొక్కసాల్లోకి వెళ్లాయనే ఆరోపణలు విపరీతంగా వచ్చిన విషయం విదితమే. దీనిపై సీఎం గట్టిగానే ఆరా తీస్తున్నట్టు తెలిసింది. మాజీ ముఖ్యమంత్రిపై ప్రతికారంతో కాకుండా విలువైన ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారనే కోణంలో పరిశీలిస్తున్నట్టు సమాచారం.ఇందుకు అధికారులను సైతం బాధ్యులను చేయాలని అనుకుంటున్నారు. అలాగే అవుటర్ రింగ్‌రోడ్డు(ఓఆర్ఆర్) వెంట ఉన్న అసైన్డ్ భూముల కేటాయింపులపై కూడా వివరాలు సేకరించే పనిలో రేవంత్ సర్కారు ఉందనే ప్రచారం ఇప్పటికే ఉంది.

ప్రభుత్వ సలహాదారుల నియామకాలు రద్దు

ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీఆర్ఎస్ హయాంలో నియమితులైన ప్రభుత్వ సలహాదారుల నియామకాలను కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ సర్కార్ రద్దు చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) శాంతికుమారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో సలహాదారులుగా నియమితులైన రాజీవ్ శర్మ, అనురాగ్ శర్మ, ఏకే ఖాన్, సోమేశ్‌కుమార్, జీఆర్ రెడ్డి, ఆర్.శోభ, చెన్నమనేని రమేష్ నియామకాలను ప్రభుత్వం రద్దు చేసింది.

నేడు హైదరాబాద్‌లో ఐఎల్‌పీఏ జాతీయ సమావేశాలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (ఐఎల్‌పీఏ) జాతీయ మూడో సమావేశాలు హైదరాబాద్‌లో జరగనున్నాయి. శనివారం మీడియాతో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పొన్నం దేవరాజ్‌గౌడ్, జాతీయ కార్యదర్శి విజయ్ డానియల్ మాట్లాడుతూ ఆదివారం ఉదయం పది నుంచి సాయంత్రం వరకు హైదరాబాద్‌లోని మాసబ్‌ట్యాంక్‌లో ఉన్న ఫైన్ ఆర్ట్స్ కాలేజీలో ఈ సమావేశాలు జరుగుతాయని వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి సుదర్శన్‌రెడ్డి హాజరవుతారని అన్నారు. గ్రామీణ న్యాయవాదులు చట్టాలపై ఆంగ్లంలో పట్టు సాధించడం ఎలా అనే అంశంపై శిక్షణా కార్యక్రమాలుంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు మల్లెల భాస్కర్, పి మల్లేష్, మోషే మార్పు, గంగెయుడు, డేవిడ్, లక్ష్మిదేవి, బిక్షపతి, కేరిత్‌కుమారి, యాదయ్య, హేమలత, లావణ్య, తులసి, రమణ తదితరులు పాల్గొన్నారు.

జీ20 ప్రెసిడెన్సీ, సమ్మిట్ కోసం రూ.1310 కోట్లు కేటాయింపు

- కేంద్రం వెల్లడి

న్యూఢిల్లీ : భారతదేశం జీ20 ప్రెసిడెన్సీ, లీడర్స్ సమ్మిట్ కోసం రూ.1,310 కోట్ల రూపాయలు కేటాయించినట్టు కేంద్రం తెలిపింది. "2022-23 ఆర్థిక సంవత్సరంలో భారతదేశపు జీ20 ప్రెసిడెన్సీ, సమ్మిట్ కోసం విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) కు ఆర్థిక మంత్రిత్వ శాఖ కేటాయించిన బడ్జెట్ రూ. 320 కోట్లు. 2023-24 ఆర్థిక సంవత్సరం లో ఇది రూ. 990 కోట్లు" అని విదేశీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి వి.మురళీధరన్ తెలిపారు.

జీ20 సమ్మిట్‌కు ఆర్థిక మంత్రిత్వ శాఖ కేటా యించిన మొత్తం బడ్జెట్‌పై టీఎంసీ ఎంపీ సాకేత్ గోఖలే అడిగిన ప్రశ్నకు ఆయన పైవిధంగా సమాధానమి చ్చారు. డిసెంబర్ 1, 2022 నుంచి ఈ సంవత్సరం నవంబర్ 30 వరకు భారత్‌లోని 60 నగరాల్లో 250 కంటే ఎక్కువ అధికారిక ట్రాక్ సమావేశాలు, వందలాది సంబంధిత ఈవెంట్‌లు నిర్వహించబడ్డాయి. అలాగే, ఈ ఏడాది సెప్టెంబర్ 9-10 తేదీల్లో న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జీ20 లీడర్స్ సమ్మిట్ జరిగింది. ఈ సమావేశానికి జీ20 సభ్యదేశాల అధ్యక్షులు (కొన్ని దేశాలు మినహా) హాజరైన విషయం తెలిసిందే.

కీచక ప్రిన్సిపాల్

నిన్న జింద్.. నేడు కైతాల్

- లైంగిక వేధింపులకు పాల్పడిన ప్రధానోపాధ్యాయుడు
- పాఠశాల విద్యార్థినుల ఆరోపణలు
- హర్యానాలో మరో ఘటన

చండీగఢ్ : బీజేపీ పాలిత హర్యానాలో పాఠశాలల్లో విద్యార్థినుల కు భద్రత కరువైంది. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాల్లో వరుసగా నమోదవుతున్న లైంగిక వేధింపుల ఘటనలే ఇందుకు నిదర్శనం. కైతాల్ జిల్లాలో ఇలాంటి ఘటనే ఒకటి వెలుగు చూసింది. జిల్లాలో గల ఒక గ్రామంలోని ప్రభుత్వ సీనియర్ సెకండరీ పాఠశాలలో ఇద్దరు 12వ తరగతి విద్యార్థులు డిసెంబర్ 4న లైంగిక వేధింపుల కేసును నివేదించారు. బాలికలు తమ మౌనాన్ని వీడి పాఠశాల ప్రధానోపాధ్యాయుడి రవి కుమార్‌పై లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. వేధింపులు చాలా రోజులుగా కొనసాగాయనీ, దాని గురించి మాట్లాడితే ప్రిన్సిపాల్ తమను బెదిరించేవాడని బాలికలు తమ ఫిర్యాదులో ఆరోపించారు. కాగా, పాఠశాల ప్రిన్సిపాల్‌ను పోలీసులు అరెస్టు చేశారు.

పాఠశాల అధికారులు కొన్ని పనుల కోసం నియమించిన నిర్మాణ కాంట్రాక్టర్‌పై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు. సదరు కాంట్రాక్టర్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. "కాంట్రాక్టర్, ప్రిన్సిపాల్ కలిసి మధ్యాహ్న భోజనం చేస్తే వారికి మధ్యాహ్న భోజనం, నీళ్లు అందించాలని ఒత్తిడి చేశారు. కాంట్రాక్టర్ ఎటువంటి కారణం లేకుండా తరచుగా మా తరగతి గదులకు వచ్చేవాడు. వేధింపులు చాలా రోజులుగా కొనసాగాయి" అని బాలికలు తమ ఫిర్యాదులో ఆరోపించారు. మేజిస్ట్రేటు ముందు ఇద్దరు విద్యార్థుల వాంగ్మూలాల తర్వాత, ఈ కేసులో కాంట్రాక్టర్‌పై పోక్సో చట్టంలోని సెక్షన్ 10 కింద, ఐపీసీలోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశామని పోలీసు అధికారి వెల్లడించారు. బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామనీ, దోషులకు శిక్ష పడేలా చేస్తామని చెప్పారు.

హర్యానాలోని జింద్ జిల్లాలోని ఒక ప్రభుత్వ పాఠశాలలో ప్రిన్సిపాల్‌పై గత నెలలో 142 మంది విద్యార్థినులు శారీరక, మానసిక హింసకు సంబంధించిన సాక్ష్యాలను అందించిన విషయం తెలిసిందే. అయితే, కొన్ని రోజుల వ్యవధిలోనే తాజా ఘటన చోటు చేసుకోవటంపై సామాజిక కార్యకర్తలు, మహిళా సంఘాలు ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్రంలో చిన్నారులు, బాలికలు, విద్యార్థినులు, మహిళలకు భద్రత కల్పించాలనీ, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

అప్పు తీర్చలేదని దంపతుల దారుణ హత్య

ముందు భర్తను హతమార్చి పాతిపెట్టిన వైనం

- విషయం బయటికి రాకుండా భార్యను సైతం హత్య



(ఫైల్)

నవతెలంగాణ-బంజారా హిల్స్

అప్పు తీర్చడం లేదని కక్షతో దంపతులను గుర్తుతెలియని దుండగులు దారుణంగా హత్య చేసిన ఘటన హైదరాబాద్ ఫిల్మ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫిలింనగర్‌లోని సత్యకాలనీ పయోనీర్ ఎన్‌క్లేవ్‌లో సయ్యద్ అహ్మద్ ఖాద్రీ(42), సయీదా మిరాజ్ ఫాతిమా(40) నివాసం ఉంటున్నారు. వీరికి 2014లో వివాహం అయింది. సయ్యద్ అహ్మద్ ఖాద్రీ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. మేకల వ్యాపారం కోసం ముంబయికి చెందిన వ్యాపారుల నుంచి రూ. 20 లక్షలు అప్పుగా తీసుకున్నారు. అయితే మూడేండ్లుగా వారికి అప్పు తిరిగి చెల్లించలేదు. దాంతో ఈ నెల 2న ముంబయి వ్యాపారులు హైదరాబాద్‌కు వచ్చి టోలిచౌకీలో ఆశ్రయం పొందారు. 3వ తేదీన ఖాద్రిని కిడ్నాప్ చేసి ఓ చెరువు వద్ద హత్య చేసి అక్కడే పాతిపెట్టారు. ఫాతిమా ద్వారా ఈ విషయం బయటపడుతుందని భావించిన ముగ్గురు వ్యాపారులు మరుసటి రోజు ఆమె ఇంటికి వెళ్లి ఫాతిమాకి ఉరివేసి చంపారు. ఎవరికి అనుమానం రాకుండా గ్యాస్ లీక్ చేసి బయటి నుంచి తాళం వేసి వెళ్లిపోయారు.

నాలుగు రోజుల క్రితం ఫాతిమాకు తన సోదరి సైయెదా మెహర్ ఫాతిమా ఎన్నిసార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదు. దాంతో ఆమె నేరుగా ఇంటికి వచ్చి చూడగా ఇంటి నుంచి గ్యాస్ వాసన వచ్చింది. దాంతో ఆమె తలుపులు బద్దలు కొట్టి చూడగా ఫాతిమా ఉరివేసుకుని కనిపించింది. పిల్లలు పుట్టకపోవడంతో ఫాతిమాను ఆమె భర్త ఖాద్రి చంపి పారిపోయాడని అనుమానించి ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని దంపతుల ఇంటి పరిసర ప్రాంతాల్లో, సీసీ పుటేజీని పరిశీలించారు. ఇంటి లోపల నుంచి ముగ్గురు వ్యక్తులు బయటికి వస్తున్నట్టుగా కనిపించిన దృశ్యాలను పోలీసులు గుర్తించారు. ఆ తర్వాత వారిని గుర్తించి శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఏ1 అజ్గర్ షేక్ అలియాస్ అన్వర్ అన్ను, ఏ2 మహమ్మద్ హుస్సేన్ అలియాస్ సమీర్, ఏ3 మోహిత్ సల్మాన్ అలియాస్ అద్దులపై సెక్షన్ 302, 120 బి,379, అలాగే 498ఏ,201 ఐపీసీ ప్రకారం కేసు నమోదు చేసినట్టు ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

నిత్యం ప్రజల కోసం పని చేస్తాం

- డాక్టర్ జి.రంజిత్ రెడ్డి

నవతెలంగాణబ్యూరో- హైదరాబాద్

అధికారం ఉన్నా, లేకున్నా నిత్యం ప్రజల కోసం పని చేయడమే తమ గురుతర బాధ్యత అని చేవెళ్ల ఎంపీ డాక్టర్ జి.రంజిత్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతిపక్ష పార్టీది బాధ్యతాయుతమైన పాత్ర అని తెలిపారు.

ఎక్కడ ఉన్నా ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతూ బాధ్యతాయుతమైన ప్రతిపక్ష పాత్రను బీఆర్ఎస్ పోషిస్తుందని చెప్పారు. మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వంలో ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తూనే ప్రభుత్వానికి నిర్మాణాత్మక సలహాలు, సూచనలు అందిస్తామని తెలిపారు.

నేను ఎలాంటి సమాధానాన్నీ ఆమోదించలేదు

పార్లమెంట్‌లో 'హమాస్ సంస్థ'పై కేంద్ర మంత్రి మీనాక్షి

న్యూఢిల్లీ : పాలస్తీనాకు చెందిన హమాస్ సంస్థపై పార్లమెంటులో ఒక ప్రశ్నకు సంబంధించి వివాదం చెలరేగుతున్నది. హమాస్‌ను భారత్‌లో ఉగ్రవాద సంస్థగా ప్రకటించడంపై పార్లమెంటులో అడిగిన ప్రశ్నకు తాను ఎలాంటి జవాబునూ ఆమోదించలేదని కేంద్ర మంత్రి మీనాక్షి లేఖి స్పష్టం చేశారు.

జర్నలిస్ట్ సిధాంత్ సిబల్ శుక్రవారం లేఖి పేరును సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లో ప్రస్తావిస్తూ పార్లమెంట్ వెబ్‌సైట్ నుంచి అధికారిక ప్రతిస్పందనను పోస్ట్ చేసిన తర్వాత ఇది జరిగింది. లేఖి శనివారం సిబల్ చేసిన ట్వీట్‌పై స్పందించారు. "నేను ఈ ప్రశ్నతో ఏ పేపర్‌పై సంతకం చేయలేదు. మీకు తప్పుడు సమాచారం అందింది" అని కేంద్ర మంత్రి అన్నారు. పార్లమెంటు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న ప్రశ్నను కాంగ్రెస్ లోక్‌సభ ఎంపీ కె సుధాకరన్ సంధించారు. భారతదేశంలో హమాస్‌ను ఉగ్రవాద సంస్థగా ప్రకటించే ప్రతిపాదన ఏమైనా ఉందా అని సదరు ఎంపీ కేంద్రాన్ని ప్రశ్నించారు. హమాస్‌ను ఉగ్రవాద సంస్థగా ప్రకటించాలని ఇజ్రాయెల్ ప్రభుత్వం భారత అధికారులకు ఏమైనా డిమాండ్ చేసిందా అని కూడా అడిగారు.

ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసు

- మద్యం కంపెనీ పెర్నోడ్ రికార్డ్ ప్రాంతీయ అధిపతికి ఊరట
- బెయిల్ మంజూరు చేసిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ : ఢిల్లీ ప్రభుత్వం ప్రస్తుతం రద్దు చేసిన ఎక్సైజ్ పాలసీలో అవకతవకలు జరిగాయని ఆరోపించిన కేసులో అరెస్టయిన మద్యం కంపెనీ పెర్నోడ్ రికార్డ్ ప్రాంతీయ అధిపతి బెనోయ్ బాబుకు ఊరట లభించింది. సుప్రీంకోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసింది.

ఈ కేసులో మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు చేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ).. కంపెనీ రీజినల్ హెడ్ బెనోయ్ బాబును గతేడాది నవంబర్‌లో అరెస్టు చేసిన విషయం విదితమే. బాబు తరపు సీనియర్ న్యాయవాది హరీష్ సాల్వే వాదించారు. బెనోయ్ బాబు కంపెనీలో జూనియర్ హోదాలో ఉన్నారనీ, కంపెనీ పాలసీ మేకింగ్‌లో ఎలాంటి పాత్ర లేదని కోర్టుకు నివేదించారు. పాలసీ ఆమోదం పొందిన తర్వాతే కేసులోని ఇతర నిందితులను మాత్రమే బాబు కలిశారని సాల్వే కోర్టుకు తెలిపారు.

ఎలాంటి అభియోగాలు నమోదు చేయకుండా ఈడీ ఒకరిని 13 నెలల పాటు జైలులో ఉంచడానికి వీల్లేదని జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎస్‌విఎన్ భట్టిలతో కూడిన ధర్మాసనం అభిప్రాయపడింది. సీబీఐ, ఈడీ ఆరోపణల మధ్య వైరుధ్యాలు కనిపిస్తున్నాయని అత్యున్నత న్యాయస్థానం తెలిపినట్టు సమాచారం. ఈ మేరకు బెనోయ్ బాబుకు బెయిల్‌ను మంజూరు చేస్తూ సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

లోపాలను సమీక్షించుకుంటాం ప్రజలపక్షాన ఉంటాం

ప్రజాసమస్యలకే సీపీఐ(ఎం) అధిక ప్రాధాన్యత : జూలకంటి రంగారెడ్డి



నవతెలంగాణ-సూర్యాపేట

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ వైపు నుండి జరిగిన లోపాలను సమీక్షించుకొని, జరిగిన పొరపాట్లను సరిదిద్దుకుంటామని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లాకేంద్రం లోని మల్లు వెంకటనర్సింహారెడ్డి భవన్‌లో నిర్వహించిన సూర్యాపేట జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఐ(ఎం), ప్రజా సంఘాల నుండి రావాల్సిన ఓట్లను ఎన్నికలో రాబట్టలేకపోయామన్నారు. దీనిపై పార్టీ ఆత్మపరిశీలన చేసుకొని ముందుకు సాగుతామన్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లకు సంబంధించిన వారు విచ్చలవిడిగా డబ్బు, మద్యం వంటి అనేక రకాలుగా ప్రలోభాలకు గురిచేసి ఓట్లను ఆకర్షించే విధంగా చేశారని విమర్శించారు. ఈ ఎన్నికల్లో పార్టీకి వ్యతిరేకంగా పని చేసిన వారిపై చర్చించి పార్టీ వారు ఎంతటి వారైనా పార్టీ చర్యలు తీసుకుంటుందన్నారు. వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు.పార్టీ క్యాడర్ మరింత ప్రజలకు దగ్గరకు కావాలన్నారు. ప్రజాసమస్యలపై నిరంతరం పోరాడాలని పార్టీ నిర్మాణాన్ని చక్కదిద్దుకోవాలని సూచించారు.కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు అభినందనలు తెలియజేస్తున్నామని చెప్పారు. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలు అన్నింటిని చిత్తశుద్ధితో అమలు చేయాలని కోరారు.కాంగ్రెస్ చేసే ప్రతి మంచి పనికి పార్టీ మద్దతు, సహకారం ఎల్లవేళలా ఉంటుందన్నారు. కమ్యూనిస్టులకు ఓట్లు, సీట్లు ముఖ్యం కాదని, ప్రజా సమస్యలకే అధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఓడినా,గెలిచినా ప్రజా సమస్యల పరిష్కారం కోసం జరిగే పోరాటంలో ముందువరుసలో ఉంటామన్నారు.పార్టీ జిల్లాకార్యదర్శివర్గ సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు మల్లులక్ష్మీ, జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పారేపల్లి శేఖర్‌రావు, మట్టిపల్లి సైదులు, మేదరమెట్ల వెంకటేశ్వరరావు, కోట గోపి, చెరుకు ఏకలక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు స్వేచ్ఛావాయువులు

పీల్చుకుంటున్నారు..కూనంనేని



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రజలు పదేండ్లుగా ఉక్కిరి బిక్కిరయ్యారనీ, ఈ రోజు స్వేచ్ఛా వాయువులు పీల్చుకుంటున్నారని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం అసెంబ్లీలోని మీడియా పాయింట్ వద్ద ఆయన సీపీఐ జాతీయ నాయకులు చాడ వెంకటరెడ్డితో కలిసి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరించారన్నారు. ఒక్కరైనా కమ్యూనిస్టు నేత అసెంబ్లీలో ఉండాలనీ, ఉంటే పేద వర్గాలకు కొండంత అండ ఉంటుందని తనకు అవకాశమిచ్చా రన్నారు. అవినీతికి వ్యతిరేకంగా పోరాడు తానని తెలిపారు. పేద వర్గాల సమస్యలు ప్రభుత్వం ముందుంచే బాధ్యత తనపై ఉందని చెప్పారు. జర్నలిస్టుల సమస్యలు పరిష్కారం కావాలన్నారు. కాంగ్రెస్ పార్టీ సహకారంతో గెలిచినప్ప టికీ ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసు కెళ్లడం తన బాధ్యతని చెప్పారు. ఉపా లాంటి చట్టాలు పోవాలని ఆకాంక్షిం చారు. ధరణి అనేక సమస్యలున్నాయనీ, వాటి పరిష్కారం కోసం కృషి జరగాలని అన్నారు.



అసెంబ్లీ ప్రొటెం స్పీకర్‌గా అక్బరుద్దీన్‌తో

ప్రమాణం చేయించిన గవర్నర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎంఐఎం పార్టీకి చెందిన చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ ప్రొటెం స్పీకర్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. శనివారం ఉదయం 8.30 గంటలకు రాజ్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్ ఆయన చేత ప్రమాణ స్వీకారం చేయించారు. సాధారణంగా సీనియర్ సభ్యులకు ప్రొటెం స్పీకర్ బాధ్యతలు అప్పగించడం ఆనవాయితీగా వస్తున్నది. ఇందులో భాగంగా ఆ బాధ్యతలు నిర్వహించాలని అక్బరుద్దీన్‌ను కోరగా అందుకాయన అంగీకరించారు. ప్రొటెం స్పీకర్ ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతోపాటు మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఇతర పార్టీల ఎమ్మెల్యేలు హాజరయ్యారు.

అధ్యక్షా.. ఇంతలో ఎంత మార్పు...

సరిగ్గా నాలుగు నెలల ముందున్న సీన్ రివర్స్

- ఆనాడు అధికార పక్షమైన బీఆర్‌ఎస్-నేడు ప్రతిపక్ష హోదాలో
- అప్పట్లో పట్టుమని పది స్థానాల్లేని కాంగ్రెస్ - ఇప్పుడు అధికార పక్షంగా
- మంత్రి కాకుండా ఏకంగా ముఖ్యమంత్రి స్థానంలో రేవంత్
- కేసీఆర్, కేటీఆర్ లేకుండానే సభ
- సాధారణ సభ్యుడిగా మాజీ స్పీకర్ పోచారం
- అసెంబ్లీలో గులాబీ పార్టీకి పెద్ద దిక్కయిన హరీశ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

'ఓడలు బండ్లవుతాయి.. బండ్లు ఓడలవుతాయి...' రాష్ట్ర మూడో శాసనసభ తొలి సమావేశాన్ని తిలకించిన వారికెవరికైనా ఈ సామెత గుర్తుకు రాకమానదు. సరిగ్గా నాలుగు నెలల క్రితం (ఈ యేడాది ఆగస్టు మూడున) ప్రారంభమైన అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లో బీఆర్‌ఎస్ అధికార పక్షంగా వ్యవహరించింది. అప్పుడు ప్రతిపక్ష హోదాలో కేవలం ఐదుగురు సభ్యులతో ఉన్న కాంగ్రెస్... ఇప్పుడు 64 మందితో అధికార పక్షంలో కూర్చుంది. 'కుడి ఎడమైతే...' అనే రీతిలో శాసనసభలో ఆనాటి సీన్ రివర్సయింది. రేవంత్ సారథ్యంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత శనివారం తొలిసారిగా నిర్వహించిన శాసనసభా సమావేశంలో పదేండ్లపాటు అధికారపక్షంగా వ్యవహరించిన బీఆర్‌ఎస్ జ్ఞాపకాలతోపాటు ఇప్పటి దృశ్యాలు ఆసక్తికరంగా మారి చర్చనీయాంశమయ్యాయి.

తొలుత ఉదయం 11.10 గంటలకు సభ ప్రారంభం కాగానే ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ ఓవైసీ... కొత్తగా ఎన్నికైన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. మొదటగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రమాణం చేశారు. మొన్నటి వరకూ బీఆర్‌ఎస్‌కు ఫ్రెండ్లీ పార్టీ అంటూ చెప్పుకున్న ఎంఐఎం నేతే... కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రొటెం స్పీకర్‌గా వ్యవహరించటం విశేషం. అదే సభలో మజ్లిస్‌ను తమ స్నేహితుడిగా పేర్కొన్న బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ లేకుండానే అసెంబ్లీ ప్రారంభమైంది. ఆయన శస్త్ర చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో ఉండటంతో సభకు హాజరు కాలేకపోయారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సైతం తన తండ్రి ఆపరేషన్ కోసం ఆస్పత్రిలోనే ఉండాల్సి రావటంతో గైర్హాజరయ్యారు. ఇలా బీఆర్‌ఎస్ జాతీయ అధ్యక్షుడు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఇద్దరూ సభకు రాలేని సమయంలో ఆ పార్టీకి పెద్ద దిక్కుగా మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు వ్యవహరించారు. మొన్నటిదాకా సభాపతి(స్పీకర్)గా వ్యవహరించిన సీనియర్ నేత పోచారం శ్రీనివాసరెడ్డి... ఇప్పుడు సాధారణ సభ్యుడిగా మారిపోవటం గమనార్హం.

ఇక తన రాజకీయ ప్రస్థానంలో ఎన్నో పదవులను నిర్వర్తించినప్పటికీ... ఒక్కసారి కూడా మంత్రి కాని రేవంత్‌రెడ్డి ఏకంగా ముఖ్యమంత్రి స్థానంలో ఆసీనులవటం ఈ సభలో హైలెట్‌గా నిలిచింది. గత సభ వరకూ మాట్లాడేందుకు అవకాశం కోసం, మైకు కోసం ఎదురు చూసిన మల్లు భట్టి విక్రమార్క...ఇప్పుడు సీఎం పక్క స్థానంలో ఉప ముఖ్యమంత్రి హోదాలో కూర్చోవటం ఆకర్షణగా నిలిచింది. గత సెషన్ వరకూ 'ఊ అంటే... ఎదురుదాడే' లక్ష్యంగా, ప్రతిపక్షాన్ని తూలనాడటానికే అసెంబ్లీకి వస్తున్నామన్నట్టు వ్యవహరించిన నలుగురైదుగురు (బీఆర్‌ఎస్) సభ్యుల స్థానాల్లో కొత్త ముఖాలు కనిపించాయి.

వామపక్షాలకు ప్రతినిధిగా ఉన్న సీపీఐ సభ్యుడు కూనంనేని సాంబశివరావు ప్రజల తరపున వాణిని వినిపించేందుకు సభలో అడుగుపెట్టారు. అధికార కాంగ్రెస్ సభ్యులందరూ మూడు రంగుల కండువాలను, బీఆర్‌ఎస్ సభ్యులు గులాబీ కండువాలను, సీపీఐ సభ్యుడు ఎర్ర కండువాతో శాసనసభకు విచ్చేశారు. ఎంఐఎం సభ్యులు ఎలాంటి కండువాల్లేకుండానే తమకే ప్రత్యేకమైన షేర్వాణీలతో సభలో కాలుమోపారు. ఎంఐఎంకి చెందిన సభ్యుడు ప్రొటెం స్పీకర్‌గా వ్యవహరిస్తున్న నేపథ్యంలో తాము సభను బహిష్కరిస్తున్నట్టు బీజేపీ సభ్యులు ప్రకటించిన విషయం విదితమే. మొత్తం మీద తొలి రోజు సభ ప్రమాణాలకే పరిమితమైనప్పటికీ...గతానుభవాలను గుర్తు చేస్తూ సరికొత్త దృశ్యాలను ఆవిష్కరించింది.

అమరులకు బీజేపీ, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ఎమ్మెల్యేల నివాళులు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అసెంబ్లీ సమావేశాల మొదటి రోజు శనివారం ఉదయం బీజేపీ, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు అమరవీరులకు నివాళులర్పించారు. హైదరాబాద్‌లో అసెంబ్లీ ఎదురుగా ఉన్న గన్‌పార్కు వద్ద అమరవీరుల స్థూపానికి ముందుగా బీజేపీ ఎమ్మెల్యేలు నివాళులర్పించారు. ఆ పార్టీ నుంచి ఎనిమిది మంది ఎమ్మెల్యేలు గెలవగా గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ తప్ప మిగిలిన ఎమ్మెల్యేలు అమరులను గుర్తు చేసుకున్నారు. బీఆర్‌ఎస్ శాసనసభ్యులు, మాజీ మంత్రులు హరీశ్ రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, మల్లారెడ్డి, కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్ రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, లాస్య నందిత సాయన్న తదితర ఎమ్మెల్యేలు అమరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా జై తెలంగాణ అంటూ నినాదాలు చేశారు. అనంతరం కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వివేక్ తో పాటు ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి గెలుపొందిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, వేముల వీరేశం, మందుల సామ్యేల్ తదితరులు అమరవీరుల స్థూపానికి నివాళులర్పించారు.

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం హర్షణీయం : ఆప్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడం పట్ల ఆప్ మహిళా విభాగం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హేమ జిల్లోజు, నర్సింగ్ యమునా గౌడ్‌లు హర్షం వ్యక్తం చేశారు. శనివారం హైదరాబాద్ లోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్‌తో కలసి వారు మాట్లాడారు. హేమ జిల్లోజు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ విజయానికి ఆప్ మ్యానిఫెస్టోనూ కాపీ కొట్టడమే కారణమని తెలిపారు. ఢిల్లీ, పంజాబ్‌లో ఉచిత విద్య, వైద్యం, నీరు, విద్యుత్తు, మహిళలకు ఉచిత రవాణా, నెలవారీ భత్యం గురించి ఆప్ చేసిన వాగ్దానాలు సక్రమంగా అమలు చేస్తున్నదని గుర్తుచేశారు. తమ పార్టీ మ్యానిఫెస్టోను కాపీ కొట్టినా సరే.... వాటిని సక్రమంగా అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆప్ అధికార ప్రతినిధి అఫ్సహ్, నేతలు మౌనిక, వైశాలి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పదవులకు పల్లా, కడియం, కౌశిక్‌రెడ్డి రాజీనామా

- ఆమోదించిన మండలి చైర్మెన్ గుత్తా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎమ్మెల్సీ పదవులకు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కడియం శ్రీహరి, పాడి కౌశిక్ రెడ్డి రాజీనామా చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ నుంచి పల్లా రాజేశ్వర్‌రెడ్డి, స్టేషన్ ఘన్‌పూర్ నుంచి కడియం శ్రీహరి, హుజురాబాద్ నుంచి పాడి కౌశిక్‌రెడ్డి ఎమ్మెల్యేలుగా గెలుపొందిన విషయం తెలిసిందే. దీంతో వారు ఎమ్మెల్సీ పదవులకు రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా పత్రాలను శాసన మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డిని శనివారం కలిసి అందజేశారు. వారి రాజీనామాలను ఆయన వెంటనే ఆమోదించారు. నిబంధనల ప్రకారం 15 రోజుల్లోపు వారికున్న పదవుల్లో ఏదో ఒక సభ్యత్వానికి రాజీనామా చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో వారు ఎమ్మెల్సీ పదవులకు రాజీనామా చేశారు. ఖాళీ అయిన ఈ స్థానాలకు ఎన్నికల కమిషన్ ఆరు నెలల్లో ఎన్నికలను నిర్వహిస్తుంది.





మహిళల హర్షం

- ఆర్టీస్ బస్సుల్లో ఫ్రీ జర్నీ ప్రారంభం
- కిటకిటలాడిన బస్సులు, బస్టాండ్‌లు
- అట్టహాసంగా బస్సుల అలంకరణ
- మాకో వరం అంటున్న బాలికలు
- ప్రభుత్వానికి మహిళల కృతజ్ఞతలు
- టికెట్ల కోసం త్వరలో ప్రత్యేక సాఫ్ట్‌వేర్

నవతెలంగాణ-విలేకరులు

ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించే మహాలక్ష్మి పథకం పట్ల రాష్ట్రవ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. శనివారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఈ పథకం ప్రారంభమైంది. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఒకటైన మహాలక్ష్మి ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణ సౌకర్యానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టడం పట్ల మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. ఎంజీబీఎస్, జేబీఎస్ బస్‌స్టేషన్‌ల్లో పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించడానికి మొగ్గుచూపడంతో దాదాపు అన్ని బస్ స్టేషన్‌లు మహిళలతో కిటకిటలాడాయి. హైదరాబాద్‌లోని ప్రధాన బస్‌స్టేషన్‌లో బాలికలు, మహిళలు ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించారు. శనివారం హాలీ డే ఉండడంతో కొంచెం రద్దీ తక్కువగా ఉందని అధికారులు తెలిపారు. సోమవారం నుంచి రద్దీ పెరిగే అవకాశం ఉందన్నారు. టికెట్ల కోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపొందిస్తున్నట్టు తెలిపారు. ఇది వారం రోజుల్లో అందుబాటులోకి వస్తుందన్నారు.

హైదరాబాద్ నగరంలోని 25 ఆర్టీసీ డిపోల నుంచి 2800 బస్సుల్లో ఏసీ బస్సులు మినహాయించి మిగతా అన్ని బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించింది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మొత్తం 589 బస్సులను ఆర్టీసీ అధికారులు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమంలో దాదాపు అన్ని బస్సుల్లో 70శాతం వరకు మహిళలే ప్రయాణం చేసినట్టు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఈ రోజు కేవలం సాంపిల్ టికెట్లు ఇచ్చినట్టు చెప్పారు. ఉచిత బస్ సర్వీసుల ప్రారంభం తమకు ఒక వరమని, ఇది తమకు చెప్పలేని ఆనందం అని పలువురు మహిళలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి మహిళలు కృతజ్ఞతలు చెప్పారు. ఫ్రీ జర్నీతో రద్దీ పెరుగుతుందని, అందుకునుగుణంగా బస్సులు పెంచి ఇబ్బందులు లేకుండా చూడాలని మహిళలు కోరుతున్నారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 7 డిపోల పరిధిలోని బస్టాండ్లు మహిళా ప్రయాణికులతో కిటకిటలాడాయి. పెద్దమొత్తంలో మహిళా ప్రయాణికులే శనివారం ప్రయాణం చేశారు. డిపో అధికారులు బస్టాండ్లలను అందంగా పూలు, మామిడి తోరణాలతో ముస్తాబు చేశారు. భద్రాద్రి, ఖమ్మం జిల్లాల్లో కలెక్టర్లు ప్రారంభించారు. ఖమ్మం రీజియన్ పరిధిలో ఎక్స్‌ప్రెస్‌లు 173, పల్లెవెలుగు 194, మొత్తం 367 బస్సులు రవాణా కొనసాగించాయి. ప్రతీ రోజు రీజియన్ పరిధిలో 1,17,000 మంది మహిళా, పురుష ప్రయాణికులు ప్రయాణం చేస్తుంటారని ఆర్‌ఎం తెలిపారు. మహిళా ప్రయాణికులు 47000 మంది ఉంటారని చెప్పారు. శనివారం మహిళా ప్రయాణికులకు టిక్కెట్ ఇవ్వలేదు కాబట్టి ఎంత మంది ప్రయాణికులు ప్రయాణించారన్నది వివరాలు తెలియదని చెప్పారు. ఆదిలాబాద్ జిల్లాలో కలెక్టర్ రాహుల్‌రాజ్ ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని ప్రారంభించగా.. నిర్మల్‌లో కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావ్, మంచిర్యాలలో కలెక్టర్ బదావత్ సంతోష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు సంతోషాన్ని వ్యక్తం చేశారు. మహాలక్ష్మి పథకం మహిళా సాధికారతకు తొలి అడుగని సూర్యాపేట జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ అన్నారు. సూర్యాపేటలో మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డితో కలిసి మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించారు. నల్లగొండలో జిల్లా అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, భువనగిరిలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కార్యక్రమాలను కలెక్టర్ హనుమంతు జెండగే ప్రారంభించారు.

ఆనందకరం : నాగుల స్వరూప, ప్రయాణీకురాలు, బెజ్జంకి

కాంగ్రెస్ అధికారం చేపట్టిన రెండు రోజుల్లోనే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ హామీని అమలు చేయడం చాలా ఆనందకరం. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

మహిళలకు చేయూత : పావని, పరిగి

సోనియా గాంధీ జన్మదిన సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మహాలక్ష్మి పథకం తీసుకురావడం ఎంతో సంతోషంగా ఉంది. సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు. ఈ పథకం ద్వారా ఎంతో మంది మహిళలకు లబ్ది చేకూరుతుంది. చదువుకునే యువతులకు, ప్రయివేట్ ఉద్యోగాలు చేసే మహిళలకు ఈ పథకం ఎంతగానో మేలు చేకూరుస్తుంది.

అభినందనీయం

ఈ రోజుల్లో ఆర్టీసీ బస్సుల్లో అంతంత మాత్రమే ఆర్థిక స్థోమత కలిగిన బడుగు బలహీన వర్గాల ప్రజలు, వృద్ధులు అధికంగా ప్రయాణం సాగిస్తుంటారు. సంపన్న వర్గాల వారు ప్రయివేటు వాహనాల్లో ప్రయాణం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేయడం అభినందనీయం.

- అంజలి, మహిళా కండక్టర్, కరీంనగర్ డిపో

చాలా ఆనందంగా ఉంది : సిరామే శీతల్, ఉట్నూర్

మాది ఉట్నూర్ మండలం హస్నాపూర్ గ్రామం. మా బంధువులు ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఉంటారు. వారి దగ్గరకు వెళ్లి రావడానికి బస్‌లో వెళుతుంటాను. ఆర్డినరి బస్‌లో టికెట్ రూ.60, ఎక్స్‌ప్రెస్‌లో రూ.80 ధర ఉంది. నూతన ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో ఈ డబ్బును మేము ఆదా చేసుకోవచ్చు. మహిళల కోసం ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టడం చాలా ఆనందంగా ఉంది.

నాకు డబ్బులు మిగిలాయి : పద్మ, ఎం.వి బంజర, పెనుబల్లి

విఎం బంజర నుంచి ఖమ్మంకు వచ్చి.. మా ప్రాంతానికి తిరిగి వెళ్లే దానిని. అలా వెళ్లే క్రమంలో నెలకు సుమారు రెండు నుంచి మూడు వేల వరకు డబ్బులు ఖర్చు అయ్యేవి. మహాలక్ష్మి పథకం ద్వారా నాకు ఈ డబ్బులు మిగిలాయి. కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు..

స్టూడెంట్ పాస్ డబ్బులు మిగిలాయి.. : ప్రియాంక, సత్తుపల్లి

నేను చదువు కోసం సత్తుపల్లి నుంచి ఖమ్మంకు ప్రతిరోజు వెళ్తాను. నాకు స్టూడెంట్ పాస్ ఉంది. దీనికోసం కొంత చెల్లించేదానిని. ఇప్పుడు ఆ డబ్బులు కూడా లేకుండా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించినందుకు థాంక్స్..

సంతోషంగా ఉంది...బిందు, మునగాల

ప్రతిరోజూ మునగాల నుండి సూర్యాపేటలోని కాలేజీకి బస్సులో వస్తున్నాం. ఇందుకు గాను రానుపోను చార్జీలు రోజుకు రూ.60 అవుతున్నాయి. ప్రభుత్వం తెచ్చిన మహాలక్ష్మీ పథకంతో ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణంతో డబ్బులు ఆదా అవుతున్నాయి. చాలా సంతోషంగా ఉంది.

సందర్శకుల గ్యాలరీకి ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి శనివారం అసెంబ్లీ సందర్శకుల గ్యాలరీకి వచ్చారు. సాధారణ ప్రజల తరహాలో వచ్చిన ఆయన ఎమ్మెల్యేల ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని తిలకించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, ఇతర ఎమ్మెల్యేలు ప్రమాణస్వీకారం చేసిన తర్వాత ఆయన వెళ్లిపోయారు. అసెంబ్లీ సమావేశాల మొదటిరోజు సందడి వాతావరణం నెలకొంది. నూతన సభ్యుల ప్రమాణస్వీకారం ఉండడంతో వారి కుటుంబ సభ్యులు ఆ కార్యక్రమాన్ని తిలకించేందుకు వచ్చారు.

వీఆర్‌ఏలుగానే కొనసాగించాలి

వారసులకు ఉద్యోగాలివ్వాలి : జేఏసీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వివిధ శాఖలకు బదిలీ చేసిన తమను తిరిగి వీఆర్‌ఏలుగానే కొనసాగించాలని వీఆర్‌ఏ జేఏసీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 55 ఏండ్లు పైబడిన వీఆర్‌ఏ వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. ఐదు నెలల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద వీఆర్‌ఏ జేఏసీ సమావేశం జరిగింది. అందులో జేఏసీ రాష్ట్ర నాయకులు వంగూరు రాములు, గోవింద్, రాజయ్య మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం వీఆర్‌ఏలను ఇరిగేషన్, మిషన్ భగీరథ, మున్సిపాలిటీ, పశుసంవర్థక, తదితర శాఖలకు బదిలీ చేసిందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 20 వేల మంది వీఆర్‌ఏలున్నారనీ, వారిని ఇతర శాఖలకు పంపించడంతో అక్కడ పని చేయలేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీవో నెం.81, 85 ప్రకారం రాష్ట్రంలోని వీఆర్‌ఏలు చాలామంది ఇప్పటికే రిటైర్ అయ్యారనీ, మరి కొంతమంది ఒకటి, రెండు నెలల్లో రిటైర్మెంట్ కాబోతున్నారని చెప్పారు. 81, 85 జీవో ప్రకారం వారు నష్టపోయే ప్రమాదం ఉందని వాపోయారు. డిసెంబర్ 15న ప్రజాదర్బార్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, రెవెన్యూ శాఖామంత్రి, సీసీఎల్‌ఏ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం ఇస్తామన్నారు. ప్రభుత్వం స్పందనను బట్టి తదుపరి కార్యాచరణ చేపడుతామన్నారు. కార్యక్రమంలో గిరిరావు, నాగయ్య మల్సూర్, రాజు, యాకేష్, రాజేందర్, వెంకటస్వామి పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డికి అభినందనలు

- కొత్త రేషన్‌కార్డులివ్వాలి..ప్రజాపంపిణీ వ్యవస్థను పటిష్టం చేయాలి
- గుడిసెవాసులకూ ఇందిరమ్మ పక్కా ఇండ్ల పథకం వర్తింపజేయాలి : వ్యకాస

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నూతనంగా ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఎనుముల రేవంత్‌రెడ్డికి తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.నాగయ్య, ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు అభినందనలు తెలిపారు. ఈ మేరకు వారు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతిరోజూ ప్రజాదర్బార్ నిర్వహించడం మంచి పరిణామమని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను స్వాగతిస్తున్నామని తెలిపారు. ఉపాధి హామీ జాబ్ కార్డులు లేని కుటుంబాలు లక్షల్లో ఉన్నాయనీ, వారికి కార్డులివ్వాలని కోరారు. ఉపాధి హామీ చట్టం పనుల్ని వ్యవసాయానికి అనుసంధానిస్తామని చెప్పడం సరిగాదనీ, దాన్ని వెనక్కి తీసుకోవాలని విన్నవించారు. ఇంటిస్థలముంటే రూ.5 లక్షలు, ఎస్సీ, ఎస్టీ వారికి స్థలమిచ్చి రూ.6 లక్షలతో ఇందిరమ్మ పక్కా ఇండ్లు కట్టిస్తామని చెప్పడాన్ని స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో 69 కేంద్రాల్లో లక్ష పేద కుటుంబాలు గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నాయనీ, ఆ కుటుంబాలకూ ఇందిరమ్మ పక్కా ఇండ్ల పథకాన్ని వర్తింపజేయాలని కోరారు. రాష్ట్రంలో కొత్త రేషన్‌కార్డులివ్వాలనీ, 14 రకాల నిత్యావసర సరుకులను ఇవ్వడంతో పాటు ప్రజాపంపిణీ వ్యవస్థను బలోపేతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కోనేరు రంగారావు కమిటీ సిఫార్సుల మేరకు పేదలకు భూమి పట్టాలివ్వాలని కోరారు. ప్రజాప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కట్టుబడి పనిచేయాలని విజ్ఞప్తి చేశారు.

సంపాదకీయం

మన దేశంలో ఆవిర్భవించిన సాహిత్యాన్ని చదువుకోవచ్చు. ఆస్వాదించవచ్చు. అధ్యయనమూ చేయవచ్చు. కానీ కావ్యాలను, పురాణ కథలను వాస్తవిక చరిత్రగా చదవటం వలన సమాజం పట్ల శాస్త్రీయ అవగాహన లోపిస్తుంది. అయితే కల్పన ఏమిటో వాస్తవమేమిలో తెలియక గందరగోళమవుతుంది. రామాయణ, భారతకథల సారాంశం, కులపరంగా విభజితమైన నిచ్చెనమెట్ల సామాజిక జీవనం. దీన్ని ఒక ఆదర్శంగా, అదే మన జీవన విధానంగా స్థిరపరిచేందుకు చేస్తున్న ప్రయత్నాల్లో భాగమే ఇది.

పురాణాలు చరిత్రలౌతాయా!

చిన్నతనంలో సాయంత్రం కాగానే పల్లెల్లో ఏదో ఒక కళాప్రదర్శన రచ్చబండ దగ్గర జరుగుతుండేవి. ఒక సారి హరికథ కాలక్షేపమయితే, మరోసారి బుర్రకథ, ఒగ్గుకథ, తోలుబొమ్మలు ఇలా కొనసాగేవి. వీటిల్లో ఎక్కువ శాతము హరిని గురించిన పురాణమే కథలుగా వినిపించేవారు. రోజంతా పనిచేసి అలసిపోయి వచ్చిన సామాన్య జనులకు వినోదము, సాంస్కృతిక కళాపోషణ వుండేది. తమ బతుకులకతీతమైన ఓ సుందర కథా గానంతో తేలిక పడేవాళ్ల వారు. ఆ కళారూపాల్లో ప్రధానంగా రామాయణ, మహాభారత కథలు, అందులోని అనేక ఉపకథల ఉపదేశాలే వుండేవి. అందుకనే 'తింటే గారెలే తినాలి.. వింటే భారతం వినాలి' అనే నానుడీ వచ్చింది. ఇక రామాయణ కథా రసాస్వాదనలో తెలియాడేవారు. ఎందుకంటే కరుణ రసం కదిలించని హృదయముంటుందా? కథలు వినటం, కథలు చెప్పటం మానవ పరిణామంలో సాంస్కృతిక చలనంలోంచి సంతరించుకొన్నదే. పురాణాలన్నీ ఆర్యుల జయాపజయాలు, వైదికమత ప్రచారాల నిమిత్తమై నిర్మాణమైనవన్నది జగద్విదితమే. అయితే రామాయణం గొప్ప కావ్య గౌరవాన్ని పొందింది. ఇప్పటికీ జనుల ఆదరణ, ఆలకింపు పొందుతోందంటే ఆ కథా కథనంలో వున్న గొప్పతనమే కారణం. ఇక భారతాన్ని ఇతిహాసంగా పేర్కొంటారు. అంటే కొంత చరిత్ర మిళితమైన కథాసారమని చెప్పవచ్చు. వీటిల్లో కొంత కాల్పనికత, సామాజికత, రాజుల, రాజ్యాల వైయిక్తిక వైభవ ప్రదర్శన అన్నీ కలిసి వున్న వాటిగానే పురాణేతిహాసాలను, కావ్యాలను చూడాలి. అందుకనే మనం అప్పుడప్పుడు హరికథలు చెప్పకురా! అంటాం.


ఇప్పుడివన్నీ ఎందుకు ప్రస్తావించడమంటే, ఈ రామాయణ, మహాభారతాలను చరిత్ర పాఠాలుగా విశ్వవిద్యాలయాలు పెట్టబోతున్నాయి.మనం హరికథలుగా విన్నవన్నింటిని పాఠాలుగా అధ్యయనం చేయాలన్నమాట. కేంద్ర ప్రభుత్వం విశ్వవిద్యాలయాల చరిత్ర పాఠ్య పుస్తకాలలో రామాయణ కథను, మహాభారత కథను, భగవద్గీత విషయాలను చరిత్రగా పాఠాలు చెప్పబోతున్నారు. కేంద్రంలో మతతత్వ శక్తులు అధికారంలోకి వచ్చాక చరిత్రను వక్రీకరించడం, వాస్తవిక చరిత్రను తొలగించడం చేస్తున్నారు. వాటి స్థానంలో మత సంబంధిత అంశాలను, పురాణ కథలను చరిత్రగా బోధించేట్లయితే రాబోయే తరం భవిష్యత్తు తీవ్ర సంక్షోభంగా మారుతుందని విద్యావేత్తలు వాపోతున్నారు. ఇలా చరిత్రను ఎందుకు మారుస్తున్నారన్న ప్రశ్నకు, గతంలో చరిత్రను రాసిన వాళ్లంతా మార్క్సిస్టులు కాబట్టి పాఠ్యాంశాలను మారుస్తున్నామని చెపుతున్నారు. ఎవరు రాసినా ఆ చరిత్ర వాస్తవమా? కాదా? అనేది ముఖ్యమనే విషయాన్ని, విస్మరిస్తున్నారు. మన దేశంలో ఆవిర్భవించిన సాహిత్యాన్ని చదువుకోవచ్చు. ఆస్వాదించవచ్చు. అధ్యయనమూ చేయవచ్చు. కానీ కావ్యాలను, పురాణ కథలను వాస్తవిక చరిత్రగా చదవటం వలన సమాజం పట్ల శాస్త్రీయ అవగాహన లోపిస్తుంది. అయితే కల్పన ఏమిటో వాస్తవ మేమిలో



తెలియక గందరగోళమవుతుంది. రామాయణ, భారతకథల సారాంశం, కులపరంగా విభజితమైన నిచ్చెనమెట్ల సామాజిక జీవనం. దీన్ని ఒక ఆదర్శంగా, అదే మన జీవన విధానంగా స్థిరపరిచేందుకు చేస్తున్న ప్రయత్నాల్లో భాగమే ఇది. అంతేకాక అన్ని అన్యాయాలను, అసమానతలను ధర్మబద్ధం చేయటమూ ఈ బోధనలో వుంది.

ఒకవైపు శాస్త్ర సాంకేతిక రంగంలో ప్రయోగాలు చేస్తూ, ఖగోళ విజ్ఞానం చంద్రునిపై కాలుమోపి ప్రయోగాలు చేసి విజయం పొందుతున్న సందర్భంలో, విశ్వాసాల ప్రాతిపదికన చరిత్రను విద్యార్థులకు అందిస్తే ఏ రకమైన సమాజం ఏర్పడుతుందో మనం ఊహించవచ్చు. మన రాజ్యాంగం ఇచ్చిన స్ఫూర్తికి భిన్నమయిన ఆచరణ ఇది. చరిత్ర అంటే మానవజాతి పరిణామక్రమ శాస్త్రం. చరిత్ర పఠనం ద్వారా మనం స్పష్టమైన దృక్పథాన్ని అలవరచు కొని, నాణ్యమైన విజ్ఞానం ద్వారా మన జీవితాలను మెరుగు పరచుకోవాలి. కానీ నేడు కేంద్రంలో అధికారం చేస్తున్న పాలక వర్గాలు, తమ రాజకీయ, భావజాలానికి అనుగుణంగా చరిత్రనే వక్రీకరించే పనికి పూనుకోవటం తగనిపని. ఇది విజ్ఞాన భవిష్యత్తుకు హాని కలిగిస్తుంది. "ఈ రాణీ ప్రేమ పురాణం, ఆ ముట్టడికైన ఖర్చులూ, మతలబులూ, కైఫీయతులూ ఇవికావోయ్ చరిత్ర సారం" అన్న శ్రీశ్రీ మాటలు అక్షరసత్యాలు. పుక్కిటి పురాణాలను మన చరిత్రగా చెప్పే ప్రయత్నం చేయడం అత్యంత బాధాకరం. చరిత్రకారులు, మేధావులు, విద్యావేత్తలు దీన్ని అడ్డుకోవాలి.

లౌకిక శక్తులకు ఎన్నికల పాఠాలు


తెలకపల్లి రవి

అయిదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలను దేశ ప్రజలూ, పార్టీలూ, మీడియా ఇంకా మాట్లాడుకుంటుండగానే ప్రధాని మోడీ కేంద్రంలో హ్యాట్రిక్ నినాదం మీడియాలో తీసుకురావడం యాదృచ్ఛికమేమీకాదు. తెలంగాణను మినహాయించితే మూడు కీలక హిందీ రాష్ట్రాల గెలుపుతో మరోసారి తన సంఖ్య పెంచుకున్న కాషాయపార్టీ నుంచి ఈ దూకుడు వూహించిందే. బీజేపీ రాజకీయ వ్యూహాలు, ప్రతిపక్షాలను ఉక్కిరిబిక్కిరి చేసి ప్రజల ముందు తనే బాహుబలిగా ప్రత్యక్షం కావాలనే మోడీ రాజకీయం గత పది పదిహేనేళ్లుగా దేశం చూస్తూనే వుంది. అన్ని విధాల వంతపాడే బడా మీడియా, అధికార రాజకీయాలలో మునిగితేలుతూ బీజేపీ హైపర్ హిందూత్వ దాడి నుంచి దృష్టి మరల్చే జాతీయ, ప్రాంతీయ, లౌకిక పార్టీల పోకడలూ ఇందుకు తోడవుతుంటాయి. గెలుపు ముందు ఓటమి ఎప్పుడూ వెలవెలబోతుందన్నట్టు విజయం విశ్వరూపంలో కనిపిస్తుంటే పరాజితులను పరాభవించడం పరిపాటి. బహుశా ఈ సన్నివేశంలో ఈ లక్షణం మరింతగా ఆవిష్కృతమవుతున్నది. పార్లమెంటు సమావేశాల ప్రారంభ ఘట్టంలో మోడీ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయామని ప్రతిపక్షాలు ప్రతికూల వైఖరి అనుసరించ తగదని మరోసారి గెలిచే అవకాశాలు ఎప్పుడూ వుంటాయని మనస్తత్వ పాఠాలు ప్రవచించారు. ప్రతిపక్షాల సవాళ్ల నుంచి ఎప్పుడూ పలాయనం చిత్తగిస్తూ దేశం ముందుకొచ్చిన సవాళ్లకు సమాధానమివ్వకుండా ఏకపక్ష ఆధిక్యతతో పార్లమెంటు పనితీరును ప్రహసనంగా మార్చిన ఘనత నిజానికి ఆయనదే.ఇప్పుడు ఇది మరింత ముదురుతుందని తాజా సంకేతాలు చెబుతూనే వున్నాయి. 2019 ఎన్నికల ఫలితాల తర్వాత తొలి సమావేశాల్లోనే జమ్మూకాశ్మీర్ 370 రద్దు బిల్లు ఆమోదింపచేసుకున్న ఈ ప్రభుత్వం ఈ ముగింపు దశలో అక్కడ రిజర్వేషన్లు అనీ, ఆక్రమిత కాశ్మీర్‌కూ సీట్లు అట్టి పెట్టడం, విముక్తి చేయడమనీ కొత్త నినాదం తీసు కొస్తున్నది. ఇవన్నీ వచ్చే ఎన్నికలకు సన్నాహాలే. అయోధ్యలో ఆలయ ప్రతిష్టాపన, నెహ్రూ తప్పిదాలంటూ దాడి, చరిత్ర పుస్తకాలను మరింత తలకిందులు చేయడం ఇవన్నీ దాని కొనసాగింపే. రాబోయే కాలానికి సంబంధించిన రాజకీయ హెచ్చరికలే ఇవి. ఇదే శీర్షికలో ఇండియా వేదిక, కాంగ్రెస్ పోకడలు పేరిట (నవంబర్5న) ప్రచురితమైన వ్యాసం ఒకసారి గుర్తు చేసుకుంటూ ఈ పరిస్థితికి కారణాలు కనిపిస్తాయి. వివిధ ప్రాంతీయ లౌకిక పార్టీలకూ ఆ వ్యాఖ్యలు వర్తిస్తాయి. మోడీత్వ విజృంభించే తరుణంలో ప్రజల తీర్పు పాఠాలను వంటపట్టించుకోవడమే ఇప్పుడు తక్షణ కర్తవ్యం.119 స్థానాలు గల శాసన సభలో 65(సీపీఐ1) సీట్లు గెలిచి తెలంగాణ ముఖ్యమంత్రిగా రేవంత్ ప్రమాణస్వీకారానికి నాయకత్వమంతా తరలి రావడం మినహా ఫలి తాలపై బీజేపీ దూకుడు ఇలా వుంటే కాంగ్రెస్ ఇంతవరకూ సమగ్రమైన వ్యాఖ్యలు కూడా చేయలేదు.

> మధ్యప్రదేశ్‌లో ఫిరాయింపులతో తిరిగొచ్చిన బీజేపీ ముఖ్య మంత్రి శివరాజ్ చౌహాన్ హిందూ త్వ రాజకీయాలనూ కొన్ని పథకాలను ఆధారం చేసుకుని గెలుపొందారు. కాంగ్రెస్ మాజీ ముఖ్య మంత్రి కమల్‌నాథ్ కూడా బీజేపీ నమూనాను అనుకరించబోయి రెండు విధాలా భంగపడ్డారు. ఛత్తీస్‌గఢ్ మాత్రం గెలుస్తామను కుని దారుణ ఓటమి పాలైంది కాంగ్రెస్. ఈ రెండు రాష్ట్రాల్లోనూ ఆదివాసీ ప్రాంతాలలో ఎస్‌టి సీట్లలో బీజేపీ చాలా పట్టు సాధించడం ప్రత్యేకించి ఆందోళన కరం. ఈ మూడు రాష్ట్రాలలో కాంగ్రెస్, బీజేపీల మధ్య 1997, 2003, 2018 ఎన్నికలలో శాసనసభ, లోక్‌సభ ఫలితాలు తారుమారయ్యాయి. ఇప్పుడు ఓట్ల సంఖ్య కూడా బీజేపీ కూటమి కన్నా ఇండియాలో భాగస్వాములైన వారికే ఎక్కువ అని లెక్కలు చెబుతున్నారు.

బీఆర్ఎస్‌కు గుణపాఠం, రేవంత్‌కు సారథ్యం

తెలంగాణలో కాంగ్రెస్ విజయం సాధిస్తుందనేది ముందుగా అత్యధిక సర్వేలు, వాటికి తారాస్థాయిగా ఎగ్జిట్‌పోల్స్ ముందే ఊహించాయి. వాటిని ఏ మేరకు విశ్వసించవచ్చుననేది కూడా ఇక్కడ చర్చించాము. తెలంగాణలో కాస్త అటూఇటూగా నిజమైన ఈ పోల్స్ మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో విఫలమయ్యాయి. తెలం గాణపై కచ్చితంగా చెప్పిన ఇండియా టుడే కూడా అక్కడ దెబ్బతిన్నది. ఆ సంగతి అలా వుంచితే తెలం గాణలో కేసీఆర్ ఏకపక్ష పోకడల పట్ల, ప్రభుత్వ తప్పులపట్ల ఓటర్ల ఆగ్రహం తీవ్రంగానే వుందని ఫలితాలు తేటతెల్లం చేశాయి. ఆఖరుకు ఆయన, రేవంత్‌రెడ్డి కూడా ఒక స్థానంలో ఓడిపోయారు. తెలంగాణ సాధించిన నేతగా కేసీఆర్ వీటన్నిటినీ అధిగమిస్తారనే బీఆర్ఎస్ ఆశలు ఆచరణలో కుప్ప కూలాయి. సెంటిమెంటు, సంక్షేమ పథకాల ప్రభా వం పల్లెల్లో అధికంగా వుంటుందనే అంచనాలు కూడా తలకిందులయ్యాయి. ఎందుకంటే హైదరా బాద్, రంగారెడ్డిలో కాంగ్రెస్ సీట్లు తెచ్చుకోలేక పోయింది. ఉత్తర తెలంగాణలో అధికంగానూ, దక్షిణ భాగంలో పూర్తిగానూ దాని విజయాలు లభించాయి. ఉత్తర భాగంలో బీజేపీ కూడా మంచి ఫలితాలే సాధించింది. వాస్తవానికి బీజేపీతో బీఆర్ఎస్ రాజీ పడటం, ఉభయులూ కలసి కాంగ్రెస్‌ను రాకుండా చేయడం కోసం వారి మధ్య తెర వెనక దోస్తీ వుందనే బలమైన అభిప్రాయం తీర్పును చాలావరకూ ప్రభావితం చేసింది. మునుగోడులో వామపక్షాల మద్దతుతో బీజేపీని ఓడించిన తర్వాత తెలంగాణ రాజకీయ దృశ్యం మారింది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మోడీపై తీవ్ర విమర్శలే కురిపించారు. టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చి జాతీయ పాత్ర నిర్వహిస్తామన్నారు. అయితే అదే సమయంలో కాంగ్రెస్, బీజేపీల మధ్య సమదూరం సిద్ధాంతాన్ని ప్రచారం చేశారు. మహారాష్ట్రలో రాజకీయ హడావుడి చేశారు. (గత ఎన్నికల తరుణంలోనూ దేశ్‌కీ నేతా నినాదంతోనే ఓటర్ల ముందుకు వెళ్లారని గుర్తుంచుకోవాలి.) కానీ ఇవన్నీ ఒక్కసారిగా ఆపేశారు.

ఢిల్లీ లిక్కర్ స్కాంలో కవితపై దర్యాప్తు, నోటీసుల తర్వాత కేసీఆర్ వెనక్కు తగ్గారనే భావం బలంగా వ్యాపించింది. కమ్యూనిస్టులతో పొత్తు వుంటుందనే సూచనలను మొదట ఇచ్చిన ఆయన తర్వాత తనే వాటిని ఏకపక్షంగా వమ్ముచేయడానికి కూడా ఇదే కారణమైందని అభిప్రాయమేర్పడింది. కాంగ్రెస్, బీఆర్ఎస్ కూడా బీజేపీ మత రాజకీయాలు, కేంద్రీకృత పెత్తనంపై పోరాటం కంటే రాష్ట్రాధిపత్యం కోసం తమలో తమ పోటీనే ముందుకు తెచ్చారు. బీజేపీ ఇక్కడ శక్తికాదనే వాదన చేశారు. అవతలివారే బీజేపీతో కలసిపోయారని ఆరోపణలు చేశారు. రేవంత్ రెడ్డి ఏబీవీపీ నేపథ్యం గురించి బీఆర్ఎస్ చెప్పింది. కవితను అరెస్టు చేయకపోవడం,మేడిగడ్డ పిల్లర్ కుంగుబాటుపై కేంద్ర దర్యాప్తు జరిపించక పోవడం, సిబిఐ దాడులు లేకపోవడం కుమ్మక్కు వల్లనేనని కాంగ్రెస్ కేంద్ర, రాష్ట్ర నాయకులు విమర్శలు గుప్పించారు. మరోవైపు కాంగ్రెస్ మిగిలినచోట్ల వలెనే వామపక్షాల విషయంలో అవాస్తవిక వైఖరి అనుసరించింది. ఇవన్నీ ఫలితాలలో ప్రతిబింబించాయి. సీపీఐ ఒక్కస్థానంతో సర్దుబాటు చేసుకుని విజయం సాధించింది. (గత రెండు ఎన్నికల్లో కూడా సీపీఐ, కాంగ్రెస్ కలిసే పోటీ చేశాయి) ఆహ్వానం వస్తే మంత్రివర్గంలో చేరే విషయం పరిశీలిస్తామని సానుకూల సూచనలు ఇచ్చింది కానీ ఇప్పటికైతే ఆ దిశలో అడుగులు పడలేదు. సీపీఐ(ఎం) స్వంతంగా పోటీ చేసింది. సీపీఐకి మద్దతునిచ్చింది. అది ఎక్కడా విజయం సాధించకపోవడం, ఓట్లు బాగా తక్కువగా రావడం ఉద్యమాభిమానులకు నిరుత్సాహం కలిగించింది. వీటిపై సమీక్ష చేసుకుంటామని, ఎప్పటిలాగానే ప్రజల కోసం పోరాడతామనీ కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రకటించారు. కొత్త ప్రభుత్వాన్ని స్వాగతిస్తూనే ప్రజల తీర్పును సరిగ్గా అర్థం చేసుకుని సరైన పాలన అందించాలని సూచించారు.ఈ సందర్భంలో రాజకీయ నేపథ్యాన్ని రూ.వందల కోట్లతో నడిచిన ఎన్నికల రాజకీయాన్ని విస్మరించి కమ్యూనిస్టులను చులకన చేస్తూ మాట్లాడటం దారితప్పిస్తుంది. బీజేపీ కూడా 13.9 శాతం ఓట్లు,8 సీట్లు పొంది ఒక శక్తిగా వచ్చింది. నిజానికి 2019 పార్లమెంటు ఎన్నికలతో పోలిస్తే ఇది కొంచెం తక్కువ కాగా గత అసెంబ్లీ ఎన్నికల కంటే బాగా ఎక్కువ. ఈ దఫా కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మధ్య ఓట్ల తేడా రెండు శాతంలోపు వచ్చింది. మజ్లిస్ తన ఏడు స్థానాలు నిలబెట్టుకుంది. ఇరు పక్షాల మధ్య తేడా తొమ్మిదే గనక ఆరు నెలల్లో అంతా మారిపోతుందనే ప్రచారం వివిధ రూపాల్లో సాగుతూనే వుంది. విజయానికి నాయకత్వం వహించిన రేవంత్‌రెడ్డి సహజంగానే ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినా అంతర్గత ఐక్యత, శాసనసభలో సవాళ్ల తీవ్రంగానే వుంటాయనడం నిస్సందేహం.మూడు మాసాల్లో వచ్చే లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాతనే రాజకీయ పరిస్థితి ఒక కొలిక్కి వస్తుందని విస్తృత చర్చ జరుగుతున్నది. ఫిరాయింపులతో కేసీఆర్ బలం విపరీతంగా పెంచుకున్న



గత పద్ధతులు పునరావృతం కాబోవని, కాంగ్రెస్ నాయకులు బాధ్యతగా వ్యవహరించి ప్రజల తీర్పును సార్థకం చేసుకుంటారని ఆశించాలి. అయితే కొంత మంది ఈ కారణంగా చులకన చేస్తూ మాట్లాడటం మాత్రం సరికాదు. బీజేపీ ఎంఎల్ఎ రాజాసింగ్ రేవంత్ ప్రభుత్వం ఆరునెలల్లో పడిపోతుందని బెదిరించడం మాత్రం దారుణం,అప్రజాస్వామికం. తీర్పును స్వాగతిస్తామని బీఆర్ఎస్ చెబుతున్నా అటూ ఇటూ అనేక ఊహాగానాలు సాగుతున్నాయి. రేవంత్ విజయం వెనక తెలుగుదేశం ప్రధానంగా వుందని ఒక ప్రచారం జరిగినా తమకేమీ సంబంధం లేదని ప్రకటించింది. టీడీపీ మిత్రపక్షం, ఎన్‌డిఎ భాగస్వామి జనసేన బీజేపీతో కలిసి ఎనిమిది చోట్ల పోటీ చేసి డిపాజిట్లు కోల్పోయింది. అక్కడ టీడీపీ ఇక్కడ బీజేపీ అనే ప్రశ్న ఒకటి రాగా టీడీపీ వరకూ కాంగ్రెస్‌తో తాము లేమన్న సందేశం బీజేపీకి చేర్చడానికి జాగ్రత్త పడుతున్నది. ఈ ఎన్నికల ఫలితాలపై రాజకీయ పరిణామాలపై మరింత వివరమైన చర్చ మున్ముందు తప్పక జరపాల్సి వుంటుంది.

కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ

ఈశాన్య రాష్ట్రమైన మిజోరాంలోనూ కొత్త ప్రాంతీయ పార్టీ జెడ్‌పిఎం అధికారం చేపట్టింది, ఆ పార్టీ అధినేత ముఖ్యమంత్రి లాల్‌ధూమా ఏ కూటమిలోనూ చేరేయోచనలో లేరు. ఇక రాజస్థాన్ చేజారుతుందనుకున్నా మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ అంచనాలు తలకిందులయ్యాయి. బీజేపీయే ఊహించిన దానికన్నా ఎక్కువ విజయం సాధించింది. ఇందుకు దారితీసిన రాజకీయ పరిస్థితులు కాంగ్రెస్ ఒంటెత్తుపోకడల గురించి పీపుల్స్ డెమోక్రసీ తాజా సంపాదకీయం సమగ్రంగానే విశ్లేషించింది, హెచ్చరిస్తున్నది కూడా. అయితే ఛత్తీస్‌గఢ్, ఎంపీలలో తమ వాళ్ల మధ్య తగాదాల గురించి నాయకుల తేడాల

> ఢిల్లీ లిక్కర్ స్కాంలో కవితపై దర్యాప్తు, నోటీసుల తర్వాత కేసీఆర్ వెనక్కు తగ్గారనే భావం బలంగా వ్యాపించింది. కమ్యూనిస్టులతో పొత్తు వుంటుందనే సూచనలను మొదట ఇచ్చిన ఆయన తర్వాత తనే వాటిని ఏకపక్షంగా వమ్ముచేయడానికి కూడా ఇదే కారణమైందని అభిప్రాయమేర్పడింది. కాంగ్రెస్, బీఆర్ఎస్ కూడా బీజేపీ మత రాజకీయాలు, కేంద్రీకృత పెత్తనంపై పోరాటం కంటే రాష్ట్రాధిపత్యం కోసం తమలో తమ పోటీనే ముందుకు తెచ్చారు. బీజేపీ ఇక్కడ శక్తికాదనే వాదన చేశారు. అవతలివారే బీజేపీతో కలసిపోయారని ఆరోపణలు చేశారు. రేవంత్ రెడ్డి ఏబీవీపీ నేపథ్యం గురించి బీఆర్ఎస్ చెప్పింది. కవితను అరెస్టు చేయకపోవడం, మేడిగడ్డ పిల్లర్ కుంగుబాటుపై కేంద్ర దర్యాప్తు జరిపించక పోవడం, సిబిఐ దాడులు లేకపోవడం కుమ్మక్కు వల్లనేనని కాంగ్రెస్ కేంద్ర, రాష్ట్ర నాయకులు విమ ర్శలు గుప్పించారు.

గురించి మాత్రమే కాంగ్రెస్ చర్చ ఎక్కువగా నడుస్తున్నది. రాజస్థాన్‌లో ఓటమి రావచ్చని భావించినా తీవ్రత చాలా ఎక్కువగా వుంది. 17 మంది మంత్రులు ఓడిపోయారు. మధ్యప్రదేశ్‌లో ఫిరాయింపులతో తిరిగొచ్చిన బీజేపీ ముఖ్యమంత్రి శివరాజ్ చౌహాన్ హిందూత్వ రాజకీయాలనూ కొన్ని పథకాలను ఆధారం చేసుకుని గెలుపొందారు. కాంగ్రెస్ మాజీ ముఖ్యమంత్రి కమల్‌నాథ్ కూడా బీజేపీ నమూనాను అనుకరించబోయి రెండు విధాలా భంగపడ్డారు. ఛత్తీస్‌గఢ్ మాత్రం గెలుస్తామనుకుని దారుణ ఓటమి పాలైంది కాంగ్రెస్. ఈ రెండు రాష్ట్రాల్లోనూ ఆదివాసీ ప్రాంతాలలో ఎస్‌టి సీట్లలో బీజేపీ చాలా పట్టు సాధించడం ప్రత్యేకించి ఆందోళన కరం. ఈ మూడు రాష్ట్రాలలో కాంగ్రెస్, బీజేపీల మధ్య 1997, 2003, 2018 ఎన్నికలలో శాసన సభ, లోక్‌సభ ఫలితాలు తారుమారయ్యాయి. ఇప్పుడు ఓట్ల సంఖ్య కూడా బీజేపీ కూటమి కన్నా ఇండియాలో భాగస్వాములైన వారికే ఎక్కువ అని లెక్కలు చెబుతున్నారు. 12.29 కోట్ల ఓట్లు పోలవగా బీజేపీ కూటమికి 4.82 కోట్ల ఓట్లు, కాంగ్రెస్‌కు 4.92కోట్ల ఓట్లు, ఇండియాలో భాగస్వాములైన వాటికి మొత్తంగా 5.06కోట్ల ఓట్లు వచ్చాయి.వీటి ఆధారంగా నిపుణులు ఏవో లెక్కలు కడుతున్నారు గానీ నిజంగా జరగాల్సింది కాంగ్రెస్ ధోరణిలో మార్పు. 'ఇండియా' వేదికను సక్రమంగా నిర్వహించడం. రాజకీయంగా సైద్ధాంతికంగానే గాక ఓట్ల చీలిక నివారించేందుకు కృషి చేస్తే వచ్చే లోక్‌సభ ఎన్నికల పోరాటం సరైన ఫలితాలిస్తుంది. ■

హక్కుల ఉల్లంఘన ఓ చేదునిజం


కె.శాంతారావు
9959745723

మానవ హక్కులు వేరు, పౌరహక్కులు వేరు. ప్రపంచంలో ఎక్కడ పుట్టినా మనిషికి సహజంగా లభించే స్వేచ్ఛా జీవన హక్కులు మానవ హక్కులుగా పరిఢవిల్లుతాయి. రాజ్యాంగం కల్పించిన హక్కులు మాత్రమే పౌరహక్కులుగా విరాజిల్లుతాయి. మత చాందస పురుషాధిక్య రాజ్యాల్లో మహిళాహక్కులు కాలరాయబడతాయనే విషయం ఎల్లరకూ తెలిసిందే. పెట్టుబడిదారీ దోపిడీ ఆర్థిక విధానాలు అమలవుతున్న చోట శ్రామికవర్గం హక్కులు గల్లంతవుతాయి. అలాగే బాలకార్మిక వ్యవస్థతో బాలల హక్కులు మృగ్యం అవుతాయి. పేదరికం అణచివేత ఉన్నచోట మానవహక్కులు వర్ధిల్లుతాయని, వికసిస్తాయని భావించడంకంటే పెద్ద భ్రమ ఏదీ ఉండబోదు.

తమ రాజ్యాంగం ప్రసాదించిన పౌరహక్కులను కాపాడుకుంటూ విశ్వ మానవ హక్కులవైపునకు ప్రయాణించడమే హక్కుల పోరాటంగా అభివర్ణిస్తారు పరిశీలకులు. కనుకనే ఐక్య రాజ్య సమితి సార్వత్రిక మానవ హక్కుల ప్రకటన (1948 డిసెంబరు 10) మానవ జాతి చరిత్రలోనే ఓ విశిష్ట అధ్యాయంగా చెప్తారు. ఆ ప్రకటన వచ్చిన అమృతోత్సవ వేళలో (75 ఏండ్లు) మనం ఉన్నాం. ప్రపంచ ప్రజల సార్వజనీన జీవన విలువల రక్షణకు, సుస్థిర భద్రతకు, అవాంఛనీయ హింసోన్మాద ఉద్రిక్తతలు తగ్గించడానికి ఈ ప్రకటన ఎంతగానో తోడ్పడుతుందని ఐ.రా.స. ప్రధాన కార్యదర్శి ఆంటోనియా గుటెరస్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

జాతి, వర్ణ, లింగ, కుల, మత, రాజకీయ ఇతర కారణాలతో వివక్షలేని జీవనం గడపడం, చిత్రహింసల క్రూరత్వం నుంచి బయటపడటం, వెట్టి చాకిరి బానిసత్వం వంటి దురాచారాల నుంచి రక్షణ పొందడం, నిర్బంధం లేని జీవన విధానం సాగించడం, స్వేచ్ఛగా స్వదేశంలో, విదేశాలలో పర్యటించే హక్కు కలిగి ఉండటం, సురక్షిత ప్రాంతాలలో జీవించే హక్కు, బలవంతపు పనులనుండి విముక్తి, విద్యాహక్కుతో బాలలకు స్వేచ్ఛ, భావప్రకటనా స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, ఏ మతాన్నైనా స్వీకరించే హక్కు మొదలైనవి మానవ హక్కుల ప్రధాన లక్ష్యాలని ఆ ప్రకటన సారాంశం.

మన దేశంలో ఈ మానవ హక్కుల పరిరక్షణా చట్టాన్ని 1993లో ఆమోదించుకున్నాం. తత్సంబంధిత మానవహక్కుల కమిషన్‌ను ఏర్పాటు చేసుకున్నాం. ఇది చట్టబద్ధమైన స్వయం ప్రతిపత్తి గల సంస్థ. తొలుత దీనికి రాజ్యాంగ బద్దత లేదు. ఆ తర్వాత కొన్ని సవరణలతో గాని (2006లో) ఇది చట్టంగా అవతరించలేదు. అంటే మానవ హక్కుల విషయంలో మనం ఎంత నెంపాదిగా ఉన్నామో అర్థమవుతుంది. పుట్టిన ప్రతి మనిషికి స్వతంత్రంగా జీవించడానికి హక్కులుంటాయని అధీకృతంగా గుర్తించడం, తెలపడం కమిషన్ ద్వారా సాధ్యమైంది. మరి ఆచరణే తత్ విరుద్ధం గా సాగుతుంటుంది. ఇదే చేదు నిజం.

అంతర్జాతీయంగా చూస్తే ప్రస్తుతం మధ్య ఆసియాలో ఇజ్రాయిల్, పాలస్తీనా ప్రజలపై భయంకర యుద్ధ దాడులు సాగిస్తూనే ఉన్నది. రక్తపుటేరులు పారిస్తున్నది. దాదాపు 15 వేల మందికి పైగా ప్రాణాలు పోగొట్టుకున్నారు. రెండ్నెల్లుగా ఈ ఘోరకలి నడుస్తున్నది. ఈ యుద్ధోన్మాద దుర్మార్గానికి జీవితాలు జీవితాలే ధ్వంసమై పోతున్నాయి. క్షణంక్షణం పరిస్థితి దిగజారుతున్నది. మధ్యలో కొన్నాళ్ళు కాల్పులు విరమణ జరిగినా పరిస్థితి శాంతించలేదు. 'పాలస్తీనీయులు నివసించే గాజాలో ఇప్పుడు సురక్షిత ప్రాంతం ఏదీ లేకుండా పోయిందని యునెసెఫ్ ప్రకటించింది కూడా. అంటే ఆ ప్రజలు తమ హక్కులే కాదు ప్రాణాలు సైతం భయం గుప్పెట్లో పెట్టుకుని బ్రతుకుతున్నట్టు అర్థమవుతున్నది.

అలాగే జాతీయంగా చూస్తున్నపుడు మణిపూర్ మంటలు చల్లారడం లేదు. మంటలను కావాలని



ఎగదోస్తున్నారా? అనే ప్రశ్న ఉత్పన్నం అవుతున్నది. తాజాగా రెండు జాతుల సాయుధ ముఠాల మధ్య కాల్పుల్లో పదమూడుమంది నేలకొరిగారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నాయి. మానవ హక్కుల కమిషన్ ఉన్నది. మరెందుకని ఈ పరిస్థితి? ఏడు నెలల క్రితం ప్రారంభం అయిన మెయితీ-కుకీ తెగల మధ్య ఘర్షణలో ఇప్పటికీ దాదాపు 175 మంది మరణించారు. ఏభైవేల మంది ప్రజానీకం అక్కడ కొంపా గోడు వదిలి నిరాశ్రయులయ్యారు. సుప్రీం కోర్టు నియమించిన ప్రత్యేక కమిటీ తాజా పరిస్థితిని సమీక్షించింది. శాంతి భద్రత పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వానికి పలు ఆదేశాలు ఇచ్చింది. అయినా ఈ తాజా ఉదంతం చోటు చేసుకోవడం వల్లనే ఆ ప్రశ్న. అందుకే మణిపూర్ బాధితులు మేం 'భారతీయులం కాదా? మీలాంటి మనుషులమేగా? మాపై ఈ వివక్ష ఎందుకు? అని కన్నీటితో ప్రశ్నించడం చూస్తుంటే ఎవరికైన గుండె తరుక్కుపోతుంది. మానవహక్కుల సంస్కృతి కోణంలో చూసినపుడు మనమెంత అనాగరికంగా వ్యవహరిస్తున్నామో తెలుస్తున్నది.


కాగా, దేశంలో గంటకు మూడుపైగా హత్యలు జరుగుతున్నాయని. రోజుకు ఆ విధంగా 78 మంది నిష్కారణంగా చనిపోతున్నారని జాతీయ నేర నమోదు సంస్థ (ఎన్.సి.ఆర్.బి) వివరించింది. ఆ విధంగా దాదాపు ప్రతి ఏటా ముప్పై వేలమంది హతులవుతున్నారు. ఈ హత్యలు ఎక్కువగా యు.పి.లో జరుగుతున్నాయి. అలాగే మహిళా నేరాలకు సంబంధించి గతేడాది దేశవ్యాప్తంగా నాలుగున్నర లక్షల కేసులు నమోదయ్యాయి. ఒక్క రాజధాని ఢిల్లీ నగరంలోనే బాల నేరస్తులపై 2,436 కేసులు నమోదయినట్టు తెలిపింది. ఇది కేసులుగా నమోదైన సమాచారం. నమోదు కానిదెంతో? హక్కుల ఉల్లంఘన కిందే వస్తుంది ఇదంతా. మానవ హక్కుల సాధన విషయంలో ఎంత వెనుకబడి ఉన్నామో తెలియడానికి ఈ అంకెలు చాలు.

అయితే, కొవ్వొత్తిలా కాలుతూ మానవ హక్కుల సాధనపోరాటంలో వెలుగులు ప్రసాదించే ఎందరో వీరులు మనకు ఉన్నారు. ఆదివాసుల హక్కుల కోసం ఆదివాసుల మధ్యనే ఏళ్ళ తరబడి పని చేస్తు ఎన్నో నిర్బంధాలు ఎదుర్కొని జైలు పాలయిన స్టాన్ స్వామి మనకు తెలుసు. చివరకు పార్కిసన్ వ్యాధితో బాధపడుతున్న ఆ వృద్ధునికి తాగేందుకు జైలులో సిప్పర్ కూడా అందించక ఈ ప్రభుత్వం అమానుషంగా పొట్టనపెట్టుకుంది. పాలకుల క్రౌర్యం ఎలాంటిదో ఇలాంటి ఘటనలు మనకు కళ్ళకు కడతాయి.

హక్కు అనేది ఓ సామాజిక భావన. మానవీయ దృక్పథం పునాదిగా ఒక అర్థవంతమైన ప్రజాస్వామ్య వ్యవస్థ నిర్మాణమే మానవ హక్కుల పోరాటలక్ష్యం. మానవ హక్కుల ప్రజాస్వామ్య సంస్కృతిని పాలకులు పాలితులు విస్మరిస్తే ఏ దేశమూ ప్రశాంతంగా మనజాలదు. ఇప్పుడు జరుగుతున్నది ఇదే.

(నేడు అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం)

గుళ్లు- యాగాలు



కైలాసంలో ముగ్గురు మూలపుటమ్మలు కూర్చుని మాట్లాడుకుంటున్నారు. చాలా కాలం తర్వాత ముగ్గురూ కలసి మాట్లాడుకునే వీలు చిక్కింది. వారు అట్లా చర్చలలో ఉండగానే నారదుడు వచ్చాడు! నమస్కరించాడు. కాని నారదుడి రాకను తల్లులు గమనించలేదు.

"నారాయణ, నారాయణ"! అన్నాడు నారదుడు గట్టిగా

తల్లులకి వినబడలేదు వారివి సుదీర్ఘమైన చర్చలు మరి!

నారదుడికి పరిస్థితి అర్థమైంది.

"లోకమాతలకి వందనం"! అన్నాడు.

అప్పుడు నారదుడిని గమనించారు. ఎంతైనా తల్లులు కదా!

"ఏమి నారదా! బహుకాల దర్శనం! అంతా కుశలమేనా"! అన్నారు.

"కుశలమే తల్లీ!" మీ కోసం పదమూడు లోకాలు గాలించి చివరికి ఇక్కడికి వచ్చితిని తల్లీ!" అన్నాడు నారదుడు మంచుదిమ్మె మీద చతికిల పడుతూ.

"పదమూడు లోకములు తిరగనేల? అలసిపోనేల? మేము ముగ్గురమూ కలసుకునే చోటు ఇదే కదా! నేరుగా ఇక్కడికే వచ్చినచో నీకు మార్గాయాసము తప్పేది కదా!" అన్నది లక్ష్మీదేవి నవ్వుతూ!

నిజమే తల్లీ! నేరుగా ఇక్కడికే వచ్చినచో నా అనుమానాలు తొందరగా నివృత్తి అయ్యి ఉండేవి"! అన్నాడు నారదుడు.

"నీ అనుమానాలు ఏమిటి చెప్పుము నాయనా! తీర్చెదము". అన్నది చదువుల తల్లి సరస్వతి.

"ఏమీ లేదు! యజ్ఞ యాగములు చేసిన ఫలితము దక్కునా లేదా?" అన్నాడు నారదుడు.

ముగ్గురు తల్లులు ఫక్కున నవ్వారు.

"అయ్యో! నాయనా! ఇదే ప్రశ్న మానవులు అడిగనట్లైతే నీవు ముసలివాడవు అయ్యావు! అందుకే నీ బుద్ధి మందగించినది! అనే వారము. నీవేమో నిత్య యవ్వనుడవు! అయినా నీ బుద్ధి మందగించింది! కారణమేమిటో"! అన్నది లక్ష్మీదేవి.

"నారదుడి బుద్ధి మాంద్యానికి కారణమేమిటో, నాకు తెలుసు చిరకాలంగా బ్రాహ్మచారిగా ఉండటమే దీనికి కారణము. పెళ్ళి చేసుకో నారదా. నీ బుద్ధి కూడా మా గణపతి బుద్ధి వలె ప్రకాశించును"! అన్నది పార్వతి నవ్వుతూ.

"తల్లులారా! ఇది మీకు న్యాయమా నా సందేహాన్ని తీర్చకుండా నా బ్రహ్మచర్యముపై చర్చించుకురేల?" అన్నాడు నారదుడు చిన్నబుచ్చుకుని.

"నారదా! యజ్ఞ యాగాదులు చేసినపుడు హవిస్సు దేవతలకు, చేసినవారికి కోరుకున్న ఫలితము లభించును. ఇదే గతంలో కొనసాగింది. భవిష్యత్తులో కూడా కొనసాగుతుంది. ఇందులో నీకు అనుమానం ఎందుకు వచ్చింది?" అన్నది సరస్వతి దేవి.

"తెలంగాణలో ఇందుకు విరుద్ధంగా జరిగింది కదా!" అన్నాడు నారదుడు.

"తెలంగాణలో ఏమి జరిగింది నాయనా? మేము మాటల్లో పడి, దృష్టి సారించలేదు!" అన్నది లక్ష్మీదేవి.

"తెలంగాణ ఎన్నికల్లో కేసీఆర్ ఓడిపోయాడు. ఆయన ఎన్నికలకు ముందు రాజశ్యామల యాగం చేశాడు. అంతకుముందు జరిగిన రెండు ఎన్నికల సమయంలో రాజశ్యామల యాగం చేస్తే మీరు అనుగ్రహించి. కేసీఆర్‌కు రాజ్యాధికారం ప్రసాదించారు కదా!" ఇప్పుడు ఎందుకిలా జరిగింది. యాగం చేసే సమ



యంలో ఏదైనా అపచారం జరిగి మీరు ఆగ్రహించినారా? ప్రశ్నించాడు నారదుడు.

"అపచారం జరగలేదు! మేము ఆగ్రహించలేదు!" అన్నది పార్వతి.

"మరి యాగ ఫలితం ఎందుకు తారుమారైంది!" అడిగాడు నారదుడు.

"ఆగ్రహించినది మేము కాదు తెలంగాణా ప్రజలు!" అన్నది పార్వతి.

"తెలంగాణ ప్రజలకేమి తక్కువైనది. రైతు బంధు, దళిత బంధు, డబుల్ బెడ్రూములు, కళ్యాణ లక్ష్మీ, శాదీ ముబారక్, కేసీఆర్ కిట్టు, ఉచిత విద్యుత్, సాగునీరు, తాగునీరు, లక్షల సంఖ్యలో ఉద్యోగాలు ఇలా ఒకటేమిటి? ఎన్నో అమలు చేసినారు! ఇక ఆగ్రహానికి తావెక్కడిది తల్లీ! అన్నాడు నారదుడు ఆశ్చర్యంగా.

పార్వతి చిన్నగా నవ్వింది.

"ఉచితాలు, సంక్షేమ పథకాలు మాత్రమే ప్రజలను సంతృప్తి పరచలేవు నాయనా! ఉచితాలు పొందేవారి కన్నా శ్రమ చేసుకుని బతికే వారి సంఖ్య చాలా ఎక్కువ. పరిశ్రమలలో పనిచేసే కార్మికులు, వివిధ రంగాలలో పనిచేసే కార్మికులు, ఆశా, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన కార్మికులతో పాటు ప్రభుత్వ ఉద్యోగులు కూడా రెక్కల కష్టం చేసుకుని బతికేవారు. వారి సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేస్తే వారిని నిర్దాక్షిణ్యంగా అణిచివేసి, తనను అడుక్కోవాలని కేసీఆర్ ఆలోచించాడు. అన్నిటినీ మించి ఆర్టీసీ కార్మికులు 55 రోజుల సమ్మె చేస్తే, 39 మంది ఆ సమ్మెలో ప్రాణాలు అర్పించినా తన అహంకారం వీడలేదు! తన నియంతృత్వం తగ్గించుకోలేదు. తెలంగాణ రాష్ట్రంలో పోరాటాలు, సమ్మెలు, నిత్యకృత్యమయ్యాయి. వాటికి ప్రభుత్వ అధినేత ఏనాడూ స్పందించలేదు. "పైగా పోరాటాలు వీగిపోయేలా చేశానని విర్రవీగడం. అప్పటికప్పుడు సమ్మెలు ఏమీ సాధించినట్లు కన్పించలేదు! కాని వాటి ఫలితము ఎన్నికల్లో ఇట్లా కన్పించింది. ఇక రాజశ్యామల యాగం ఫలితం అంటావా? కార్మికులు కన్నెర్ర చేస్తే, ఏ యాగ ఫలితము దక్కదు నాయనా? వివరించింది! పార్వతి.

నారదుడు కొంత శాంతించాడు. కాని ఇంకా అనుమానం మిగిలే ఉంది.

"తల్లీ! గత 70 ఏళ్ళలో ఎవరూ చేయని విధంగా లక్ష్మీ నర్సింహస్వామికి గొప్ప గుడి కట్టించిన చరిత్ర కేసీఆర్‌ది. మరి దాని ఫలితమైనా దక్కలేదు! స్వయంగా కిలో బంగారాన్ని సమర్పించాడు కూడా!" అన్నాడు నారదుడు.

లక్ష్మి చిన్నగా నవ్వింది.

"తన స్వప్రయోజనాలను, ఆశించి స్వార్థ చింతనతో గుళ్ళూ గోపురాలు కట్టించినచో మేము ప్రసన్నమవుతామని నమ్మటం మూర్ఖత్వం. గుడి కట్టించేటపుడు, బంగారాన్ని సమర్పించేటపుడు, భక్తుడు ఏమి ఆలోచిస్తున్నాడో తెలుసుకోని అమాయకులమా మేము! గుళ్ల గోపురాలు కట్టించి, యజ్ఞ యాగాదులు చేసి, కానుకలు సమర్పించి. కష్టజీవుల పోరాటాలను, వారి హక్కులను కాలరాస్తే సహిస్తామా? గుళ్ల కట్టించి, యాగాలు చేసి పుణ్యం సాధించుకున్నామని భావించుకుని, ఆ అహంకారంతో కష్టజీవుల పోరాటాలను, హక్కులను అణచివేస్తే కలిగే పాపాలను గుర్తించకపోతే ఎట్లా? ఆ పుణ్యమూ దక్కదు, ఈ పాపఫలితమూ అనుభవించక తప్పదు. ఇది అందరూ తెలుసుకోవల్సిన సత్యము!" అన్నది లక్ష్మీదేవి.

"తల్లీ! ఇంకొక్క అనుమానమూ కలదు! దానినీ నివృత్తి చేయండి! ఇప్పుడు మీరు చెప్పినది. కేవలం తెలంగాణకు మాత్రమే వర్తించునా లేక యావత్ భారతదేశానికి వర్తించుతుందా?" అడిగాడు నారదుడు.

"ఇప్పుడు మేము చెప్పినది. యావత్ భారత దేశానికి వర్తించును. గుళ్ళూ గోపురాలు, యజ్ఞ యాగాలు కన్నా కష్టజీవుల చెమట చుక్కలే మిన్న. కార్మికులు, రైతులే సంపద సృష్టికర్తలు. కష్టజీవులకు మేలు జరిగితే సంతోషిస్తాము. వారికి నష్టం జరిగితే ఆగ్రహిస్తాము. అయితే కలియుగంలో ప్రజలే చరిత్ర నిర్మాతలు అది గుర్తెరిగి పాలించుట పాలకుల వంతు!" అన్నారు ముగ్గురమ్మలు.

నారదుడు కైలాసం నుండి బయలు దేరాడు.

- ఉషాకిరణ్



నూతనంగా ఏర్పాటైన ప్రభుత్వానికి అభినందనలు

- ప్రజలకు ఇచ్చిన హామీలు వెంటనే అమలయ్యేలా కృషి చేయాలి
- రైతు సంఘం జిల్లా నాయకులు బండి రమేష్

నవతెలంగాణ-ఖమ్మం

నూతనంగా ఏర్పాటైన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి అభినందనలు తెలియజేస్తూ, ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు అయ్యే విధంగా కృషి చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు బండి రమేష్ అన్నారు. శనివారం ఖమ్మంలోని సుందరయ్య భవనంలో ఖమ్మం జిల్లా అధ్యక్షుడు మద్దాల ప్రభాకర్ అధ్యక్షతన జిల్లా కార్యదర్శి వర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బండి రమేష్ మాట్లాడుతూ ఆరు గ్యారెంటీల్ని వెంటనే అమలు చేయాలని, ముఖ్యంగా రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి షేక్ బషీరుద్దీన్ మాట్లాడుతూ నూతన ప్రభుత్వం వెంటనే నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని, దీనికోసం ఖాళీగా ఉన్న టీచర్ పోస్టుల భర్తీకై వెంటనే మెగా డీఎస్సీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం చేసిన పోరాటాల్లో అక్రమంగా పెట్టిన కేసులు ఎత్తివేయాలని, టీఎస్పీఎస్సీ ద్వారా వెంటనే ఇయర్ క్యాలెండర్ ప్రకటించాలని, గ్రూప్ వన్, గ్రూప్ టూ అలాగే గ్రూప్ ఫోర్ ఎగ్జామ్స్ కి నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు చింతల రమేష్, కూరపాటి శ్రీను, సత్తెనపల్లి నరేష్, పటాన్ రోషిని ఖాన్ ,పొన్నం మురళి, దిండు మంగపతి, దాసరి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



గాలీబ్ పాషాని సన్మానించిన అయ్యప్పస్వాములు

నవతెలంగాణ-కొణిజర్ల

అయ్యప్పస్వాముల ఇరుముడి సందర్భంగా మండల పరిధిలోని అమ్మపాలెం గ్రామంలో సేవాలాల్ గుడిలో ఏర్పాటు చేసిన ఇరుముడి కార్యక్రమానికి కాంగ్రెస్ మండల నాయకులు షేక్ గాలీబ్ పాషా హాజరైయ్యారు. ఈ సందర్భంగా అయ్యప్పస్వాములను ఆయన ఆశీర్వదించారు. అనంతరం అయ్యప్పమాలదారులు గాలీబ్ పాషాని సన్మానించారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు కోటి ప్రభాకర్ క్రిష్ణమూర్తి, రామూర్తి, రంజాన్ సలీం, బాబు మోహన్, రామకృష్ణ సత్యం తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించిన కాంగ్రెస్

నవతెలంగాణ-కామేపల్లి

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మహిళలకు బస్సు ప్రయాణం ఉచితం కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కామేపల్లి మండల పరిధిలోని తాళ్ళగూడెం కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు అప్పారావు ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. మహిళలు బస్సులో ఎక్కడకైనా ఉచితంగా ప్రయాణించవచ్చని ఇది దేశంలోనే మొట్టమొదటిసారి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అవకాశం కల్పించారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ నల్లమోతు లక్ష్మయ్య, సర్పంచ్ సునీత, తెలుగుదేశం పార్టీ జిల్లా నాయకులు పుచ్చకాయల సత్యనారాయణ, రామారావు, సీపీఐ మండల అధ్యక్షులు పుచ్చకాయల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ కామేపల్లి

కొత్త లింగాల క్రాస్ రోడ్డు కీర్తిశేషులు రామ్ రెడ్డి వెంకట్ రెడ్డి విగ్రహం కూడలి వద్ద కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో సోనియా గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గింజల నరసింహారెడ్డి, సీనియర్ జిల్లా కాంగ్రెస్ నాయకులు ఏపూరి మహేందర్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ దమ్ములపాటి సత్యనారాయణ డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ మాజీ ఎంపీపీ మాలోతు సరి రామ్ నాయక్, ఎంపీటీసీ సభ్యులు నల్లమోతు లక్ష్మయ్య, బొడ్డు సునీత లక్ష్మీనారాయణ, సర్పంచులు లకవత్ సునీత, కోడెం సులోచన, భూక్య విజయ మోహన్, మహిళా అధ్యక్షురాలు దారావతు అనురాధ, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు దేవుళ్ళ రామకష్ణ, బీసీ సెల్ అధ్యక్షులు చల్ల మల్లయ్య పాల్గొన్నారు

సోనియా గాంధీ జన్మదిన వేడుకలు

పెనుబల్లి : సోనియా గాంధీ జన్మదిన వేడుకలు వీఎం బంజర్ రింగ్ సెంటర్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం జరిగాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అభిమానులు కేకు కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చీకటి రామారావు తాళ్లూరు రవి మిట్టపల్లి కిరణ్ బానోతు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సోనియా గాంధీ జన్మదిన వేడుకలు.

మధిర : సోనియా గాంధీ జన్మదిన వేడుకలను మధిర మండలం మాటూరు గ్రామంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కోల శంకర్రావు ఘనంగా నిర్వహించారు. జన్మదిన సందర్భంగా దివ్యాంగులు చిల్ల కృష్ణారావుతో కేక్ కట్ చేపించి కార్యకర్తలకు తినిపించారు. ఈ కార్యక్రమంలో కాశీ కోటేశ్వరరావు, కపిల్వాయి సత్తిరాజు, వారం శ్రీనివాసరావు, మేడిశెట్టి శ్రీనివాసరావు, గోపినేని శివ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో...

సోనియాగాంధీ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-సత్తుపల్లి



కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ 78వ జన్మదిన వేడుకలను శనివారం ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామిశెట్టి సుబ్బారావు, కొత్తూరు ప్రభాకరరావు, వైస్ ఛైర్మెన్ తోట సుజలారాణి, మాజీ ఎంపీపీ చల్లారి వెంకటేశ్వరరావు, మలిరెడ్డి మురళీరెడ్డి, మోరిశెట్టి సాంబశివరావు, దొడ్డా శ్రీనివాసరావు, గాదె చెన్నకేశవరావు, కౌన్సిలర్లు గ్రాండ్ మౌలాలి, ఎస్కే నాగుల్‌మీరా, జయరాజు, నరుకుళ్ల రవి, గోలి శ్రీనివాసరెడ్డి, మున్వర్ హుస్సేన్ పాల్గొన్నారు.

యలమందకు నివాళులర్పించిన కోట రాంబాబు

నవతెలంగాణ-మధిర

మధిర మండలం రాయపట్నం గ్రామంలో గట్టిగుండె యలమంద గుండెపోటుతో శనివారం మృతి చెందగా వారి మృతదేహానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు డా.కోట రాంబాబు నివాళులు అర్పించారు. వారి మృతికి గల వివరాలు అడిగి తెలుసుకొని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపి ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో గోళ్ళ ఉద్దండు, జంపయ్య మరియు గ్రామ కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

పంటలు దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలి

సీపీఐ(ఎం) మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం

నవతెలంగాణ-ముదిగొండ

తుఫాన్ తో మండలంలో అకాల వర్షం కురిసి పంటల దెబ్బతిని రైతన్నలకు అపార నష్టాన్ని మిగిల్చిందని సిపిఐ(ఎం) మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నోటి కాడికి వచ్చినా పంటలు తుఫాన్‌తో తీవ్రంగా నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పత్తి, మిర్చి, వరి, మొక్కజొన్న పంటలు తుఫానుకు తడిసి ఈదురుగాలులకు నేలవాలినయని పేర్కొన్నారు. అన్నదాతలను అన్ని విధాల రాష్ట్ర ప్రభుత్వం ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శి కందుల భాస్కరరావు, కోలేటి ఉపేందర్ మరొక ప్రకటనలో కోరారు.

ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం

నవతెలంగాణ - బోనకల్

మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని శనివారం మండల కేంద్రంలో టీపీసీసీ సభ్యులు పైడిపల్లి కిషోర్ కుమార్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాలి దుర్గారావు ఆర్టీసీ బస్సుకు జండా ఊపి లాంచనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మండల పరిషత్ ఉపాధ్యక్షుడు గుగులోతు రమేష్, పల్లి పాటి తిరుపతిరావు, కర్నాటి రామకోటేశ్వరరావు, బండి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బస్సుల్లో ఉచిత ప్రయాణం బాగుంది

- మహాలక్ష్మి పథకాన్ని జెండా ఊపి ప్రారంభించిన కలెక్టర్
- ఉచిత బస్ ప్రయాణ సౌకర్యం పట్ల మహిళల హర్షం...
- కోలాహలంగా మారిన ఖమ్మం బస్టాండ్





బోనకల్‌లో బస్సు కోసం వేచి చూస్తున్న మహిళా ప్రయాణికులు

నవతెలంగాణ-ఖమ్మం

కొత్త ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో ఇప్పటికే 2 హామీలను నెరవేర్చుకున్న ప్రభుత్వం పట్ల మహాలక్ష్మి పథకం లబ్దిదారుల హర్షం వ్యక్తంచేశారు. సోనియా గాంధీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని మహాలక్ష్మి పథకాన్ని అమలు జరుపడం పట్ల తెలంగాణ ఆడపడుచులో హర్షాతిరేఖాలు అంబరాన్నంటాయి. నూతనంగా కొలువుదీరిన కొత్త ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నిరుపేద ప్రజల సౌలభ్యం కోసం.. సబ్బండ వర్ణాల అభివృద్ధే ధ్యేయంగా అడుగులు వేశారని చెప్పవచ్చు. ఇందులో భాగంగా మహాలక్ష్మి పథకం ద్వారా తెలంగాణ రాష్ట్రంలో గల తెలంగాణ ఆడపడుచులకు రాష్ట్ర మొత్తంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా నయా పైసా ఖర్చు లేకుండా ఉచితంగా ఆర్టీసీ బస్సు పల్లె వెలుగు, ఎక్స్ప్రెస్ లలో ప్రయాణం చేయవచ్చు అని చెప్పి ఇటీవల ప్రకటించిన ప్రకటనను కార్యరూపం దాల్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందని చెప్పవచ్చు. గతంలో ఏ ప్రభుత్వాలు ఇంతటి సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకోవడంకానీ ప్రకటనలు ప్రకటించడంకానీ జరగలేదని, ఖమ్మం ఉమ్మడి ఖమ్మం జిల్లా మహిళా లోకం పేర్కొంటున్నారు. అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన ఘనత కూడా ఈ ప్రభుత్వానికి దక్కిందని ప్రజలు అన్నారు. పల్లె వెలుగు, ఎక్స్ప్రెస్ బస్సులలో ప్రస్తుతం ఒక వారం పాటు ఎలాంటి గుర్తింపు కార్డు లేకుండా బాలికలు, యువతులు, మహిళలు తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడ నుంచి ఎక్కడి వరకు అయినా ప్రయాణం చేయవచ్చు అని ప్రభుత్వం ఇప్పటికే చెప్పిన విషయం విదితమే... కాగా వారం తర్వాత ఆధార్ కార్డు కానీ ఇతర గుర్తింపు కార్డు కానీ కండక్టర్కు చూపించాల్సి ఉంటుందని ప్రభుత్వం తమ మార్గదర్శకాలలో వెల్లడించిన విషయం ప్రజలకు తెలిసిందే.. కాగా ఇలాంటి మంచి పథకాలకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో స్పందన లభించింది... గతంలో ఆర్టీసీ వ్యవస్థ నష్టాల్లో ఉందని చెప్పిన గత ప్రభుత్వాలకి ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అమలు జరుపుతున్న మహాలక్ష్మి పథకం ధి బెస్ట్ అవుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు... కాగా ఏదేమైనప్పటికీ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం పథకం కోసం మహాలక్ష్మి పేరుతో పథకాన్ని రూపొందించి ప్రభుత్వం ఏర్పాటు జరిగిన తర్వాత వెను వెంటనే ఈ పథకాన్ని అమలోకి తీసుకొచ్చిన ఘనత కాంగ్రెస్ దేనేని ప్రజలు భావిస్తున్నారు.. ఈ నేపథ్యంలో ఈ పథకం ద్వారా అనేకమంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రయాణ సౌకర్యాన్ని వినియోగించుకుంటూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో ఉమ్మడి ఖమ్మం గల కొంతమంది ప్రయాణికుల ప్రయాణికులు యువతులు విద్య కోసం ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లే మహిళ విద్యార్థులు విద్యార్థినిలు వారి వారి మాటల్లో కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పతనం గురించి వారు చేస్తున్న పనుల గురించి మహిళా ప్రయాణికులు సైతం వారి మాటల్లోనే నవతెలంగాణకు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

మహిళా సాధికారతకు తొలి అడుగుగా మహాలక్ష్మి పథకం

- కలెక్టర్ వి.పి. గౌతమ్

నవతెలంగాణ-ఖమ్మం



మహిళా సాధికారతకు తొలి అడుగుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మహాలక్ష్మి పథకం ప్రవేశపెట్టినట్లు జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. శనివారం కలెక్టర్ గౌతమ్ నూతన బస్ స్టేషన్ లో టీఎస్ ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యానికి సంబంధించి మహాలక్ష్మి పథకాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఇంటికి పరిమితం కాకుండా బయటకు వచ్చి, సామాజికంగా, ఆర్థికంగా క్రియాశీలక పాత్ర పోషించాలని అన్నారు. ప్రయాణానికి మెజారిటీ ప్రజలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నట్లు, మహిళలకు ఉచిత ప్రయాణంతో ఆర్థిక భారం తగ్గనున్నట్లు ఆయన అన్నారు. ప్రస్తుతమున్న లెక్కల ప్రతిరోజూ 40 నుండి 50 వేల మంది మహిళలు ప్రయాణం చేస్తున్నట్లు, మహాలక్ష్మి పథకంతో ఈ సంఖ్య పెరుగుతుందన్నారు. చిన్న పాప నుండి పెద్దవాళ్ళ దాకా, వయసుతో సంబంధం లేకుండా మహిళలందరికీ, ట్రాన్సజెండర్లకు ఈ పథకం వర్తిస్తుందన్నారు. రాష్ట్ర పరిధిలో ఉచితంగా ప్రయాణించవచ్చని ఆయన తెలిపారు. ఈ పథకం పల్లెవెలుగు, ఎక్స్ ప్రెస్ సర్వీసులకు వర్తిస్తుందని, జిల్లాలో ఈ రకమైన సర్వీసులకు 371 బస్సులు ఉన్నాయని ఆయన తెలిపారు. బస్సుల ఛార్జీలతో దూరం వెళ్లి చదవలేక అమ్మాయిలు చదువు మానివేసేవారని ఆయన అన్నారు. పురుషులతో సమానంగా మహిళలు ఎదగాలని ఆయన తెలిపారు. అనంతరం మహాలక్ష్మి ఉచిత ప్రయాణ టికెట్ ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఆర్ఎం సిహెచ్. వెంకన్న, జిల్లా రవాణాధికారి టి. కిషన్ రావు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారిణి విద్యాచందన, జిల్లా సంక్షేమ అధికారిణి సుమ, ఆర్టీసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి

ఎస్‌జీపీఏటీ రాష్ట్ర అధ్యక్షులు రాజేంద్రబాబు

నవతెలంగాణ-ఖమ్మం



నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం ప్రజల పక్షాన ఆలోచన చేసి సుపరిపాలన అందించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షన్ దారుల సంఘం (ఎస్జీపీఏటీ) రాష్ట్ర అధ్యక్షులు ఎ. రాజేంద్రబాబు కోరారు. శనివారం నగరంలోని రిక్కాబజార్ పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ సంఘం ఖమ్మం జిల్లా సమావేశం సరిశ పుల్లయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో రాజేంద్రబాబు మాట్లాడుతూ తెలంగాణ ప్రజలు పాలనలో మార్పు కోరి నూతన వ్యక్తులకు, కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇచ్చారని, ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చే దిశగా మంత్రి వద్ద నిర్ణయాలు ఉండాలని, సామాన్య ప్రజలతో పాటు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పెన్షన్ దారులు పట్ల సానుకూల వైఖరిని అవలంభించాలని సూచించారు. పెన్షన్దారులకు నగదు రహిత ఈహెచ్ఎస్ సౌకర్యంతో పాటు ఐఆర్ను పెంచి మంజూరు చేయాలని, డీఏ బకాయిలను కూడా వెంటనే విడుదల చేయాలని కోరారు. ప్రజల ఆకాంక్ష మేరకు నూతనంగా ఏర్పడిన ప్రభుత్వంలో పెన్షదారుల సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశిస్తున్నామన్నారు. సుపరిపాలన అందించి ప్రజల అభిమానాన్ని నూతన ప్రభుత్వం చూరగొనాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బాధ్యులు టి. పురుషోత్తం, బి. నర్సయ్య, ఎస్. యాదయ్య, ఎ. సూర్యనారాయణ, సభ్యులు, పెన్షనారులు పాల్గొన్నారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం పెన్షనాదారుల సంఘం (ఎస్పీఏటీ) ఖమ్మం జిల్లా కమిటీ నూతన కార్య వర్గాన్ని రాష్ట్ర అధ్యక్షులు రాజేంద్రబాబు సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షులుగా పరిశ పుల్లయ్య ప్రధాన కార్యదర్శిగా కె.కృష్ణమూర్తి, కోశాధికారిగా వెంకటేశ్వరరావు లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులు బి.కృష్ణకుమారి, పి. సత్యనారాయణ, ఎండి శాసింసాహెబ్, కె. శరతాబాబులను ఎన్నుకున్నారు. కార్యదర్శులుగా ఎ. ప్రకాష్, బి. రాధాకష్ణమూర్తి, జి. శ్రీనివాసరావు, టి. మురళిలు ఎన్నికయ్యారు. మహిళా కార్యదద్యులుగా వి, లక్ష్మి, ఎం. సరస్వతి, సలహా మండలి సభ్యులుగా ఎండి అబ్దుల్ ఇబ్బార్, ఎండి అబ్దుల్ నహీం, పి. సుధాకర్, జి. వెంకటేశ్వరరావు, ఎం. మధులను ఎన్నుకున్నారు.

ఎస్బిఐటీలో బహుళజాతి హెచ్‌ఆర్‌ల ముఖాముఖీ

నవతెలంగాణ-ఖమ్మం



విద్యార్థులు క్రమ శిక్షణతో కష్టపడి చదవడంతో పాటు ప్రణాళికతో ముందుకు సాగితే దేనినైనా సాధించవచ్చని హెచ్.సి.యల్. కంపెనీ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శివప్రసాద్ సూచించారు. శనివారం ఖమ్మం ఎస్బిఐటి ఇంజనీరింగ్ కళాశాలలో ఐ.సి.టి అకాడమీ వారు నిర్వహించిన పలు బహుళజాతి కంపెనీల ప్రతినిధులతో విద్యార్థుల ముఖాముఖీ కార్యక్రమానికి ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన హెచ్.సి.యల్. కంపెనీ బ్రాంచ్, పనితీరు గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అదేవిధంగా విద్యార్థులు తమ కంపెనీ బ్రాంచ్ కు ఇండస్ట్రియల్ టూరుకు కూడా రావచ్చునని తెలిపారు. టీ.సి.యస్. కంపెనీ నుండి రీజియన్ హెడ్‌సిహెచ్ రిచర్డ్ కింగ్ మాట్లాడుతూ విద్యార్థులు కంపెనీల ఇంటర్వ్యూలలో వారికి నైపుణ్యాన్ని ఎలా పెంచుకోవాలో వివరించారు. అదే విధంగా టీ.సి.యస్. కంపెనీలో ఉన్న అవకాశాల గురించి తెలియజేశారు. బిర్లా సాఫ్ట్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ అబు బాకర్ మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్లో డిమాండ్ ఉన్న టెక్నాలజీ గురించి వివరించారు. కాన్సెప్ట్ ఆఫ్ ఇన్నోవేషన్ ఎలా ఉండాలి, కంపెనీలో జాయిన్ అయ్యే విధానం, అవకాశాల ఎలా ఉంటాయి వంటి అంశాలను తెలియచేశారు. అనంతరం విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు వారు ముఖాముఖీ సమాధానాలు ఇచ్చారు. అనంతరం సర్వీస్ నౌ డైరెక్టర్ జి. భాస్కర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా భారతదేశంలో ఐటి రంగ పురోగతి, ఉద్యోగ అవకాశాల గురించి వివరిస్తూ ప్రస్తుత జాబ్ మార్కెట్ ఉద్యోగార్హత సాధించాలంటే అవసరమైన వత్తి నైపుణ్యాలను విద్యార్థులకు వివరించి, వారి ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు.

కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ జి. ధాత్రి మాట్లాడుతూ యాజమాన్యం నిర్వహించే ఇటువంటి కార్యక్రమాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి. రాజ్‌కుమార్ మాట్లాడుతూ బహుళజాతి కంపెనీల నుండి హాజరై తమ విద్యార్థులకు అనేక అంశాలపై తర్ఫీదు ఇవ్వడంతో పాటు వారి సందేహాలను నివృత్తిచేసిన ఆయా కంపెనీల ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ అమిత్ బింధాజ్, ఎకడమిక్ డైరెక్టర్స్, గంధం శ్రీనివాసరావు, డాక్టర్ ఎ.వి.వి. శివ ప్రసాద్, జి. ప్రవీణ్ కుమార్, డాక్టర్ జె. రవీంద్రబాబు, డాక్టర్ ఎన్. శ్రీనివాసరావు, టి.పి.ఒ. ఎస్ సవిత తదితరులు పాల్గొన్నారు.

పొంగులేటికి మండల నాయకులు అభినందనలు

కల్లూరు : రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకులు పసుమర్తి చంద్ర రావు పెదబోయిన శ్రీనివాసరావు, హనుమతండ సర్పంచ్ ధరావత్ మోహన్, భూక్య శివకుమార్, వేరు వేరుగా కలిసి అభినందనలు తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ మంత్రి వర్గంలో చోటు లభించినందుకు చాలా ఆనందంగా ఉందని ఈ సందర్భంగా పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఖమ్మం జిల్లాకు ఒక మంత్రిగా సేవ చేసే భాగ్యం లభించిందని తప్పకుండా అందరికీ అందుబాటులో ఉంటానని ఈ సందర్భంగా నాయకులకు మాట ఇవ్వడం జరిగింది.

వ్యాపార వేత్త లగడపాటి నాగేశ్వరరావు మృతి



వైరా : పట్టణానికి చెందిన వ్యాపార వేత్త ఖమ్మం జిల్లా ఆయిల్ మిల్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లగడపాటి నాగేశ్వరరావు క్యాన్సర్, కిడ్నీ సంబంధ వ్యాధితో బాధపడుతూ శుక్రవారం హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. ఆయన స్వాతంత్ర్య సమర యోధులు లగడ పాటి లక్ష్మీ నర్సయ్య పెద్ద కుమారుడు. రాజకీయాలు ఏవైనా అమర జీవి బోడేపూడి వెంకటేశ్వరరావుకు అత్యంత సన్నిహితుడుగా ఉండేవారు. ఆయన మరణం పట్ల అన్ని రాజకీయ పార్టీల నాయకులు కార్యకర్తలు సంతాపం తెలిపారు. వైరా హిందూ స్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.ఆయనకు బార్య,ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.



హార్వెస్ట్ విద్యార్థుల వనవిహారం

నవతెలంగాణ-ఖమ్మం

నగరంలోని హార్వెస్ట్ పాఠశాల ప్రైమరీ విద్యార్థినీ, విద్యార్థులను నగర సమీపంలో ఎంతో సువిశాలమైన వెలుగు మట్ల పార్కుకు తీసుకువెళ్లారు. సుమారు 800 మంది విద్యార్థినీ, విద్యార్థులు ఈ వన విహారయాత్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. వివిధ రకాల ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు మ్యాజిక్ షో నిర్వహించారు. పాఠశాల బయట ప్రకృతి ఒడిలో స్వేచ్ఛగా ఆడుకునే విధంగా చక్కటి ఏర్పాట్లు చేసి వారిని వెలుగుమట్ల పార్కుకు తీసుకు వెళ్ళడం జరిగిందని హార్వెస్ట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పి. రవిమారుత్, ప్రిన్సిపల్ ఆర్.పార్వతీరెడ్డి తెలిపారు. ఉదయం నుండి సాయంత్రం వరకు అక్కడ వారికి వివిధ రకాలైనటువంటి ఆటపాటలతో కూడిన అంశాలకు నేర్పిస్తూ, పాఠశాల అంటే భయాన్ని పోగొట్టి స్నేహభావాన్ని పెంపొందిస్తూ, విద్యార్థులు, ఉపాధ్యాయుల మధ్య స్నేహపూరిత వాతావరణాన్ని కల్పించాలని ఉద్దేశంతో ప్రతి సంవత్సరం లాగానే ఈ విద్యా సంవత్సరంలో కూడా ఈ వనవిహార కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. రిక్రియేషన్ గేమ్స్ నిర్వహించి గెలుపొందిన విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఆద్యంతం పిల్లలు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ నృత్యాలు ఆట, పాటలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రైమరీ హెచ్.ఎం. అరుణదీప్తి, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, పి.యి.టీలు పాల్గొన్నారు.

పల్లెకు రాని 'పల్లె వెలుగు'

మహాలక్ష్మి పథకం మాకెట్లా?

నవతెలంగాణ-వైరా

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాడాలన్న ఆకాంక్షను ప్రజలు నెరవేర్చారు. ప్రజలకు ప్రభుత్వం ఇచ్చిన గ్యారంటీలను అనుకున్న ప్రకారం అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. ప్రభుత్వం మహాలక్ష్మి, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాలను శనివారం లాంఛనంగా ప్రారంభించింది. మహలక్ష్మి పథకంలో భాగంగా శనివారం మధ్యాహ్నం బసులో ప్రయాణిస్తున్న మహిళలకు వైరా కాంగ్రెస్ నాయకులు స్వీట్లు కూడా పంపిణీ చేశారు. మహలక్ష్మి పథకం ప్రభుత్వ లక్ష్యం మేరకు నెరవేర్చాలంటే పల్లె వెలుగు బసు లైనా ప్రతి పల్లె సమీపానికి వెళ్ళాల్సి వుంది. వైరా నియోజక వర్గంలో ఏ పల్లెకూ పల్లె వెలుగు బసు వెళ్ళదు. నియోజక వర్గ కేంద్రం వైరా నుండి విభజిత ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రములోని ప్రస్తుత ఎన్‌టిఆర్ జిల్లా నెమలి గ్రామం 20 కిమీ ఉన్నది. నెమలి గ్రామంలో వేణు గోపాల స్వామి దేవస్థానం ప్రసిద్ధి గాంచిన పుణ్యస్థలంగా భావించి ప్రతి శుక్ర వారం తెలంగాణలోని అనేక జిల్లాల నుండి కొంత మంది భక్తులు వస్తుంటారు. రాష్ట్రం విడిపోయిన తర్వాత 20 కి. మీ డబుల్ రోడ్డుగా మార్చి అభివృద్ధి చేశారు. సుమారు 7 సంవత్సరాలు అయినది. సింగిల్ రోడ్డుగా ఉన్నప్పుడు మధిర డిపో నుండి వైరా నుండి నెమలికి షటిల్ సర్వీసులు నడిపారు. మధిర నుండి వయా వైరా, నెమలి మీదుగా మధిరకు కొన్ని ట్రిప్పులు నడిపారు. డబుల్ రోడ్డు వేసిన తర్వాత ఒక్క బసు కూడా నడవటం లేదు. మరో రోడ్డు వైరా - మధిర రూటులో రెబ్బ వరం నుండి నెమలి గ్రామం వెళ్ళు రోడ్డు గతం లో నడిపిన ఆర్‌టిసి బసులను దాదాపు 6, 7 ఏళ్ల నుంచి నడపటం లేదు. వైరా - నెమలి రూటులో సిరిపురం, పూసల పాడు, గౌండ్ల పాలెం, నారపనేని పల్లి, విప్పలమడక లింగన్న పాలెం, గరిక పాడు, దాచాపురం గ్రామాలు ఖమ్మం జిల్లా గ్రామాలు ఈ రోడ్డు అంతరాష్ట్ర రహదారిగా మారింది. రెండు రాష్ట్ర ప్రభుత్వాలు దాచాపురం వద్ద చెక్ పోస్టులు ఏర్పాటు చేస్తుంటాయి. రెబ్బవరం నుండి నెమలి వరకు రెబ్బవరం కొండకుడిమా, ఖానా పురం, గోవిందా పురం, గన్నవరం గ్రామాలు ఉన్నవి. ఈ గ్రామాలకు బసు లేదు. చివరి గ్రామాలు దాచాపురం, గన్నవరం నుండి వైరా మండల కేంద్రానికి రావాలంటే ఆటోకు రూ.50 చార్జి తీసుకుంటున్నారు. వైరా - మధిర రూటులో గొల్లపూడి కేంద్రంగా మండలం లోని అష్టగుర్తి, గొల్లెపాడు గ్రామాలు కనీసం నాలుగు కి.మీ దూరం ఈ గ్రామాలకు పల్లె వెలుగు బసు వెళ్ళదు. వైరా నుండి గండగల పాడు, రాష్ట్ర ఉప ముఖ్యంత్రి మల్లు భట్టి విక్రమార్క స్వగ్రామం స్నానాల లక్ష్మీపురం, ముసలి మడుగు గ్రామాల మీదుగా వయా సిరిపురం నెమలి కి కొన్నేళ్ళు బసు నడిపారు. ప్రస్తుతం ఏ పల్లెకు పల్లె వెలుగు బసు వెళ్ళటం లేదు. ఈ గ్రామాల మహిళలు మహా లక్ష్మి పథకాన్ని ఎలా సద్వినియోగం చేసుకుంటారని ప్రశ్న వస్తుంది. అదే విధంగా నియోజక వర్గంలోని కొణిజర్ల మండలంలో ఖమ్మం నుండి ప్రొద్దు టూరు వెళ్లే బసు మాత్రమే కొణిజర్ల, బస్వాపురం, చిన్న గోపతి,పెద్ద గోపతి గ్రామాలను కలుపుతూ వెళుతుంది. అంతే తప్ప మరే గ్రామానికి బసు వెళ్ళదు. ఖమ్మం - వైరా రూటులో పల్లి పాడు నుండి ఏనుకూరు వరకు డబుల్ రోడ్డు నిర్మించారు. సుమారు 15 కి.మీ దూరంలో 15 గ్రామాలున్నాయి. ఆ గ్రామాలకు బసు లేదు. మహిళలకు ఆటో లే ప్రయాణ సాధనాలు. అలాగే కొణిజర్ల నుండి రామనర్సయ్య నగర్ 10 కిమీ బస్ లేదు. కారేపల్లి మండలంలో ఖమ్మం నుండి వచ్చే బసు గాదె పాడు, చీమల పాడు, మాదారం గ్రామాలకే ఒకటీ రెండు ట్రిప్పులు నడుపుతున్నారు. విశ్వనాథ పల్లి మీదుగా మాదారం వెళ్ళు బస్ సర్వీసులను రద్దు చేశారు. మండలం లో చిన్న నడిం పల్లి, రేలఖాయల పల్లి, నుండి బసు ఎక్కాలంటే 20 కి.మీ దూరం లోని ఇల్లందు వెళ్లాల్సి ఉంటుంది. జూలూరు పాడు మండలం లో కొత్తగూడెం , ఖమ్మం ప్రధాన రోడ్డు పై ఉన్న 5 గ్రామాలు మినహా ఏ గ్రామానికి బసు వెళ్ళదు. మండల కేంద్రానికి బేతాలపాడు, పాలకొల్లు, కాకర్ల, అనంతారం, చెంఘుని గూడెం, కరివారి గూడెం, గ్రామాలు సుమారు 8 కి.మీ దూరం లో ఉన్నవి. నల్లగొండ బోడు ఇటీవల వార్తల్లోకి ఎక్కిన గ్రామము. ఈ గ్రామానికి మరే గ్రామం తో రహదారి సంబంధం లేదని ఎన్నికలను బహిష్కరించారు. ఈ గ్రామాల మహిళలకు ప్రభుత్వ మహాలక్ష్మి పథకం వర్తింప చేస్తారో వేచి చూడాలి. ఏన్కూరు మండల గ్రామాలకు బస్ సౌకర్యం లేదు. ఖమ్మం నుండి ఏన్కూరు వరకు వయా ముచ్చర్ల ఉదయం, మధ్యాహ్నం,రాత్రి మూడు ట్రిప్పులు బస్ నడుస్తుంది. మండలం లో నాచారం, ఒంటి గుడిసె, బద్రు తండా, కేసుపల్లి, రాయమాధారం, లచ్చగూడెం,శ్రీరామ్ గిరి, ఆరికాయల పాడు, జన్నారం గ్రామాలకు బస్ రూట్లు ఉన్నా బసులు వెళ్ళటం లేదు. ఇలా ఏ మండలం లో కూడా పల్లెలకు కనీసం పల్లె వెలుగు బసు కూడా అందు బాటులో లేకుండా గొప్ప లక్ష్యంతో అమలు జరపాలనుకుంటున్న మహాలక్ష్మిని ఎలా నెరవేరుస్తారని మహిళలు కోరుకోవటంతో పాటు మా పల్లెకు పల్లె వెలుగు బసు రావాలన్న డిమాండ్ ముందుకు వస్తుంది.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

ఖమ్మం

6

ఆదివారం | డిసెంబర్ 10, 2023 | www.navatelangana.com

రేపు మండల ప్రజా పరిషత్ సమావేశం

నవతెలంగాణ-కల్లూరు

కల్లూరు మండల పరిషత్ సర్వసభ సమావేశం సోమవారం మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎండీఓ బీ.రవికుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు సకాలంలో హాజరుకావాలని కోరారు. మండల స్థాయి అధికారులు తమ శాఖను నివేదికలతో సకాలంలో హాజరుకావాలని కోరారు.

ఉచిత బస్సు ప్రయాణంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-తల్లాడ

మహాలక్ష్మి, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కార్యక్రమంలో శనివారం తల్లాడ మండల కాంగ్రెస్ నాయకులు బస్టాండ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్, అధ్యక్షుడు కాపా సుధాకర్ మాట్లాడుతూ ఇచ్చిన హామీలను శరవేగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందన్నారు. అందులో భాగంగా మహాలక్ష్మి పథకాన్ని శనివారం ప్రారంభించారని, ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో దగ్గుల రఘుపతిరెడ్డి, దగ్గుల నాగిరెడ్డి, బొడ్డు వెంకటేశ్వర్లు, వేంశెట్టి జగదీష్, షేక్ జమాల్, కంట్రోలర్ ఆశీర్వాదం



పాల్గొన్నారు.

సేవాలాల్ గుడి సత్రానికి రూ.50వేల ఆర్థిక సాయం

నవతెలంగాణ-కొణిజర్ల

మండల పరిధిలోని అమ్మపాలెం గ్రామంలో ఉన్న సేవాలాల్ గుడి సత్రానికి ఆర్థిక సహాయం అందించాలని స్థానిక ఎంపీటీసీ దంపతులు బాణోత్ అనూష క్రిష్ణలు కాంగ్రెస్ నాయకులు మండల ఉపాధ్యాక్షుడు షేక్ మస్తాన్‌ని కోరగా వెంటనే స్పందించిన మస్తాన్ రూ.50 వేల ఆర్థిక సహాయం అందిస్తానని పిఠాదిపతి తేజావత్ కోటికి హామీచ్చారు. శనివారం అయ్యప్పస్వాముల ఇరుముడి కార్యక్రమానికి హజరై అయ్యప్ప మాలదారులను ఆశీర్వదించి సన్మానించారు. అనంతరం స్వాములు మస్తాన్‌ని శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు వాంకుడొత్ అనిల్, తేజావత్ పవన్ నాయక్, బాణోత్ గోపి, గుగులోత్ క్రిష్ణమూర్తి, సతీష్, చలపతిరావు, వాంకుడొత్ సీతారాములు, కూమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక వెలుసుబాటుకు మహాలక్ష్మి పథకం

కాంగ్రెస్ ఖమ్మం నగర అధ్యక్షుడు మహమ్మద్ జావేద్

నవతెలంగాణ-ఖమ్మం

కాంగ్రెస్ పార్టీ మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత ఆర్టీసి బస్సు ప్రయాణం కల్పించడంతో మహిళలకు ఆర్థికంగా వెలుసుబటు కలుగుతుందని ఖమ్మం నగర అధ్యక్షుడు, పీసీసీ సభ్యులు మహమ్మద్ జావేద్ అన్నారు. శనివారం ఖమ్మంలోని ప్రారంభించిన మహాలక్ష్మి పథకం ఉచిత ఆర్టీసి బస్సులో జిల్లా మహిళా కాంగ్రెస్ నాయకురాలతో కలిసి ప్రయాణించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద పీట వేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, కార్పొరేటర్లు మిక్కిలినేని మంజుల నరేంద్ర, కమర్తపు మురళి, రఫీదా ముస్తఫా, సిటీ మాజీ లైబ్రరీ చైర్మెన్ మహమ్మద్ అశ్రిఫ్, స్వరూప రాణి, పుష్ప, సుజాత,



గౌషియ, సుగుణ తది తరులు పాల్గొన్నారు.

భరత్ విద్యాసంస్థల గార్డెన్ పార్టీ

నవతెలంగాణ-మధిర

ఖమ్మం జిల్లా మధిర పట్టణానికి చెందిన భరత్ విద్యా సంస్థల విద్యార్థులు శనివారం పల్లగిరి ప్రాంతంలోని అమ్మ గార్డెన్స్‌లో ఘనంగా గార్డెన్ పార్టీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విద్యా సంస్థల అధినేత శీలం వెంకటరెడ్డి, ఎస్టీఫ్ జిల్లా నాయకులు కోటిరెడ్డి పాల్గొని విద్యార్థులతో కలిసి ఆట పాటలతో సరదాగా గడిపారు. అనంతరం విద్యార్థులతో కలిసి సంపక్తీ బోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జింకల కోటేశ్వరరావు, ఉమా, డీన్ రవీందర్‌రెడ్డి, స్రవంతి, నాగరాజు, అజిం, పాషా, రమేష్, హెప్సిబా తదితరులు పాల్గొన్నారు.

కోపల్లి జ్ఞానసుందరి మృతి

నవతెలంగాణ-వైరాటౌన్



వైరా మండలం వల్లాపురం గ్రామంలో కోపల్లి జ్ఞానసుందరి (58) అనారోగ్యంతో శనివారం తెల్లవారుజామున మరణించారు. మృతురాలికి భర్త, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సీపీఐ(ఎం) వైరా మండల కార్యదర్శివర్గ సభ్యులు బాజోజు రమణ, వైరా పట్టణ కమిటీ సభ్యులు గుడిమెట్ల మోహనరావు, అమరజీవి కోపల్లి జ్ఞానసుందరి మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో గొర్రెముచ్చు కనకయ్య, గొర్రెముచ్చు లాజర్, గొర్రెముచ్చు జయరాజు, గొర్రెముచ్చు జైపాల్, బుర్రి ఇస్రాయల్, కొట్టే అంతోను, గొర్రెముచ్చు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

బస్టాండులో మహిళలకు కాంగ్రెస్ స్వీట్లు పంపిణీ

నవతెలంగాణ-వైరా



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం పథకాన్ని శనివారం సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా టీపీసీసీ కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ రాష్ట్ర కోకన్వీనర్ కట్ల రంగారావు ఆధ్వర్యంలో వైరా బస్టాండు నందు మహిళలకు స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కట్ల సంతోష్, నంద్రు నాగరాజు, రేచర్ల నాగేశ్వరరావు, వెంపటి రంగారావు, డెంటల్ డాక్టర్ దారెల్లి హరిత, దారెల్లి మదన్మోహన్, గుడిమల్ల రత్తయ్య, గుత్తికొండ వీరబాబు, కంభంపాటి సత్యనారాయణ, కొరకప్పు శ్రీను, దేవరపల్లి వేణు, ఇండ్ల నాగరాజు, ఇండ్ల కిరణ్, కట్ల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సోనియా గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించిన గిరిజనలు

నవతెలంగాణ - బోనకల్



సోనియా గధీ జన్మదిన వేడుకలను బోనకల్ గిరిజన కాలనీవాసులు శనివారం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా కేక్ ను కాంగ్రెస్ యువనేత బీపీ నాయక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర తొలి, మలివిడత అమరవీరుల త్యాగాలను గుర్తించి తెలంగాణ ప్రజల ఆకాంక్ష మేరకు తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసినందుకు, నూతనంగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వము ఆరు గ్యారంటీలలో రెండు తక్షణం అమలు చేయటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు భానోత్ శ్రీను, భానోత్ వెంకటేశ్వర్లు, భూక్య బాలకృష్ణ, గుగులోతు చందు, భూక్య జ్వాల, రాంబాబు, బానోతు జ్వాలా, బోడ గోపి, బాదావత్ సుదీర్, తాళ్లూరి వెంకటేశ్వర్లు, బానోత్ ధనుష్, బానోత్ గోపి పాల్గొన్నారు.

సత్తుపల్లి శాసన సభ్యురాలిగా అసెంబ్లీలో...

ప్రమాణ స్వీకారం చేసిన డాక్టర్ మట్టా రాగమయి దయానంద్

నవతెలంగాణ-సత్తుపల్లి



సత్తుపల్లి శాసనసభ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందిన డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ శనివారం అసెంబ్లీలో తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో పాల్గొని సత్తుపల్లి శాసన సభ్యురాలిగా ప్రమాణం స్వీకారం చేశారు. ప్రొటెం స్పీకర్‌గా వ్యవహరించిన అక్బరుద్దిన్ ఓవైసీ నేతృత్వంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డీప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సమక్షంలో రాగమయి దయానంద్ ప్రమాణ స్వీకారం చేశారు. రాగమయి దయానంద్ అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేస్తున్న దృశ్యాన్ని సత్తుపల్లిలోని కాంగ్రెస్ క్యాంపు కార్యాలయంలో నాయకులు వీక్షిస్తూ కేరింతలు కొట్టారు. ఎమ్మెల్యే రాగమయి దయానంద్ దంపతులకు ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

ఉచిత ప్రయాణం ప్రారంభంతో...

మహిళల మోముల్లో వెల్లివిరిసిన ఆనందం

- మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించిన ఏసీపీ రామానుజం
- బస్సు సీట్లలో కూర్చొని సంబరపడిన మహిళలు

నవతెలంగాణ-సత్తుపల్లి



తెలంగాణలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని ప్రారంభించడంపై మహిళామణుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. శనివారం సత్తుపల్లి ఆర్టీసీ డిపోలో డీఎం యూ రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో ఏసీపీ బొజ్జా రామానుజం ఉచిత ప్రయాణ పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ రామానుజం మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణం ఏర్పాటు చేయడమనేది గొప్ప కార్యక్రమమని, దీంతో కుటుంబాలు ప్రయాణాలు చేసే క్రమంలో కొంత వరకు ఆర్థిక వెసులుబాటు అవుఉంతందన్నారు. డిపో మేనేజర్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ



తెలంగాణ వ్యాప్తంగా మహిళలు పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేసే వీలుందన్నారు. రాష్ట్ర సరిహద్దులు దాటాక టిక్కెట్ తీసుకోవాల్సి ఉంటుందన్నారు. మహిళలతో పాటు బాలికలు, ట్రాన్స్‌జెండర్స్‌కు కూడా ఈ ఉచిత ప్రయాణం వర్తిస్తోందని డీఎం స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కోడూరు సుజాత, వైస్ ఛైర్మెన్ తోట సుజలరాణి, సీఐ మోహన్‌బాబు, కాంగ్రెస్ నాయకులు కొత్తూరు ప్రభాకరరావు, రామిశెట్టి సుబ్బారావు, మొరిశెట్టి సాంబశివరావు, గాదె చెన్నకేశవరావు, గోలి శ్రీనివాసరెడ్డి, నరుకుళ్ల సత్యం, రజియా, దొంతు సరోజిని, కనపర్తి కుమారి, మట్టెల వరలక్ష్మి, భవాని పాల్గొన్నారు.

ఉచిత ప్రయాణంపై మహిళల మనోగతం

టిక్కెట్‌లేని ప్రయాణం ఎంతో ఆనందంగా ఉంది

మట్టా సుజాత, సత్తుపల్లి



టిక్కెట్‌లేని ప్రయాణం ఎంతో సంతోషంగా ఉంది. ఏ ప్రభుత్వం కూడా మహిళలకు ఈ విధమైన గుర్తింపు ఇవ్వలేదు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో చెప్పిన విధంగా ఉచిత ప్రయాణం ప్రారంభమవడంతో రాష్ట్ర వ్యాప్తంగా మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం ఏర్పడిన రెండ్రోజుల్లోనే అమలు చేయడం ఆనందంగా ఉంది

దొంతు సరోజిని, జవహర్‌నగర్, సత్తుపల్లి



కాంగ్రెస్ పార్టీ మాట తప్పకుండా ప్రభుత్వం ఏర్పడిన రెండ్రోజుల్లోనే మహిళలకు ఉచిత ప్రయాణాన్ని ప్రారంభించడంపై చెప్పలేనంత ఆనందంగా ఉంది. పదేండ్ల కాలంలో బస్సు చార్జీలు విపరీతంగా పెంచడంతో ప్రయాణం చేయాలంటేనే భయపడాల్సి వచ్చేది. ఇప్పుడా భయం లేకుండా ప్రభుత్వం మహిళలకు అండగా నిలిచింది.

కొంత వరకైనా ఆర్థిక వెసులుబాటు కలుగుతుంది...

రజియా, వెంగళరావునగర్, సత్తుపల్లి



మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించడంతో కుటుంబాల్లో కొంత వరకైనా ఆర్థిక వెసులుబాటు కలుగుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల పట్ల ఈ విధమైన ప్రేమను కురిపించడం మహిళల్లో ఆనందం పట్టలేనంతగా ఉంది.

ఉచిత ప్రయాణం మహిళలకు వరం

మట్టెల వరలక్ష్మి, సత్తుపల్లి



తెలంగాణలో కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం మహిళలకు వరమన్నారు. మహిళలకు ఇంత మంచి పథకాన్ని ఇవ్వడంపై సోనియాగాంధీకి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మహిళల తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నాం.

రాజీవ్ ఆరోగ్య పథకం పేదలకు వరం

- జిల్లా కలెక్టర్ వీపీ. గౌతమ్

నవతెలంగాణ-ఖమ్మం



రాజీవ్ ఆరోగ్య పథకం పేద ప్రజలకు ఒక వరం లాంటిదని జిల్లా కలెక్టర్ వీపీ. గౌతమ్ అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ స్థానిక ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో రాజీవ్ ఆరోగ్యశ్రీ వైద్య సాయం రూ. 10 లక్షలు పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వంచే రెండు కొత్త పథకాలను ప్రజల కోసం ప్రారంభించడం సంతోషకరమన్నారు. మహిళల సాధికారతకు తొలి అడుగుగా మహాలక్ష్మి పథకం ప్రారంభించినట్లు తెలిపారు. చేయూత పథకం క్రింద రాజీవ్ ఆరోగ్యశ్రీ గరిష్ట పరిమితిని 5 లక్షల నుంచి 10 లక్షల రూపాయలకు పెంచినట్టు చెప్పారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం క్రింద 1,672 రకాల రోగాలకు ఎంపానల్మెంట్ ఉన్న ఆస్పత్రులలో చికిత్స అందించడం జరుగుతుందని, శనివారం నుండి రూ. 10 లక్షల వరకు నగదు రహిత చికిత్స ప్రజలకు అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఇందులో 1,383 సర్జరీలు, 289 మెడికల్ రుగ్మతలు ఉన్నాయన్నారు. ఆరోగ్యశ్రీ పథకం దేశంలో హెల్త్ ఇన్సూరెన్స్‌కు ఆదర్శంగా నిలిచిందన్నారు. వైద్యం ఏ ప్రభుత్వానికి అయిన ప్రాధాన బాధ్యతని తెలిపారు. ఈ పథకంతో పేద ప్రజలకు లబ్దితోపాటు, ప్రభుత్వ ఆసుపత్రులు బలోపేతం అవుతాయన్నారు. వైద్యులు, సిబ్బందికి ప్రోత్సాహకాలు అందుతాయని, ఆరోగ్య సేవలు మెరుగవుతాయన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీతో సదుపాయాలు, ఆస్పత్రుల ఆధునికీకరణకు అవకాశం కలుగుతుందని తెలిపారు. అనంతరం రాజీవ్ ఆరోగ్యశ్రీ చేయూత పథకానికి సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ బీ. మాలతి, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. రాజేశ్వరరావు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారిణి విద్యాచందన, జిల్లా సంక్షేమ అధికారిణి సుమ, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ మాధవరావు, వైద్యాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కోరుకున్న నాయకులు గెలవడంపై...

కాలినడకన ద్వారకా తిరుమలకు కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-సత్తుపల్లి



తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడాలని, జిల్లాలో తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ గెలవాలనే కోరిక నెరవేరడంపై మండల కాంగ్రెస్ నాయకుడు చల్లగుళ్ల నరసింహారావు ఆధ్వర్యంలో 40 మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు శనివారం ఉదయం 5గంటలకు పట్టణంలోని శ్రీకోదండ రామాలయం నుంచి పశ్చిమ గోదావరి జిల్లాలోని ద్వారకా తిరుమలకు బయలుదేరి వెళ్లారు. వీరి నడకయాత్రను వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు యుగంధర్ ప్రారంభించారు. వీరి నడకయాత్ర పశ్చిమ గోదావరి జిల్లా చింతలపూడి, ప్రగడవరం, కామవరపుకోట మీదుగా ఈ రాత్రికి ద్వారకా తిరుమలకు చేరుకొంటోంది. రాత్రి బస అక్కడనే చేయనున్నారు. తెల్లారి వేకువ జామున లేచి శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకోనున్నారు. ఈ నడకయాత్రకు బయలుదేరిన వారిలో కాంగ్రెస్ నాయకులు చీకటి రంగారావు, వినుకొండ కృష్ణ, ఐ.శ్రీను, గోదా విష్ణువర్ధనరావు, పర్వతనేని లక్ష్మణరావు, మోరంపూడి కార్తీక్, ద్రోణవల్లి గోపీ, మోరంపూడి జగన్మోహనరావు, చల్లగుళ్ల గోపాలకృష్ణ, తమ్మిన రవి, విసంపల్లి గాంధీ, షేక్ మునీర్, సాలి పవన్, టోపీ శ్రీను, రాజు, శ్రీను, పుసులూరి హనుమంతు, కొప్పుల నరేందర్ రెడ్డి, కొప్పుల ప్రవీణ్, కాంట్రాక్టర్ ప్రవీణ్ ఉన్నారు. వీరికి భోజన ఏర్పాట్లను కొప్పుల ప్రవీణ్ చూడగా, అల్పాహారాన్ని గుడిపూడి గాంధీ అందించారు.

తెలంగాణ చరిత్రలో సోనియమ్మ పేరు సువర్ణాక్షరాల్లో లిఖించదగింది

- ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-ఖమ్మం



ఖమ్మం

తెలంగాణ చరిత్రలో సోనియా గాంధీ పేరు సువర్ణక్షరాలలో లిఖించదగిందని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ళదుర్గా ప్రసాద్ తెలిపారు. శనివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవనంలో సోనియా గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు దుర్గా ప్రసాద్, నగర కాంగ్రెస్ అధ్యక్షులు జావేద్‌లు పార్టీ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేసి, సోనియా గాంధీ చిత్ర పటానికి పాలాభిషేకం చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటులో ఆమె చేసిన కృషి చిరస్థాయిగా నిలిచి పోతుందన్నారు. సోనియా గాంధీ నేతృత్వత్వంలో తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కాంగ్రెస్ హామీలో భాగంగా మహిళలకు ఉచిత ప్రయాణం హామీ ప్రారంభించినట్టు తెలిపారు. సోనియా గాంధీ ఆకాంక్షించిన తెలంగాణ మరి కొద్ది రోజుల్లోనే మారబోతోందన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు నాయకులు కలిసి శ్రీ సత్యసాయి వృద్ధాశ్రమంలో పండ్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ఖమ్మం నియోజకవర్గ సభ్యులు, జిల్లా ఓబిసి సెల్ అధ్యక్షులు పుచ్చకాయల వీరభద్రం, మాజీ జిల్లా రైతు బంధు కన్వీనర్ నల్లమల వెంకటేశ్వరరావు, జిల్లా మహిళా కాంగ్రెస్ కమిటి అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, రాష్ట్ర ఓబిసి సెల్ నాయకులు వడ్డెబోయిన నరసింహరావు, రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ దర్శి చెన్నారావు, నగర కాంగ్రెస్ కార్పొరేటర్లు మలీదు వెంకటేశ్వరరావు, పల్లెబోయిన భారతి చంద్రం, దుద్దుకూరి వెంకటేశ్వరరావు, లకావత్ సైదులు నాయక్, కమర్తపు మురళి, ఫాతిమా జోహరా ముక్తార్, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో...

సోనియా గాంధీ జన్మదిన వేడుకలను తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ కెవి.కృష్ణారావు ఆధ్వర్యంలో ఖమ్మంలోని అమరవీరుల స్థూపం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కెవి .కృష్ణారావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యమకారుల ఫోరమ్ కన్వీనర్ బచ్చుల పద్మాచారి, ఉద్యమకారులు గోపగాని శంభరావు, అర్వపల్లి విద్యాసాగర్, పాలకుర్తి కృష్ణ, భూక్యా రాంబాబునాయక్, దొడ్డా శ్రీనివాస్‌రెడ్డి, పెళ్ళూరి విజయకుమార్, ఆమరణ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తుమ్మల క్యాంపు కార్యాలయంలో....

నగరంలోని బైపాస్ రోడ్‌లోని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్యాంప్ కార్యాలయంలో ఏఐసీసీ మాజీ అధ్యక్షురాలు, కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియా గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియమ్మకు కృతజ్ఞతలు తెలుపుతూ కేక్ కటింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు జావిద్, రైతు సంఘం నాయకులు నల్లమల్ల వెంకటేశ్వరరావు, మేకల మల్లి బాబు, కమర్తపు మురళి, చావా నారాయణరావు, సైదు బాబు, దుద్దుకురి వెంకటేశ్వర్లు, మలీదు వెంకటేశ్వర్లు, ఎండీ.రఫీదా బేగం, వడ్డబోయిన నరసింహారావు, ముక్తార్, నల్లమల్ల ఆనంద్, కల్వకుంట్ల గోపాల్, బిక్షపతి రాథోడ్, అశ్రీఫ్ తదితరులు పాల్గొన్నారు.

కారేపల్లి : కాంగ్రెస్ పార్టీ అధినేత సోనియాగాంధీ జన్మదిన వేడుకను కారేపల్లి మండలంలో కాంగ్రెస్ శ్రేణులు శనివారం ఘనంగా నిర్వహించారు. కారేపల్లి, విశ్వనాథపల్లి, భాగ్యనగర్‌తండా, పోలంపల్లి గ్రామాల్లో నిర్వహించారు. సోనియా చిత్రపటాన్ని ఉంచి పటం ముందు కేక్ కట్ చేశారు. మిఠాయిలు పంపిణి చేసి సంబురాన్ని జరిపారు. ఈసందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షులు తలారి చంద్రప్రకాశ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఇమ్మడి తిరుపతిరావు, మల్లెలనాగేశ్వరరావు, సూరపురెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, గుగులోత్ భీముడు, దారావత్ భద్రునాయక్, పోలగాని శ్రీనివాస్, తోటకూరి రాంబాబు, వాంకుడోత్ గోపాల్, దమ్మాలపాటి రాంబాబు, మొగిలిచర్ల మల్లికార్జున్, సంగు నాగయ్య, తొగరు శ్రీను, పురం గోవర్ధన్, సోందు, గురుప్రసాద్, మైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తల్లాడ : కాంగ్రెస్ నాయకురాలు సోనియా గాంధీ 78వ జన్మదిన వేడుకలను తల్లాడ మండల కాంగ్రెస్ నాయకులు శనివారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేసి నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ నాయకులు కాపా సుధాకర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దగ్గుల రఘుపతిరెడ్డి, సర్పంచ్ పొట్టేటి సంధ్యారాణి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఎర్రుపాలెం : ఏఐసీసీ మాజీ అధ్యక్షురాలు, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయుకురాలు సోనియా గాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రమైన ఎర్రుపాలెం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల కమిటీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్ ఐలూరు వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీపీ దేవరకొండ శిరీష, పార్టీ మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, బం డారు నరసింహారావు, సొసైటీ అధ్యక్షులు వేమిరెడ్డి అక్కిరెడ్డి, కడియం శ్రీనివాసరావు, అనుమోలు వెంకటకృష్ణారావు, షేక్ ఇస్మాయిల్, మల్లెల లక్ష్మణరావు, గంట తిరుపతమ్మ, ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మధిర : తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సీఎం, మధిర శాసనసభ్యులు, మల్లు భట్టి విక్రమార్క ఆదేశానుసారం మండల కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో మధిర కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ప్రెసిడెంట్ ఆఫ్ ద ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ సోనియా గాంధీ పుట్టినరోజు వేడుకలను కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మధిర మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ రంగా హనుమంతరావు, దారా బాలరాజ్, పట్టణ అధ్యక్షుడు మిర్యాల వెంకటరమణ గుప్తా, చావ వేణు, పాటిబండ్ల సత్యబాబు, సర్పంచ్ సైదులు పురం చిట్టిబాబు, కర్లపూడి వాసు, చెరుకూరి నాగార్జున, కర్నాటి రామారావు, నిడమనూరు వంశీ, తదితరులు పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం : పాలేరు డివిజన్ నాయకులు చావా శివరామకృష్ణ ఆధ్వర్యంలో శనివారం కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ జన్మదిన వేడుకలు సందర్భంగా తిరుమలాయపాలెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు తాటికొండ కిరణ్ ఆధ్వర్యంలో సోనియా గాంధీ జన్మదిన వేడుకలను ఎంతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు తాటికొండ కిరణ్, జాల కిరణ్ గుగులోత్ వీరన్న కర్నాటి శ్రీను, సైపుద్దీన్, గుగ్గిళ్ళ అంబేద్కర్, సిరి గద్దె ఉపేందర్, పాలేరు నియోజకవర్గ యువజన నాయకులు దూదిమెట్ల వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

బోనకల్ : కాంగ్రెస్ సోనియా గాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌ను టిపిసిసి సభ్యులు పైడిపల్లి కిషోర్ కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాలి దుర్గారావు, కలకోట సొసైటీ అధ్యక్షులు కర్నాటి రామకోటేశ్వరరావు కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చేబ్రోలు వెంకటేశ్వరరావు, బుక్య సైదానాయక్, ములకారపు రవి, పల్లిపాటి తిరుపతరావు, గుగులోతు రమేష్, పారా వెంకట మోహన్ రావు, అమరేసి ప్రమీల, బండి వెంకటేశ్వర్లు, పాసంగుపాటి కోటేశ్వరరావు, ఇరుగు జానేసు తదితరులు పాల్గొన్నారు.


సత్తుపల్లి రూరల్ : సత్తుపల్లి మండలంలో మాజీ ఏఐసీసీ అధ్యక్షులరాలు, సీనియర్ కాంగ్రెస్ నాయుకురాలు సోనియా గాంధీ పుట్టినరోజు వేడుకల సంబురాలు శనివారం ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా మండల పరిధిలోని కాకర్లపల్లి గ్రామంలోని, దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై ఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద సోనియమ్మ పుట్టినరోజు వేడుకలు కాంగ్రెస్ శ్రేణులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చల్లూరి వెంకటేశ్వరరావు, పొదిలి మారేశ్వరరావు, బేతన్ని సత్యనారాయణ, సురిగం శివ, కిలారి కేసేవరావు, కాంగ్రెస్ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

వైరా : స్థానిక కాంగ్రెస్ కార్యాలయం నందు యూపీఏ మాజీ చైర్మెన్, మాజీ ఏఐసీసీ అధ్యక్షురాలు సోనియా గాంధీ జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీసీసీ కార్యదర్శి కట్ల రంగారావు, రాష్ట్ర మాజీ మార్క్ ఫెడ్ చైర్మెన్ బొర్రా రాజశేఖర్, వైరా మున్సిపాల్టీ చైర్మెన్ సూతకాని జయపాల్ కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కట్ల సంతోష్, మిట్టపల్లి నాగేశ్వరరావు, రేచర్ల నాగేశ్వరరావు, పణితి సైదులు, నంద్రు నాగరాజు, వెంపటి రంగారావు, సూర్యదేవర శ్రీధర్, గుడిమళ్ల రత్తయ్య, గుత్తికొండ వీరబాబు, తేజావత్ రామకృష్ణ, కర్నాటి హనుమంతరావు, ఐలూరు మోహన్‌రెడ్డి, రేచర్ల పుల్లయ్య, రేచర్ల సత్యం, తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు : కాంగ్రెస్ పార్టీ ఏఐసీసీ నాయకురాలు సోనియా గాంధీ జన్మదిన సందర్భంగా శనివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి ఘనంగా వేడుకలు నిర్వహించిన శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా సత్తుపల్లి శాసనసభ్యులు మట్టారాగమయ దయానంద్ ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏనుగు సత్యంబాబు, ఫోత్రూ సత్యం, లక్కినేని రమేష్ కొర్ర నరసింహం, కాకర్ల రంగారావు, ధారా రంగ, తురాబలి యాకుబ్ ఎస్కే ఉస్మాన్, ఆలకుంట నరసింహరావు, దామాల సురేష్ తోట సుబ్బారావు, మూకర విజయరావు, తదితరులు పాల్గొన్నారు.

కూసుమంచి : మండలంలోని జీళ్ళచెరువు గ్రామంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయ ఆవరణలో గ్రామ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో పెండ్ర అంజయ్య పర్యవేక్షణలో తెలంగాణ తల్లి సోనియాగాంధీ పుట్టినరోజు వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పీసీసీ సభ్యులు రాయల నాగేశ్వరరావు, మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి హాజరై కేక్ కట్ చేసి సోనియాగాంధీకి అభినందనలు తెలిపారు. అనంతరం వెంకటేశ్వర స్వామి ఆలయంలో 148మెట్లకు మొట్టుకో కొబ్బరికాయ చొప్పున కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. అంతకంటే ముందుగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినందుకు, పాలేరు నియోజకవర్గంలో పొంగులేటి శ్రీనివాసరెడ్డి భారీ మెజారిటీతో గెలిచినందుకు, మంత్రిగా బాధ్యతలు చేపట్టినందుకు హర్షం వ్యక్తం చేస్తూ శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయం ప్రత్యేకంగా పూజలు చేశారు. అర్చకులు, చైర్మెన్ ఘనంగా స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేశారు.

అనునిత్యం...జనపక్షం
నవతెలంగాణ
www.praja.khammam@gmail.com
భద్రాద్రి కొత్తగూడెం
ఆదివారం 10, డిసెంబర్ 2023



తెల్లం వెంకట్రావు ప్రమాణ స్వీకారం



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భద్రాచలం శాసనసభ్యుడిగా డాక్టర్ తెల్లం వెంకట్రావు అసెంబ్లీ ఆవరణలో శనివారం ప్రోటెమ్ స్పీకర్ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. గత నెల 30 తారీఖున జరిగిన సాధారణ ఎన్నికలలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ నుండి గెలిచిన ఏకైక ఎమ్మెల్యేగా డాక్టర్ తెల్లం వెంకట్రావు ప్రత్యేక గుర్తింపును పొందారు. ఎమ్మెల్యేలతో కలిసి అసెంబ్లీ ప్రాగణానికి వచ్చిన తెల్లం వెంకటరావు గులాబీ కండువా మెడలో ధరించి శాసనసభ్యుడిగా ప్రమాణం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక భద్రాచలం నియోజకవర్గ మూడవ శాసనసభ్యుడిగా ప్రమాణం చేసిన తెల్లం గతంలో బీఆర్ఎస్ పార్టీ భద్రాచలంపై చూపిన వివక్షతకు సమానంగా అభివృద్ధి చేసి చూపిస్తారా లేక ప్రతిపక్షంలో ఉన్నా కనుక నిధులు రాలేదు అన్న సాకుతో మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య బాటలోనే పయనిస్తారా అన్నది వేచి చూడాల్సి ఉంది. 2014 సంవత్సరంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సహకారంతో సీపీఐ(ఎం) ఎమ్మెల్యేగా సున్నం రాజయ్య గెలుపొందగా 2018లో సిపిఐ తెలుగుదేశం పార్టీల సహకారంతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వీరయ్య గెలిచిన విషయం తెలిసిందే.

రేపు ప్రజావాణి

నవతెలంగాణ-పాల్వంచ

ఈ నెల 11వ తేదీ సోమవారం ఉదయం 10:30 గంటలకు ఐడిఓసి కార్యాలయంలో జరగనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు సకాలంలో హాజరు కావాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా తెలిపారు. ప్రజలు వారి సమస్యపై లిఖితపూర్వకంగా దరఖాస్తును అందజేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.

ప్రమాదకరంగా సూరవరం అంగన్వాడీ భవనం



నవతెలంగాణ-దుమ్ముగూడెం

దుమ్ముగూడెం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని పర్ణశాల సెక్టార్‌లో గల సూరవరం అంగన్వాడీ భవనం ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. అంగన్వాడీ భవనం గోడ ఓవైపు పగుళ్లు పట్టి సొరంగంలా మారి కూలడానికి సిద్ధంగా ఉంది. దీంతో పాటు స్లాబు సైతం పలుచోట్ల పగుళ్లు బట్టి దర్శనమిస్తోంది. పగుళ్లబట్టిన గోడ సందులోంచి విషపురుగులు సైతంలోనికి వచ్చే అవకాశం ఉంది. పిల్లలు ఆదమరిచి ఉన్న సమయంలో గోడ కూలితే ప్రమాదం జరిగే అవకాశం లేకపోలేదనే చెప్పవచ్చు. చిన్నారుల పట్ల ముందస్తు జాగ్రత్తలు పాటించాల్సిన సెక్టార్ సూపర్వైజర్ మట్టితో గోడ రంధ్రాన్ని పూడ్చివేయాలని సూచన చేసినట్లు సమాచారం. ఇప్పటికైనా అంగన్వాడీ ఉన్నతాధికారులు స్పందించి పగిలిపోయిన గోడకు తాత్కాలిక మరమత్తులు నిర్వహించి ప్రమాదాలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మంత్రి సీతక్కను కలిసిన బూర్గుల

- విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయండి



నవతెలంగాణ-పాల్వంచ

ములుగు ఎమ్మెల్యే, మంత్రివర్యులు పంచాయతీరాజ్ రూలర్ డెవలప్మెంట్ మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనుసరి సీతక్కని హైదరాబాదులో మంత్రి నివాసంలో జాతీయ మాల విద్యుత్ ఉపకులాల అధ్యక్షుడు ఊర్ల విజయభాస్కర్ రావు కలిసి పుష్పగుచ్ఛాలతో శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపి విద్యుత్ ఉద్యోగులు పడుతున్న సమస్యలను వారికి వివరించారు. 9 సంవత్సరాల నుండి బ్యాక్లాగ్ పోస్టులు డిపెండెంట్ ఉద్యోగాలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేటీపీఎస్ఓఎన్ఎంని డిష్ మెటల్ చేసినందుకు కొంతమంది కార్మికులను ట్రాన్స్ఫర్ చేయడం జరిగింది. వారిని మళ్ల తిరిగి ఫిఫ్త్ అండ్ సిక్స్ సెవెన్ స్టేజీలు తీసుకువచ్చే విధంగా 9 సంవత్సరాల నుండి విద్యుత్ ఉద్యోగుల ఎటువంటి పోస్టింగులు లేవు కావున తమ తప్పనిసరిగా ఈ విషయాన్ని సంబంధించిన మంత్రివర్యులు దృష్టి తీసుకెళ్లమని చెప్పగా మీ మీ ఖమ్మం జిల్లా మధిర ఎమ్మెల్యే బట్టి విక్రమార్క ఇప్పుడు మీకు విద్యుత్ మంత్రివర్యులు కాబట్టి మీ విద్యుత్ సమస్యలన్నీ తప్పనిసరిగా పరిష్కారము జరుగుతని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు గడ్డం రమేష్ పాల్గొన్నారు.

చంద్రుగొండకు బస్సు సౌకర్యం కల్పించాలి

- సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొండపల్లి శ్రీధర్



నవతెలంగాణ- కొత్తగూడెం

చంద్రుగొండకు టీఎస్ ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొండపల్లి శ్రీధర్ కోరారు. శనివారం కొత్తగూడెం ఆర్టిసి డిపో మేనేజర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో చంద్రుగొండ మండలానికి గతంలో కానీ, నేడు బస్సు సౌకర్యం లేదని తెలిపారు. నిత్యం వందలాది మంది ప్రజలు వ్యవసాయ అవసరాలు, హాస్పటల్, బ్యాంకింగ్, ఇతర వ్యక్తిగత పనుల మీద నిత్యం వందలాది మంది ప్రజలు ఇతర ప్రాంతాలకు ప్రయాణం చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రయాణికుల అవసరాలను గుర్తించి ఆర్టీసీ, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఈ ప్రాంత ప్రజల కోసం బస్ సౌకర్యం కల్పించాలని పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం డిపో మేనేజర్‌కి వినతి పత్రం అందించారు. ప్రధానంగా ములకలపల్లి, అన్నపరెడ్డిపల్లి, చంద్రుగొండ, జూలూరుపాడు మీదుగా ఖమ్మం వెళ్లడానికి, కొత్తగూడెం, చంద్రుగొండ, జూలూరుపాడు, సుజాతనగర్ మీదుగా కొత్తగూడెంకు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చంద్రుగొండ మండల కమిటీ సభ్యులు రాయి రాజా, పార్టీ మండల నాయకులు ఎస్.కె నాగుల్ మీరా, జల్లిపల్లి రాము తదితరులు పాల్గొన్నారు.



108 దివ్య క్షేత్రాల జలాలతో సహస్ర కళశాభిషేకం

- ఘనంగా 108 దివ్య దేశాలనుండి తెచ్చిన కళశాలతో శోభయాత్ర
- ఇదంతా మా పూర్వజన్మ సుకృతం : డా.కృష్ణ చైతన్య స్వామి

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

శ్రీ నృసింహ సేవా వాహిని ఆధ్వర్యంలో నిర్మించిన గో-గోవింద కల్పవృక్ష నారసింహ సాల గ్రామ ప్రారంభోత్సవ వేడుకలలో భాగంగా శనివారం 108 దివ్య దేశాల నుండి సేకరించిన జలాలతో నారసింహునికి సహస్ర కళశాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు డా.కృష్ణ చైతన్య స్వామి మాట్లాడుతూ సుమారు 750 సంవత్సరాల క్రితం సాక్షాత్తు ఆ లక్ష్మీనరసింహుడే ప్రసాదించిన కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి కల్పవృక్ష నరసింహశాల గ్రామానికి సుమారు 32 రోజులపాటు 108 దివ్య దేశాలలో సేకరించిన జలాలతో అభిషేకం చేసి లోక క్షేమం కోసం మహాలక్ష్మి హెూమాన్ని, సుదర్శన హెూమాన్ని లక్ష్మీనారసింహ హెూమాన్ని నిర్వహించారు. ప్రతినిత్యం సుదూర ప్రాంతాల నుండి ఎంతోమంది సాధారణ ప్రజానీకంతో పాటు వీఐపీలు సైతం కల్ప వృక్ష నారసింహ సాలగ్రామ దర్శనార్థం ప్రతినిత్యం భద్రాచలం వస్తుంటారని అందరికీ అందుబాటులో ఉండి ప్రతి ఒక్కరూ దర్శించుకునే విధంగా కల్పవృక్షాన్ని కామదేనువుని ఒకే దగ్గర దర్శనం చేసుకునే విధంగా ఏర్పాట్లు చేసామని అందులో భాగంగానే శనివారం కల్ప వృక్ష నారసింహ దర్శనానికి వచ్చిన భక్తులకు నరసింహ సాలగ్రామ తీర్థంతో పాటు నరసింహ రక్షను కూడా అందజేసినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు డా.కృష్ణ చైతన్య స్వామి, వేదపండితులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

పాయం ప్రమాణ స్వీకారం



నవతెలంగాణ-మణుగూరు

పినపాక శాసనసభ్యులుగా పాయం వెంకటేశ్వర్లు శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. మూడోసారి చట్ట సభలకు ఎన్నికైనందుకు గాను అభిమానులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాయం వెంకటేశ్వర్లకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులుగా ప్రమాణ స్వీకారం చేసిన తుమ్మల నాగేశ్వరరావుని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. మాజీ శాసనసభ్యులు చందా లింగయ్య, టీసీపీ సభ్యులు చందా సంతోష్ బాబు, మాజీ జడ్పీటీసీ బట్ట విజయ్ గాంధీ, తోలెం నాగేశ్వరరావు, కొమెరం లక్ష్మణరావు, తాళ్లూరి చక్రవర్తి, ఆవుల సర్వేశ్వరరావు, బెల్లంకొండ వాసుదేవరావు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు మహాలక్ష్మి ఎంతో మేలు

- జెండా ఊపి ప్రారంభించిన కలెక్టర్



నవతెలంగాణ- కొత్తగూడెం

మహిళలకు మహాలక్ష్మి ఎంతో మేలు అని కలెక్టర్ ప్రియాంక అలా అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రారంభించిన మహాలక్ష్మి ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం కార్యక్రమాన్ని శనివారం మున్సిపల్ పరిధిలోని రామవరం మాతా, శిశు ఆరోగ్య కేంద్రం ఆవరణలో కలెక్టర్ ప్రయాణ బస్సుకి జెండా ఊపి ప్రారంభించారు. మహాలక్ష్మి టికెట్ ఆర్టీసీ అధికారులు కలెక్టర్‌కు అందచేశారు. అనంతరం కలెక్టర్ రామవరం నుండి మహిళా ప్రయాణికులు, మహిళలా అధికారులతో కలిసి కొత్తగూడెం బస్టాండ్ వరకు ప్రయాణించారు. కొత్తగూడెం బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం గురించి తెలిపారు. బస్సులోని మహిళలకు ఎలాంటి చార్జీలు లేకుండా జీరో రుసుముతో ప్రయాణ సౌకర్యం రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. నేటి నుండి విద్యార్థులు, మహిళలు, మహిళా ఉద్యోగులు, ట్రాన్స్ జండర్స్ పల్లె వెలుగు, ఎక్స్ ప్రెస్ సర్వీసులల్లో మన రాష్ట్రంలో ఎక్కడి నుండి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించడానికి అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు. ఉచిత రవాణాకు ఏదేని గుర్తింపు కార్డును ప్రయాణంలో ఆర్టీసీ సిబ్బందికి చూపించాలని చెప్పారు. ఉచిత రవాణా సౌకర్యం ప్రకటించడం పట్ల మహిళలు హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి అనుకూలంగా నినాదాలు చేశారు.

అనంతరం రాజీవ్ ఆరోగ్యశ్రీ, మహాలక్ష్మి పథకాల కర పత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాల్లో జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్ రావు, మున్సిపల్ చైర్మన్ కాపు సీతాలక్ష్మి, జిల్లా వైద్యాధికారి డాక్టర్ జేవిఎల్.శిరీష, సర్వజన ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ కుమారస్వామి, ఆర్టీసీ డివిఎం. భవాని ప్రసాద్, డి.ఎం.బాణాల వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు జమలయ్య, రూపా, మునిగడప పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రమాణ స్వీకారం

- నియోజవర్గ సమస్యలు అసెంబ్లీ దృష్టికి తెస్తా



నవతెలంగాణ-ఇల్లందు

ఇల్లందు నియోజకవర్గ నుండి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి అత్యధిక మెజార్టీతో గెలుపొందిన కోరం కనకయ్య శనివారం హైదరాబాదులోని శాసనసభ హాల్లో ప్రమాణస్వీకారం చేశారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో సైతం ఇదే నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తరఫున పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఈ సందర్భంగా నవతెలంగాణతో మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టు ద్వారా నియోజకవర్గానికి సాగు, తాగునీరు, రైలు పునరుద్ధరణ, పోడు భూములకు రావాల్సిన పట్టాలు, భూగర్భ గనుల వెలికితీత, బయ్యారం ఉక్కు పరిశ్రమ, యువతకు ఉపాధి కల్పన చిన్న తరహా పరిశ్రమ స్థాపనకు కృషి చేస్తానని అసెంబ్లీలో వాణి వినిపించి సమస్యల సాధనకు ప్రయత్నం చేస్తానని అన్నారు.

జిల్లా పరిషత్ చైర్మెన్‌గా కంచర్ల

- అధికారకంగా బాధ్యతలు స్వీకరణ
- పలువురి అభినందనలు



నవతెలంగాణ-కొత్తగూడెం

జిల్లా జడ్పీ చైర్మెన్‌గా కంచర్ల చంద్రశేఖర రావు శనివారం పదవి బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు జెడ్పీ చైర్మెన్‌గా కోరం కనకయ్య విధులు నిర్వహించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన ఇల్లందు నియోజకవర్గ నుండి పోటీ చేసి గెలుపొందిన విషయం పాఠకులకు విధితమే. ఈ నేపథ్యంలో ఆయన ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేశారు. అంతకు ముందే జడ్పీ చైర్మెన్ పదవికి రాజీనామా చేశారు. అనంతరం జడ్పీ వైస్ చైర్మన్‌గా ఉన్న కంచర్ల చంద్రశేఖర రావుకు జడ్పీ చైర్మెన్‌గా అధికారికంగా బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. బాధ్యతలు స్వీకరించిన కంచర్ల చంద్రశేఖర రావుకు జడ్పీ కార్యాలయ సీఈవో మెరుగు విద్యాలత, డిప్యూటీ సీఈఓ నాగలక్ష్మి, ఇతర అధికారులు, సిబ్బంది, ఇతర రాజకీయ పార్టీల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చైర్మన్ కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలాను ఐడిఓసి కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి బొకేను అందజేశారు.

మహాలక్ష్మితో నియోజక వర్గం ప్రజలకు పాక్షిక ప్రయోజనం

- గ్రామీణ మహిళలకు కలగని ప్రయోజనం
- సర్వీసులు విస్తరించాలని ప్రజలు వేడుకోలు



నవతెలంగాణ-అశ్వారావుపేట

అశ్వారావుపేట నియోజక వర్గంలో మహిళా లే అధికం అయినప్పటికీ ఈ మహాలక్ష్మి పథకంలో వీరికి పాక్షిక ప్రయోజనమే చేకూరనుంది. ఓటర్లు పరంగానూ మొత్తం 1,55,961 మంది ఉండగా ఇందులో 76,193 మంది పురుషులు, 79761 మంది స్త్రీలు, ఏడుగురు ఇతరులు ఓటర్లుగా ఉన్నారు. కానీ నియోజక వర్గం కేంద్రం అయిన అశ్వారావుపేట నుండి జిల్లా కేంద్రం అయిన కొత్తగూడెం ప్రయాణించాలి అంటే కొత్తగూడెం డిపో నుండి ఒకే బస్ ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం మూడు దఫాలు మాత్రమే అశ్వారావుపేట నుండి దమ్మపేట, ములకలపల్లి, పాల్వంచ మీదుగా కొత్తగూడెం సర్వీసు ఉంది. మిగతా సమయాల్లో జిల్లా కేంద్రం వెళ్ళాలన్నా, ఇతర ప్రాంతాలకు వెళ్ళాలన్నా ఖమ్మం జిల్లా, సత్తుపల్లి, బంజారా మీదుగా దూరాభారం భరించి ప్రయాణం చేయాల్సి వస్తుంది. నియోజక వర్గంలోని అశ్వారావుపేట, దమ్మపేట, ములకలపల్లి, అన్నపురెడ్డి పల్లి ఈ మండలాలు కలుపుతూ నాణ్యమైన జిల్లా రహదారులు ఉన్నప్పటికీ ఈ మండలాల మహిళలు ప్రయాణం చేయాలంటే బస్‌ల సర్వీసులు సరిపడ నన్ని లేకపోవడం కారణమే. మండలాలలోని మారుమూల ప్రాంతం గ్రామాలు నుండి నియోజక వర్గం కేంద్రం ప్రయాణించాలన్నా బస్‌లు లేకపోవడంతో ఆటోలను ఆశ్రయించాల్సిందే. అశ్వారావుపేట నుండి తెలంగాణాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం భద్రాచలంకు మహిళా భక్తులు వెళ్ళాలన్నా అశ్వారావుపేట మండలం కుడుములు పాడు నుండి బూర్గంపాడు వరకు సుమారు 50 కి.మీ మేర ఆంధ్ర భూభాగం నుండి ప్రయాణించాల్సి ఉంది. టీఎస్ ఆర్‌టీసీబస్ సర్వీసుల్లో తెలంగాణ మహిళలు ప్రయాణం చేస్తున్నప్పటికీ ఆంధ్రా భూభాగంలో టికెట్ తప్పని సరి చేసారు. దీంతో ఈ మహాలక్ష్మి పథకం ఈ నియోజక వర్గం మహిళలకు పూర్తి స్థాయిలో ప్రయోజనం పొందాలంటే నియోజక వర్గం కేంద్రం నుండి జిల్లా కేంద్రానికి సర్వీసులు పెంచాలి. మండలాలను కలుపుతూ పల్లె వెలుగు సర్వీసులు విస్తరించాలి. తెలంగాణ బస్‌లలో ఆంధ్రా భూభాగంలో టికెట్ కు మినహాయింపు ఇవ్వాలని మహిళా సంఘాలు నాయకురాళ్ళు, మహిళా ప్రజాప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం ప్రారంభం

- కిటకిటలాడిన బస్ స్టాండ్

నవతెలంగాణ-ఇల్లందు

ఆరు గ్యారెంటీల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యానికి నిర్దేశించిన మహాలక్ష్మి పథకాన్ని ప్రభుత్వ వైద్యురాలు డాక్టర్ మాధురి, ఇల్లందు డిపో ట్రాఫిక్ సీఐ బిఎస్ రాణితో కలిసి పచ్చ జెండా ఊపి శనివారం ప్రారంభించారు. అనంతరం డిపో మేనేజర్ బాణాల వెంకటేశ్వరరావు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో ఏ ఊరికి వెళ్లాల్సి వచ్చిన పల్లె వెలుగు, ఎక్ప్రెస్ బస్సుల్లో మహిళలు ప్రయాణించవచ్చని తెలిపారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కోసం జీరో చార్జీ టికెట్‌ను బస్సులోనే కండక్టర్ ఇస్తారని తెలిపారు. వారం రోజులపాటు మహిళలు ఉచితంగా ప్రయాణం చేయవచ్చని అనంతరం ఆధార్ కార్డు చూపిస్తే సరిపోతుందన్నారు.



కిటకిటలాడిన బస్ స్టాండ్

మహాలక్ష్మి పథకం ప్రారంభించిన తొలి రోజునే శనివారం మధ్యాహ్నం రెండు గంటల నుండి మహిళలు బస్టాండ్కు పెద్ద ఎత్తున చేరుకున్నారు. హనుమకొండ, మహబాద్, ఖమ్మం, గుండాల, కొత్తగూడెం తదితర ప్రాంతాలకు వెళ్ళటానికి బస్సులు రాగానే ఎక్కుతున్నారు. ఉచిత ప్రయాణం ప్రారంభించడంతో బస్టాండ్‌లో రద్దీ బాగా పెరిగింది.

ఉచిత ప్రయాణం ఊహించలేనిది



మహాలక్ష్మి పథకం ద్వార ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్టీసీలో రాష్ట్రమంతటా ఉచిత ప్రయాణం ఊహించలేనిదని ఇల్లందు ప్రయాణికురాలు జయంతి లోద్ అన్నారు. ఉచితంగా ఇల్లందు నుండి హనుమకొండకు ఉచితంగా ప్రయాణించడం సంతోషం కలిగించిందన్నారు. ఈ పథకం ముఖ్యంగా నిరుపేదలకు, పేదలకు, మధ్యతరగతి కుటుంబాలకు వరం లాంటిదన్నారు. గిరిజనులకు అన్ని వర్గాల వారికి ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

- ప్రయాణికురాలు జయంతి లోద్ ఇల్లందు

తెలంగాణా ప్రజల ఆరాధ్య దైవం సోనియమ్మ

- డీసీఎంఎస్ వైస్ చైర్మెన్ కొత్వాల



నవతెలంగాణ-పాల్వంచ

ప్రత్యేక తెలంగాణా ఇచ్చిన సోనియా గాంధీ రాష్ట్ర ప్రజల ఆరాధ్య దైవం అని డీసీఎంఎస్ వైస్ చైర్మన్, కాంగ్రెస్ నాయకులు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. అఖిల భారత కాంగ్రెస్ పార్టీ నేత సోనియా గాంధీ జన్మదిన వేడుకలను పాల్వంచ లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శనివారం పాల్వంచలో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంప్ కార్యాలయంలోలి సోనియా గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి సభ్యులు, కాంగ్రెస్ నాయకులు యర్రంశెట్టి ముత్తయ్య, నూకల రంగారావు, భద్ది కిషోర్, కొండెం వెంకన్న, చీకటి కార్తీక్, కందుకూరి రాము, పిట్టల రాము, బట్టు మురళి, మధు, బాధర్ల జోషి, సందుపట్ల శ్రీనివాస రెడ్డి, ధార చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన లక్ష్మణ్



నవతెలంగాణ-పినపాక

సామాజిక కార్యకర్త ఉన్నత విద్యావంతుడు బోడ లక్ష్మణ్ రావు సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా శనివారం కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. పినపాక మండలం ఈ బయ్యారం క్రాస్ రోడ్‌లో గల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు గొడిశాల రామనాథం పార్టీ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం కాంగ్రెస్ మండల అధ్యక్షులు రామనాదం మాట్లాడుతూ యువత రాజకీయాల్లోకి రావడం శుభ పరిణామం అన్నారు. రిపోర్టర్‌గా అనేక సేవలందించిన బోడ లక్ష్మణ్ పార్టీలోకి రావడం సంతోషకర విషయం అని కొనియాడారు. పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని సామాజిక కార్యకర్త లక్ష్మణరావు తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో నచ్చి, దళిత బహుజన అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని కాంగ్రెస్ పార్టీలో చేరినట్లుగా తెలియజేశారు.

లైంగిక వేదింపుల నిరోధక చట్టం పై అవగాహన పెంచుకోవాలి

- జనరల్ మేనేజర్ రామచందర్



నవతెలంగాణ-మణుగూరు

మహిళా ఉద్యోగులు లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై అవగాహన పెంచుకోవాలని ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ అన్నారు. శనివారం మణుగూరు ఏరియాలోనిలోని టీఎం కార్యాలయంలో నిర్వహించబడిన "సెక్సువల్ హరాస్మెంట్ ఆఫ్ ఉమెన్ ఎట్ వర్క్ ప్లేస్ ఆక్ట్ 2013, పని ప్రదేశంలో లైంగిక వేధింపుల నివారణ-2023 అవగాహన కార్యక్రమంలో ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ అధిక సంఖ్యలో పాల్గొన్న జీఎం కార్యాలయ మహిళా ఉద్యోగులను ఉద్దేశించి ప్రసంగిస్తూ అనాధిగా స్త్రీ జాతిని గౌరవించడం మన సంస్కృతిలో కొనసాగుతుందన్నారు. తల్లిగా, చెల్లిగా, భార్యగా జీవితాంతం అమూల్యమైన ప్రేమాభిమానాలు పంచుతూ మగాడి జీవితానికి పరిపూర్ణతచేకూర్చే నేటి మహిళా వేధింపులకు గురి కావడం, గర్హనీయం, స్త్రీమూర్తికి సముచిత స్థానం, సమాన గౌరవం, సరియైన రక్షణ కల్పించవలసిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉంది.

ఆ దృష్టి కోణంలో ఆలోచించి పని ప్రదేశాలలో మహిళల పై లైంగికి వేధింపుల నివారణకు గాను 2013 సంవత్సరంలో ఉద్యోగ మహిళల పై లైంగిక నిరోధక చట్టాన్ని మన దేశ చట్ట సభల్లో ఆమోదించి అమల్లోకి తేవడం జరిగిందన్నారు. మన సింగరేణిలో కూడా అధిక సంఖ్యలో మహిళా ఉద్యోగినులు పని చేస్తున్నారని, కాబట్టి ఏదేన్ని సందర్భంలో ఎవరి చేతనైన వేధింపులకు గురి అయితే లోలోన కుమిలిపోకుండా ఆత్మ స్థైర్యంతో ఆత్మాభిమానంతో స్వీయ రక్షణ పొందేందుకు గాను "సెక్సువల్ హరాస్మెంట్ ఆఫ్ ఉమెన్ ఎట్ వర్క్ ప్లేస్ ఆక్ట్ 2013, పని ప్రదేశంలో లైంగిక వేధింపుల నివారణ-2023 మన సంస్థలో పటిష్టంగా అమలు పరుస్తూ ఇందులో భాగంగా ఒక ఇంటర్నల్ కమిటీనికూడా ఏర్పాటు చేయడమైనదన్నారు. కావునా మన సింగరేణి మహిళా ఉద్యోగులు లైంగిక వేధింపుల నివారణ చట్టాన్ని పూర్తి స్థాయిలో అవగాహన తెచ్చుకోవాలన్నారు. అలాగే పని ప్రదేశాలలో లైంగిక వేధింపులకు గురైనట్టయితే సంబంధిత ఇంటర్నల్ కమిటీ మెంటర్లకి ఫిర్యాదు చేయవచ్చన్నారు. లైంగిక వేధింపుల సమస్యల పరిష్కారానికి ఈ కమిటీ అన్నీ వేళల అందుబాటులో ఉంటుందని జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ మహిళా ఉద్యోగులకు తెలియజేశారు. మొట్టమొదటి సారిగా మణుగూరు ఏరియాలో "సెక్సువల్ హరాస్మెంట్ ఆఫ్ ఉమెన్ ఎట్ వర్క్ ప్లేస్ అక్ట్ 2013, పని ప్రదేశంలో లైంగిక వేధింపుల నివారణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం పట్ల మహిళా ఉద్యోగులు సింగరేణి యాజమాన్యానికి, జనరల్ మేనేజర్‌కి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జిఎం శ్రీ వీసం కృష్ణయ్య, డిజిఎం (పర్సనల్) ఎస్.రమేష్, సీనియర్ పర్సనల్ అధికారులు సింగు శ్రీనివాస్, రామేశ్వర రావు, ఇంటర్నల్ కమిటీ సభ్యులు డివై, సిఎంఓ మేరీ కుమారి, డిజిఎం (ఫైనాన్స్) అనురాధ, సీనియర్ అకౌంట్స్ అధికారిని సంధ్య రాణి, డిప్యూటీ సూపరింటెండెంట్ శైలజ, జి.ఎం కార్యాలయ మహిళా ఉద్యోగినీలు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పట్ల హర్షం

- కాంగ్రెస్ నాయకురాలు గొంది రాదా, వరలక్ష్మి



నవతెలంగాణ-పినపాక

తెలంగాణ వ్యాప్తంగా మహిళలకు ఆర్టీసి బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం నేటి నుంచి అమలు చేస్తుందని కాంగ్రెస్ నాయకురాలు గొంది రాధ, మర్ల వరలక్ష్మి అన్నారు. మహాలక్ష్మి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణాన్ని ఆర్టీసీ అధికారులతో కలిసి శనివారం ఈ బయ్యారం క్రాస్ రోడ్‌లో ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని బస్సుల్లో పల్లెవెలుగు, ఎక్స్ ప్రెస్, నగరాల్లో సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్ ప్రెస్ సర్వీసుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం వర్తిస్తుందని తెలిపారు. మహిళలతో పాటు బాలికలు, విద్యార్థినులు, ట్రాన్స్‌జెండర్‌లకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే అవకాశం కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం కల్పించిందన్నారు. మేనిఫెస్టోలో పెట్టిన ప్రతి హామీని వంద రోజుల్లో గానే అమలు చేస్తామని తెలియజేశారు.





ధ్వంసమైన రహదారులను పరిశీలించి ఏఈఈ

- నవతెలంగాణ కథనానికి స్పందన
- మరమత్తులు చేపట్టిన ఐటీడీఏ ఇంజనీరింగ్ అధికారులు

నవతెలంగాణ-అశ్వారావుపేట

ధ్వంసమైన రహదారులు, పొంచి ఉన్న ప్రమాదం శీర్షికన శనివారం నవతెలంగాణ ప్రచురితం అయిన కథనానికి స్పందన లభించింది. ఉదయాన్నే కథనం చదివిన ఐటీడీఏ ఏఈఈ ప్రసాద్ హుటాహుటిన నారంవారిగూడెం సందర్శించి రహదారులను పరిశీలించారు. మధ్యాహ్నం నుండి ప్రోక్లెనర్‌తో ధ్వంసం అయిన రహదారులకు ఇరు వైపుల మట్టి నింపి ప్రమాదాలు నివారణకు తాత్కాలిక చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ప్రమాదాలు నివారణకు తాత్కాలిక చర్యలు చేపట్టామని, నిధులు మంజూరు అయిన వెంటనే కాంక్రీట్ పనులు చేపడతామని తెలిపారు.

అనుదినం..జనస్వరం
www.praja.khammam@gmail.com

నవతెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
ఆదివారం 10 డిసెంబర్ 2023
8

తుఫాను వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో రైతుల ప్రదర్శన, తహసీల్దార్‌కు వినతి



నవతెలంగాణ-ఇల్లందు

మండల పరిధిలో మీచాంగ్ తుఫాను వలన నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, తడిసిన ధాన్యాన్ని ఎటువంటి షరతులు లేకుండా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, కౌలుదారులకి నష్ట పరిహారం చెల్లించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఆవునూరి మధు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాడైన మిర్చి మొక్కలతో న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో రైతులు శనివారం ప్రదర్శన నిర్వహించి, తహసీల్దార్ కార్యాలయంలో రైతుల వ్యక్తిగత దరఖాస్తులతో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నష్టపోయిన పత్తి, మిర్చి, వరి, మొక్కజొన్న కూరగాయల పంటలను యుద్ధ ప్రాతిపదిక మీద లిసర్వే చేసి పంట నష్టపోయిన రైతుకు ఎకరాకు వరి, మొక్కజొన్నకు రూ.25000, పత్తికి రూ.30,000, మిర్చికి రూ.50,000, కూరగాయలకు ఏకరాకు రూ.10,000 నష్టపరిహారం చెల్లించాలని నూతన ప్రభుత్వాన్ని అధికారులను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఇల్లందు డివిజన్ కార్యదర్శి తుపాకుల నాగేశ్వరరావు, జిల్లా నాయకులు ఎం.యాకన్న, చింతా ఉదయ్, నాగేశ్వరరావు, నరసింహారావు, సర్పంచులు సరోజినీ, రజిత, శ్రీను, కృష్ణ, ఎంపీటీసీ ఈసాల పాపక్క తదితరులు పాల్గొన్నారు.

వర్షాలకు దెబ్బతిన్న పంటల పరిశీలన

నవతెలంగాణ-పినపాక

తుఫాన్ ప్రభావంతో మండలంలో దెబ్బతిన్న వరి మిరప, పత్తి పంటలను పినపాక మండల వ్యవసాయ అధికారులు పరిశీలించారు. శనివారం పొట్లపల్లి గ్రామంలో స్థానిక సర్పంచ్ తోలెం కళ్యాణి క్షేత్రస్థాయిలో దెబ్బతిన్న పంటలను రైతుల ఇబ్బందులను వ్యవసాయ అధికారులకు చూపించి వివరించారు. గత ప్రభుత్వం రైతులకు పంట బీమా చేయించామని చెప్పిందని, ఆయా పంట బీమా అర్హత ఉన్న రైతులకు అధికారులు సంబంధిత భీమా కంపెనీ నుంచి పరిహారం ఇప్పించాలని మిగతా రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని సూచించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కళ్యాణి మాట్లాడుతూ మండల వ్యాప్తంగా తుఫాన్ కారణంగా దెబ్బతిన్న పంటలను పరిశీలించి రైతుల వివరాలు సేకరించి పరిహార నిమిత్తం ప్రభుత్వానికి సిఫారసు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఈఓ రమేష్, స్థానిక రైతుల కృష్ణ, శేరు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మహాలక్ష్మి పథకం మహిళలకు వరం

- డీసీఎంఎస్ వైస్ చైర్మెన్ కొత్వాల

నవతెలంగాణ-పాల్వంచ

ఎన్నికల వాగ్దానంలో భాగంగా కాంగ్రెస్ ఆరు గ్యారంటీలో మహాలక్ష్మి పథకం మహిళలకు వరమనీ జిల్లా కోపరేటివ్ సొసైటీ చైర్మెన్, కాంగ్రెస్ నాయకులు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. శనివారం పాల్వంచ బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన మహిళలకు ఉచిత రవాణా సౌకర్యం కార్యక్రమంలో కొత్వాలతో పాటు మాజీ జెడ్పిటిసి సభ్యులు యర్రంశెట్టి ముత్తయ్య కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ అఖిల భారత కాంగ్రెస్ నేత సోనియా గాంధీ జన్మదిన కానుకగా మహాలక్ష్మి పథకాన్ని కాంగ్రెస్ రూపొందించిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి సభ్యులు, కాంగ్రెస్ నాయకులు యర్రంశెట్టి ముత్తయ్య, పిట్టల రాము, బాదర్ల జోషి, చీకటి కార్తీక్, కందుకూరి రాము, గంధం సతీష్, అజ్మీరా రమేష్, ధర్మసోత్ ఉపేంద్ర నాయక్, శాంతివర్ధన్, స్వాతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

- డీసీసీబీ డైరెక్టర్ బ్రహ్మయ్య

నవతెలంగాణ-మణుగూరు

తెలంగాణ వ్యాప్తంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం రెండో రోజు నుంచే అమలు చేస్తుందని డిసిసిబి డైరెక్టర్ తుళ్లూరు బ్రహ్మయ్య అన్నారు. మణుగూరు డిపో వద్ద మహాలక్ష్మి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణాన్ని ఆర్టీసీ అధికారులతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని బస్సుల్లో పల్లెవెలుగు, ఎక్స్ ప్రెస్, నగరాల్లో సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్ ప్రెస్ సర్వీసుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం వర్తిస్తుందని తెలిపారు. మహిళలతో పాటు బాలికలు, విద్యార్థినులు, ట్రాన్స్‌జెండర్‌లకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే అవకాశం కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం కల్పించిందన్నారు. మ్యానిఫెస్టోలో పెట్టిన ప్రతి హామీని వంద రోజుల్లో గానే అమలు చేస్తామని తెలియజేశారు.

చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

నవతెలంగాణ-మణుగూరు

చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాదిగ జేఏసీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి సిద్దల తిరుమల రావు పిలుపునిచ్చారు. శనివారం మాదిగ జేఏసీ సమావేశంలో సిద్దెల మాట్లాడుతూ ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి చట్ట బద్దత కల్పించాలనే ప్రధాన డిమాండ్‌తో ఎస్సీ కార్పొరేషన్ తొలి చైర్మెన్ పిడమర్తి రవి ఆధ్వర్యంలో ఈ నెల 18, 19 తేదీలలో చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. కావున దయచేసి వర్గీకరణ చేయకుండా మాదిగలను మోసం చేస్తున్న బిజెపి ప్రభుత్వాన్ని ఢిల్లి గడ్డ మీద నిలదీయడానికి నిర్వహిస్తున్న చలో ఢిల్లీ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రంలోని ఉద్యోగస్తులు, నాయకులు, యువకులు, విద్యార్థులు ఇసంపల్లి కృష్ణ, కొప్పుల శ్రీను, కళ్యాణ్, పంతం నాగరాజు, కాళ్ల చంటి, ములకలపల్లి విష్ణు, వడ్డలి మల్లేష్, నరేష్ తదితరులు పాల్గొని విజయవంతం చేయగలరని పిలుపునిచ్చారు.

భగవద్గీత కంఠస్థ పోటీల్లో త్రివేణి విద్యా సంస్థల విద్యార్థులకు ద్వితీయ బహుమతి

నవతెలంగాణ-లక్ష్మీదేవి పల్లి

మండలంలోని స్థానిక త్రివేణి పాఠశాలలో చదువుతున్న విద్యార్థి ఎన్ఎస్‌వివిఎన్ సాయి మణికంఠ గీతజయంతి సందర్భంగా వివేకానంద విద్యాలయం వేదికగా విశ్వహిందూ పరిషత్ వారు నిర్వహించిన భగవద్గీత కంఠస్థ పోటీల్లో ద్వితీయ స్థానాన్ని సాధించి, జిల్లా స్థాయికి ఎంపిక కావడం హర్షణీయం అని త్రివేణి పాఠశాల డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి అభినందించారు. ఈ కార్యక్రమంలో గొల్లపూడి జగదీష్, సీఆర్ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ సింగ్, వై.సురేష్, వైస్ ప్రిన్సిపల్ సౌజన్య పాల్గొన్నారు.

మహాలక్ష్మి పథకం...కోలాహలంగా బస్టాండ్

నవతెలంగాణ-కొత్తగూడెం

రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీలలో భాగంగా శనివారం ప్రారంభించిన మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం మహాలక్ష్మి పథకాన్ని కొత్తగూడెం బస్సు డిపో ఆధ్వర్యంలో కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా ప్రారంభించారు. ప్రారంభ కార్యక్రమం బస్సు స్టాండ్‌లో ప్రయాణికులతో కిక్కిరిసి పోయింది. మహిళలు పెద్ద ఎత్తున ప్రయాణాలకు వెళ్లేందుకు బస్టాండ్‌కు చేరుకున్నారు. కొంతమంది ఈ పథకం గురించి అవగాహన లేక ముందస్తుగానే రిజర్వేషన్లు చేయించుకొని నిరుత్సాహానికి గురయ్యారు. మొత్తంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం పథకం పట్ల మహిళల నుండి పెద్ద ఎత్తున హర్షం వ్యక్తం అవుతుంది.

చాలా సంతోషంగా ఉంది : ప్రయాణికురాలు రాజేశ్వరి కరీంనగర్

కొత్తగూడెం వచ్చేటప్పుడు టికెట్ తీసుకుని కరీంనగర్ నుండి వచ్చాము. ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం ఆనందంగా ఉన్నది. చాలా సంతోషంగా వెళుతున్నాము.



కొత్తగూడెం నియోజకవర్గం నుంచి ప్రజా సంఘాలు బలపరిచిన సీపీఐ ఎమ్మెల్యే అభ్యర్థిగా గెలిచిన కూనంనేని సాంభశివరావు శనివారం హైదరాబాదులోని శాసనసభ హాల్లో ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయనకి పలువురు శుభాకాంక్షలు తెలిపారు.



రాజీవ్ ఆరోగ్యశ్రీ పేద ప్రజలకు ఎంతో మేలు

- మాత శిశు ఆరోగ్య కేంద్రంలో ప్రారంభించిన కలెక్టర్

నవతెలంగాణ-కొత్తగూడెం

రాజీవ్ ఆరోగ్య శ్రీ వైద్య సాయం రూ.10 లక్షలకు పెంచడం వల్ల పేదలందరికి ఉచితంగా కార్పోరేట్ వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా తెలిపారు. శనివారం కొత్తగూడెం మున్సిపల్ పరిధిలోని రామవరం మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో రాజీవ్ ఆరోగ్యశ్రీ వైద్య సాయం రూ.10 లక్షలకు పెంపు, రాష్ట్రంలోని మహిళలకు ఉచిత ప్రయాణ మహాలక్ష్మి పథకాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుండి రూ.10 లక్షలకు పెంచినట్లు చెప్పారు. శనివారం నుండి అమల్లోకి వస్తుందని చెప్పారు. ఈ పథకం అమలు వల్ల నిరుపేద వర్గాల ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందుబాటులోకి వచ్చినట్లు చెప్పారు. మన జిల్లాలో 9 ప్రభుత్వ, 4 ప్రైవేట్ ఆసుపత్రుల్లో రాజీవ్ ఆరోగ్యశ్రీ సేవలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకానికి జిల్లాలో 2,93,806 మంది అర్హులున్నారని చెప్పారు. రూ.5 లక్షల నుండి రూ.10 లక్షలకు పెంచడం వల్ల లబ్ధిదారులకు ఆరోగ్య పరంగా చాలా ఉపయోగకరమవుతుందని చెప్పారు. జిల్లాలో 5 ప్రభుత్వ ఆస్పత్రుల్లో డయాలసిస్ సేవలు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు.

కలెక్టర్‌ను కలిసిన జడ్పీ చైర్మెన్ కంచర్ల

నవతెలంగాణ-పాల్వంచ



జడ్పీ చైర్మెన్‌గా కంచర్ల చంద్రశేఖర రావు శనివారం పదవి బాధ్యతల చేపట్టిన సందర్భంగా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలను ఐడిఓసి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి బొకేను అందజేశారు. జడ్పి చైర్మన్ పదవి బాధ్యతలు చేపట్టిన చంద్రశేఖర్ రావును జడ్పి సీఈఓ విద్యాలత, డిప్యూటీ సీఈఓ నాగలక్ష్మి తదితరులు అభినందించారు.



సీఐటీయూను గెలిపించండి...

సింగరేణి కార్మికుల సొంతింటి కలను నెరవేరుస్తాం

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మందా

నవతెలంగాణ-మణుగూరు

సింగరేణి కార్మికులకు సొంత ఇంటి కల నెరవేరాలంటే సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఉదయించే సూర్యుడు గుర్తుపై ఓటు వేసి సీఐటీయూ సంఘాన్ని గెలిపించాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మందా నరసింహారావు విజ్ఞప్తి చేశారు. శనివారం గుర్తింపు సంఘం ఎన్నికల ప్రచారంలో భాగంగా మణుగూరులో ఓసి 2లో ఫిట్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడుతూ 250 గజాల స్థలం ఇంటి నిర్మాణానికి రూ.30 లక్షల వడ్డీ లేని రుణాన్ని ఇప్పిస్తామని కార్మికులకు వాగ్దానం చేశారు. కార్మికుల సొంత ఇంటి కలను నెరవేర్చడం కోసం సిఐటియు పోరాటాలు చేసిందని సింగరేణి యాజమాన్యం కానీ రాష్ట్ర ప్రభుత్వం గానీ గుర్తింపులో ఉన్న సంఘం గాని ఈ సమస్యను పట్టించుకోలేదని విమర్శించారు. సిఐటియు సంఘానికి ఒకసారి అవకాశం కల్పించి గుర్తింపు యూనియన్‌గా గెలిపిస్తే కార్మికుల సమస్యలను పరిష్కారం చేస్తామని తెలిపారు. పెరిక్స్ మీద ఇన్కమ్ టాక్స్ రియంబర్స్మెంట్ ఇప్పిస్తామని దీనివల్ల ప్రతి కార్మికుడికీ రూ.30 వేల నుండి 60 వేల వరకు లబ్ది చేకూరుతుందని మందా పేర్కొన్నారు. కోల్ ఇండియాలో జరిగిన ఒప్పందాలన్నింటిని సింగరేణిలో అమలు జరగాలంటే సిఐటియును గెలిపించాలని కార్మికులను కోరారు. కోలిండియా క్యాడర్ స్కీములను సింగరేణిలో అమలు చేస్తామని పేర్కొన్నారు. సింగరేణి సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం నుండి రావలసిన 29 వేల కోట్ల రూపాయల డబ్బును రాబట్టుతామని ఆ డబ్బును సింగరేణి సంస్థ అభివృద్ధి కోసం కార్మికుల సంక్షేమం కోసం ఖర్చు చేసే విధంగా సిఐటియు కృషి చేస్తుందని పేర్కొన్నారు. బోనస్ పై వడ్డీ రేటు పెంచి డబ్బులు ఇప్పిచ్చిన ఘనత సిఐటియుకు మాత్రమే ఉందని, దీనివల్ల సింగరేణి కార్మికులు అధికారులు పెద్ద మొత్తంలో ఆర్థికంగా లబ్ది పొందారని పేర్కొన్నారు. సింగరేణి సంస్థలు అవినీతి రాజ్యమేలుతుందని, యాజమాన్యం ప్రభుత్వం ప్రైవేటు కాంట్రాక్టర్లు కుమ్మక్కై, అనేక విభాగాలలో వందల కోట్ల రూపాయల అవినీతికి పాల్పడుతున్నారని సిఐటియు పేర్కొన్నది. జైపూర్‌లో ఇసుక కుంభకోణం శ్రీరాంపూర్‌లో డీజిల్ కుంభకోణం, గోదావరిఖనిలో బొగ్గు కుంభకోణం, సత్తుపల్లిలో గ్రేడ్ కుంభకోణం, కోయగూడెంలో లీడ్ కుంభకోణం, ఏఎల్‌పిలో మిషనరీ కొనుగోలులో జరిగిన కుంభకోణం ఇలా సింగరేణి సమస్త మొత్తం కుంభకోణాల మయంగా మారుతుందని సిఐటియును గుర్తింపు యూనియన్‌గా గెలిపిస్తే సింగరేణి సంస్థలో జరుగుతున్న అవినీతిపై సమగ్రమైన న్యాయ విచారణ జరిపిస్తామని అన్నారు. దోషులను శిక్షించడంతోపాటు అవినీతికి గురైన సొమ్ము మొత్తాన్ని రికవరీ చేయిస్తామని పేర్కొన్నారు. మణుగూరులో ఓసి ఫోర్ బొగ్గు నిల్వలు లేవని పనులు నిలిపివేయడానికి సింగరేణి యాజమాన్యం కుట్రపూరితమైన నిర్ణయాలు చేస్తే సిఐటియు పోరాడి ఆ నిర్ణయాన్ని అమలుకాకుండా చేసిందని ఫలితంగా మూడు లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి ఓసి ఫోర్‌లో జరిగిందని గుర్తు చేశారు. ఇప్పటివరకు అనేక సంఘాలను గుర్తింపు యూనియన్‌గా గెలిపించిన కార్మికులు సిఐటియుకి ఒక అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సిఐటియును గెలిపిస్తే నీతివంతమైన పారదర్శకమైన పాలన అందిస్తామని కార్మికులకు తెలియజేశారు. సింగరేణి సంస్థ పరిరక్షణ కార్మిక హక్కుల రక్షణ కోసం సిఐటియు గెలవాలి, సింగరేణిలో మార్పు రావాలి అని మంద నరసింహారావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి బి.మధు, సిఐటియు జిల్లా అధ్యక్షులు కే.బ్రహ్మాచారి, జిల్లా ఉపాధ్యక్షులు గద్దల శ్రీనివాస్, సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ మణుగూరు బ్రాంచ్ అధ్యక్ష కార్యదర్శులు ప్రసాద్, వెంకటరత్నం, బ్రాంచ్ నాయకులు ఈశ్వరరావు టి.లక్ష్మణరావు, ఎం.లక్ష్మణ్ రావు, సిఐటియు మండల కన్వీనర్ నరసింహారావు, సింగరేణి కాలరీ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు శ్రీకాంత్ తదితర నాయకులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే పాయంకి కాంట్రాక్ట్ కార్మికులు అభినందనలు

నవతెలంగాణ-మణుగూరు



తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పినపాక శాసనసభ సభ్యులు ఐఎఫ్‌టీయూ కాంట్రాక్ట్ కార్మికుల సంఘం తరఫున అభినందనలు తెలుపుతున్నామని మణుగూరు ఏరియా కాంట్రాక్ట్ కార్మికుల అధ్యక్షులు ఏ.మంగీలాల్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన ఎనుముల రేవంత్ రెడ్డికి భారత కార్మిక సంఘాల సమాఖ్య అభినందనలు తెలియజేస్తుందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల విషయంలో నిరంకుశంగా వ్యవహరించిందని మీకు తెలియజేస్తూ కాంగ్రెస్ హయాంలోనైనా తెలంగాణ ప్రజా ప్రభుత్వం కార్మికుల సమస్యలు సత్వర పరిష్కారానికి తగిన ప్రాధాన్యత నిచ్చి పరిష్కరిస్తుందని, ఐఎఫ్‌టియు ఆశాభావాన్ని వ్యక్తం చేస్తుంది. కాంగ్రెస్ పార్టీ తన అభయహస్తం మేనిఫెస్టివల్లో ప్రకటించిన కార్మికుల సమస్యలతో వివిధ కార్మిక సంఘాలు ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చే సమస్యలను సత్వరం పరిష్కరించాలని అన్నారు. రాష్ట్రంలో ప్రధానంగా 73 షెడ్యూల్ ఎంప్లాయిమెంట్స్ జీవోలను సవరించడం 5 జీవోలకు గెజిట్ జారీ చేయడం, కనీస వేతనం 26 వేలు, అమలు కార్మికుల పట్ల న్యాయస్థానాల తీర్పును అమలు, సమాన పనికి సమాన వేతనం అమలు, ధరల నియంత్రణ, ఉద్యోగ భద్రత, కార్మిక కుటుంబాలకు మెరుగైన వైద్య సదుపాయం అమలు సింగరేణి లాభాల్లో పర్మినెంట్ ఉద్యోగులకు వాటాగా బోనస్ చెల్లిస్తున్నట్లుగానే, కాంట్రాక్ట్ కార్మికులకు కూడా చెల్లించడం సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై సకాలంలో ఒక నిర్దిష్ట నిర్ణయాన్ని తీసుకొని కార్మికుల సమస్యలు పరిష్కార దిశగా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగాలని కోరారు.

ఈ కార్యక్రమంలో సింగరేణి కాంటాక్ట్ కార్మికులు కే.రవికుమార్, కే.గురుమూర్తి, వి.శంకర్ నాయక్, జి.నాగేశ్వరరావు, కే.నాగేశ్వరరావు, టి.రామకృష్ణ, ఎం.బైసన్, ఐ.గోపి, జి.సాయికుమార్, యు.శివరామకృష్ణ పాల్గొన్నారు.

కేటీఆర్‌ని కలిసిన మెచ్చా

నవతెలంగాణ-దమ్మపేట



బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు శుక్రవారం తుంటి ఎముక మార్పిడి శస్త్ర చికిత్స చేశారు. శనివారం హైదరాబాద్‌లోని యశోద హాస్పిటల్‌లో అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ని కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్‌ను మాజీ సీఎం కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి పై వివరాలడిగి త్వరగా కోలుకోవాలని ప్రజా క్షేత్రంలో కెసిఆర్ తిరిగి ప్రజల కోసం ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడం కోసం నడయాడాలని ఆశాభావం వ్యక్తం చేశారు. దీనికి కేటీఆర్ స్పందిస్తూ ఈ ఆకాంక్ష అతి కొద్ది రోజుల్లోనే నెరవేరుతుందని కేటీఆర్ తెలిపినట్లు మెచ్చా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మెచ్చా వెంట హరికృష్ణ, దొడ్డ మల్లికార్జున్ ఉన్నారు.

మహిళలు చైతన్యవంతులు కావాలి

- హింస వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సెమినార్

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భద్రాచలం మహిళలకు రాజ్యాంగం కల్పించిన హక్కులపై అవగాహనతో చైతన్యవంతంగా మహిళలు తయారు కావాలని ఐద్వా పట్టణ కార్యదర్శి డి.సీతాలక్ష్మి కోరారు. శనివారం పట్టణంలోని రాజుపేట సెంటర్లో ఐద్వా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో హింస వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సెమినార్ నిర్వహించారు. ఈ సెమినర్లోలో ఐద్వా పట్టణ కార్యదర్శి డి.సీతాలక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షులు నాదెళ్ల లీలావతి మాట్లాడుతూ... మహిళల పై హింస రోజురోజుకీ పెరుగుతోందన్నారు. నవంబర్ 25వ తారీకు నుంచి డిసెంబర్ 10 వరకు హింస పై సెమినార్లు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మహిళల పై దాడులు, అత్యాచారలు, హత్యలు విపరీతంగా పెరుగుతూనే ఉన్నాయని, మహిళల పై దాడులు అరికట్టే దానిలో తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, కేంద్రలో ఉన్న మోడీ విఫలమయ్యారన్నారు. కొత్తగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళలపై జరుగుతున్న హత్యలు, అత్యాచారాలు అరికట్టాలని ఐద్వా భద్రాచలం పట్టణ కమిటీ కోరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జి.రాధా, కె.రమణ, ఎస్.కే.చోటమ్మ, డి.కనక శ్రీ, పి.మంగమ్మ పి.లక్ష్మీకాంత, సిహెచ్ ఐమావతి, రాధా శ్రీదేవి, చుక్కమ్మ, ఇంద్రజ, సీత, నాగలక్ష్మి పాల్గొనారు.



పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

- వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మల వెంకన్న

నవతెలంగాణ-పినపాక

పంట చేతికి వచ్చే సమయానికి అకాల వర్షాలు పడి నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మల వెంకన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పినపాక మండలంలో నీట మునిగిన వరి పొలాలను, పత్తి పంటలను పరిశీలించారు. అనంతరం పినపాక మండలం జానంపేటలో మాట్లాడారు. వ్యవసాయ శాఖ అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పర్యటించి పంటనష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదించాలని కోరారు. పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం చెల్లించకపోతే అప్పుల ఊబిలో కూరుకుపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. కౌలు రైతులను గుర్తించి వారికి కూడా పంట నష్టపరిహారం ఇవ్వాలన్నారు. ఎకరానికి యాభైవేలు ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేసారు. ప్రభుత్వం ద్వారా కొనుగోలు కేంద్రాల ఏర్పాటు జాప్యం వల్లనే ప్రత్యక్షంగా నష్టపోయారన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ప్రతి గింజ, ప్రతి పంట ప్రభుత్వమే కొనుగోలు చేయాలనీ ముఖ్యంగా వర్షాల ద్వారా నష్టపోయిన రైతులను గుర్తించి వారికి ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు. ఈ సమావేశంలో మడివి రమేష్, దుబ్బా గోవర్ధన్ పాల్గొన్నారు.

సోనియా గాంధీ జన్మదిన వేడుకలు

- ఆర్టీసీ బస్సు ఫ్రీ ప్రయాణంలో మహిళలు

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి

మండల కేంద్రంలో సోనియా గాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వనమా గాంధీ ఆధ్వర్యంలో సర్పంచ్ బోడా పద్మ కేక్ కట్ చేసి కాంగ్రెస్ కార్యకర్తలకు కేక్ తినిపించారు. అదేవిధంగా సత్తుపల్లి నుండి పాల్వంచ వెళుతున్న ఆర్టీసి బస్సుకి రిబ్బన్ కట్టి కట్ట చేసి మహిళలకు బస్సులో ఉచిత ప్రయాణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పద్మ మాట్లాడుతూ తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీకి రాష్ట్రంలో ప్రజలు కాంగ్రెస్‌కి పట్టం కట్టి కానుకగా ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయుకులు పర్స వెంకట్, దుబాకుల రాము, భీముడు, జమలయ్య తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేట : అశ్వారావుపేటలోని కాంగ్రెస్ కార్యాలయంలో సోనియా గాంధీ పుట్టిన రోజు వేడుకలను సీనియర్ నాయకులు మొగళ్ళపు చెన్నకేశవ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ ఏర్పాటుకు చొరవ చూపిన సోనియా పుట్టినరోజు జరుపుకోవడం, ఇదే రోజు కాంగ్రెస్ మ్యానిఫెస్టోలోని ప్రభుత్వం అమలు చేయనున్న ఆరు గ్యారంటీలలో రెండు పథకాలకు శ్రీకారం చుట్టడం ఎంతో సంతోషకరమైన విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షులు చిన్నం శెట్టి సత్యనారాయణ, ఎంపీటీసీలు సత్యవరపు తిరుమల బాలగంగాధర్, వేముల భారతి ప్రతాప్, జల్లిపల్లి దేవరాజు, జూపల్లి ప్రమోద్, రమేష్, సుబ్బారావు, రమాదేవి, వెంకన్న బాబు, నాగలక్ష్మి, బాజీ, సుదర్శన్, నాయకులు కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొన్నారు.

చంద్రుగొండ : సోనియా గాంధీ పుట్టినరోజు వేడుకల సంబురాలు శనివారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని, దివంగత మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ విగ్రహం వద్ద సోనియమ్మ పుట్టినరోజు వేడుకలు కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్య స్థాపన కోసం తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు అంకిరెడ్డి కృష్ణారెడ్డి, సారేపల్లి శేఖర్, తుమ్మలపల్లి సురేష్, బుజ్జా నాయక్, మండల కాంగ్రెస్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు దారం గోవింద్ రెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు ఉప్పతల ఏడుకొండలు, మాజీ సర్పంచ్ ఇస్లావత్ రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.



పినపాక : సోనియాగాంధీ జన్మదినం రోజే గతంలో తెలంగాణ ప్రకటన వచ్చిందని, తెలంగాణ ఇచ్చిన దేవత సోనియా గాంధీ అని కాంగ్రెస్ మండల అధ్యక్షులు రమణారావు అన్నారు. పినపాక మండలం ఈ బయ్యారం క్రాస్ రోడ్లో గల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు ప్రజా ప్రతినిధులు నడుమ సోనియాగాంధీ జన్మదినం వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కొరస ఆనంద్ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఉడుముల లక్ష్మారెడ్డి, గంగిరెడ్డి వెంకటరెడ్డి, గట్ల శ్రీనివాస్ రెడ్డిలు మాట్లాడారు. కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు రాధా, సోషల్ మీడియా ఇన్చార్జ్ అచ్చ నవీన్, భూపాలపట్నం సర్పంచ్ కృష్ణంరాజు, పొట్లపల్లి సర్పంచ్ కళ్యాణి, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఆళ్ళపల్లి : కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకురాలు సోనియాగాంధీ జన్మదినం రోజే గతంలో తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రత్యేక తెలంగాణ ప్రకటన వచ్చిందని, ఇచ్చిన మాట ప్రకారం సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చారని ఆళ్ళపల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పాయం రామనర్సయ్య చెప్పారు. ఈ మేరకు శనివారం ఆళ్ళపల్లితో పాటు మర్కోడు గ్రామంలో ఆయన ఆధ్వర్యంలో సోనియా గాంధీ 78వ జన్మదిన వేడుకలు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, సీపీఐ పార్టీల మండల నాయకులు మొహమ్మద్ అతహార్, కరకపల్లి సుధాకర్, తులం ముత్తిలింగం, పడిగ సమ్మయ్య, సుతారి కృష్ణ, ఎల్లయ్య, వెంకన్న, సయ్యద్ సాబీర్, పర్వీన్, సునీత, కె.కమల, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందు : కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకురాలు సోనియాగాంధీ పుట్టినరోజు సందర్భంగా శనివారం స్థానిక జెకె కాలనీలో రాష్ట్ర మహిళా నాయకురాలు గోచికొండ శ్రీదేవి ఆధ్వర్యంలో వారి నివాసం వద్ద కేక్ కటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజి టిపిసిసి మెంబర్ ఎస్కే జానీ, ఎస్సీ సెల్ టౌన్ అధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాస్ , మైనార్టీ సెల్ ఎస్కే మసూద్, జితేందర్, శ్రీనివాస్ గౌడ్, ధనరాజ్, మహేష్, అన్వర్, ఆముదాల శ్రీనివాస్, రాజయ్య, సిరాజ్, అను, 11వ వార్డు మహిళలు తదితరులు పాల్గొన్నారు. మున్సిపాలిటీ 22వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ అంకెపాక నవీన్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా సోనియా గాంధీ గారి జన్మదిన వేడుకలు స్థానిక 22వ వార్డులో జెండా సెంటర్ నందు నిర్వహించారు.

భద్రాచలం రూరల్ : జిల్లా డీసీసీ అధ్యక్షులు పొదెం వీరయ్య ఆదేశాల మేరకు భద్రాచలం పట్టణంలో మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలోని ఏఐసీసీ మాజీ అధ్యక్షురాలు తెలంగాణ ఇచ్చిన తల్లి సోనియా గాంధీ జన్మదిన వేడుకలకు ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ చింతిరాల రవికుమార్ పాల్గొని భద్రాచలం ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌లోని రోగులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న చింతిరాల రవికుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బోగాల శ్రీనివాస్ రెడ్డి, మహిళా జిల్లా కార్యదర్శి పందాల సరిత,మైనార్టీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు హసీనా వసీమా, బ్లాక్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు కళ్యాణి కుమారి, జిల్లా మాల మహానాడు అధ్యక్షులు పౌల్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి : టేకులపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల మహిళా అధ్యక్షురాలు ఆకారపు స్వప్న ఆధ్వర్యంలో సోనియాగాంధీ జన్మదినోత్సవ కేక్ కట్ చేసి వేడుకలు ఘనంగా శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.



9
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం
ఆదివారం | డిసెంబర్ 10, 2023 | www.navatelangana.com

అదృశ్యమైన విద్యార్థినిలు మేనత్త ఇంట్లో...

నవ తెలంగాణ-ఇల్లందు

పట్టణంలోని గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల నుండి శనివారం తెల్లవారుజామున ఇద్దరు విద్యార్థినిలు అదృశ్యమైన ఘటనలో ఆచూకీలభ్యమైనది. గుండాల మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో మేనత్త ఇంట్లో ఉన్నట్లు డిటిడబ్ల్యూ రూపా దేవి శనివారం తెలిపారు. ఆశ్రమ పాఠశాలలోని వెనకవైపు ఉన్న గోడ దగ్గర బకెట్లు ఒకదాని మీద ఒకటి పెట్టి పైకెక్కి గోడ దూకి వెళ్ళిపోయినట్లు తెలిపారు. గతంలో కూడా వరంగల్ జిల్లాలోని ఒక ఆశ్రపాఠశాలలో జయిన్ అవగా ఇదే రకంగా తప్పించుకొని బంధువుల ఇంటికి వెళ్లినట్లు తెలిపారు. తల్లిదండ్రులు సంధ్యారాణి, ప్రభాకర్‌లకు పిల్లలను అప్పగించామని తెలిపారు. టిసి ఇవ్వాలని తల్లిదండ్రులు కోరారని తెలిపారు. సొంత ఊరు ఏడప్పులగూడెం పాఠశాలలో చదువుకుంటామని తెలిపారని వారి కోరిక మేరకు సాక్షి శివానందిని, దివ్య దీప్తిలకు టిసి ఇచ్చి పంపినట్లు తెలిపారు.

కామేపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

నవతెలంగాణ-కామేపల్లి

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ నెల్లూరు చందన డాక్టర్ శిరీష ఆధ్వర్యంలో సిబ్బంది ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేకును కట్ చేసి స్వీట్లు మిఠాయిలు పంపిణీ చేసుకుని ఆటపాటలతో సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ప్రతి సంవత్సరం ఈ వేడుకలు ఘనంగా జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అశ్వారావుపేట బస్ స్టాండ్‌లో 'మహాలక్ష్మి' ప్రారంభం

నవతెలంగాణ - అశ్వారావుపేట

కాంగ్రెస్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి నేతత్వంలో నూతనంగా ఏర్పాటు అయిన తెలంగాణ ప్రభుత్వం అమల్లోకి తెచ్చి మహిళా ప్రయాణీకులకు ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించే మహాలక్ష్మి పథకాన్ని శనివారం నియోజక వర్గం కేంద్రం అయిన అశ్వారావుపేట లోని బస్ స్టాండ్ లో లాంఛనంగా ప్రారంభించారు.

ఎస్.ఎం గార్లపాటి రంగారావు, కంట్రోలర్ నార్లపాటి సునీతలు బస్ ను ముస్తాబు చేసి మహిళా ప్రయాణీకులను ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎస్.హెచ్.ఒ ఎస్.ఐ శ్రీకాంత్,పి.సి మూడ్ రామారావు,మహిళా కానిస్టేబుల్ క్రిష్ణ వేణి లు పాల్గొన్నారు.

ఘనంగా సోనియాగాంధీ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ -దుమ్ముగూడెం

సోనియా గాంధీ జన్మదిన వేడుకలను మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. లక్ష్మీనగరం మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన జన్మదిన వేడుకల్లో కేక్ కట్ చేసి స్వీట్లు అందజేశారు. అనంతరం దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పాలు పండ్లు రొట్టెలు అందజేశారు. మండల అధ్యక్షులు లంకా శ్రీనివాసరావు (అబ్బులు) మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కుంజ శ్రీను, జిలకర వెంకటేశ్వర్లు, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ఉపాధ్యక్షులు లంక శివకుమార్, మాజీ మండల అధ్యక్షులు బైరెడ్డి సీతారామారావు, సీరపు అప్పల రెడ్డి, కొరస సీతారాములు, బత్తుల రమేష్, సందీప్, సంపత్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పెనుబల్లిలో విజృంభిస్తున్న డెంగ్యూ జ్వరాలు

పడకేసిన పారిశుధ్యం

నవతెలంగాణ-పెనుబల్లి

పెనుబల్లి తోపాటు అన్ని గ్రామ పంచాయతీల్లో డెంగ్యూ జ్వర పీడితుల సంఖ్య నానాటికి పెరుగుతుంది. పంచాయితీల్లో పారిశుధ్యం లోపించడం వల్ల డెంగ్యూ జ్వరాలు విజృభిస్తున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. మండల కేంద్రంలో ప్రతి ఇంటికి డెంగ్యూ పాజిటివ్ కేసులు నమోదవుతున్నాయి. జ్వర పీడితుల కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పంచాయతీలో సైతం పారిశుధ్య పనులు చేపట్టకపోవడం వల్ల దోమల ఉధృత పెరుగుతుందని ప్రజలు వాపోతున్నారు. మండల కేంద్రంలో ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం ఉన్నప్పటికీ స్థానికంగా జ్వరం పీడితులు ప్రయివేటు వైద్యంపైనే ఆధారపడి వైద్య సేవలు పొందుతున్నారు. వారం రోజులు పాటు ప్లేట్లెట్స్ తగ్గిపోవడం తీవ్ర ఆందోళనలతో అనారోగ్యం పాలవుతున్నారు. గ్రామపంచాయతీలో ఫాగింగ్ మిషన్లు ఉన్నప్పటికి పనిచేయకపోవడంతో అవికాస్త మూలనపడ్డాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దోమల సంఖ్య అనూహ్యంగా పెరిగి, మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ పీడితుల సంఖ్య అనూహ్యంగా పెరిగింది. గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టి అరికట్టే చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

భట్టి గెలుపు మొక్కు తీర్చుకున్న మహిళలు

నవతెలంగాణ-మధిర

మధిర నియోజకవర్గ శాసనసభ్యులు మల్లు భట్టి విక్రమార్క అఖండ మెజార్టీతో గెలుపొందిన సందర్భంగా మధిర మండలం మర్లపాడు, సిద్ధినేనిగూడెం గ్రామానికి చెందిన 40 మంది మహిళలు శనివారం చెప్పులు లేకుండా పాదయాత్ర చేసుకుంటూ ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉన్న మెట్టగుట్ట వెంకటేశ్వర స్వామి వారి దేవాలయం వరకు నడిచి మొక్కుబడి తీర్చుకున్నారు. ఈ సందర్భంగా వాళ్లు మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యం రావాలని రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మధిర నియోజకవర్గంలో మల్లు భట్టి విక్రమార్క గెలుపొందితే నడిచి వస్తామని మొక్కుకున్నామని, మా కోరికలు నెరవేరినందున ఆ మొక్కుబడి తీర్చుకుంటున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ మహిళల అభ్యున్నతికి పెద్దపీట వేసిందని మహాలక్ష్మి పథకం ద్వారా ఈరోజు మహిళలకు రాష్ట్రంలో ఉచిత బస్సులో ప్రయాణ సౌకర్యం కల్పించినందుకు ఆనందంగా ఉందన్నారు.

మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించిన సీఐ

నవతెలంగాణ-మధిర

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల్లో భాగంగా శనివారం మధిర ఆర్టీసీ బస్టాండ్‌లో తొలి సంక్షేమ మహాలక్ష్మి పథకానికి సీఐ వసంత కుమార్, డీఎం దేవదానం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీలో ఒకటైన మహాలక్ష్మి పథకం కింద తెలంగాణ రాష్ట్రంలోని మహిళలకు ఉచిత ప్రయాణం కార్యక్రమాన్ని చేపట్టడం ఎంతో సంతోషంగా ఉందని, మహిళలకు ఎంత ఉపయోగకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్, సీనియర్ నాయకులు రంగా హనుమంతరావు, ఎంపిపి లలిత, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకి పలువురి అభినందనలు

నవతెలంగాణ-కల్లూరు



రాష్ట్ర అసెంబ్లీలో సత్తుపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ప్రమాణ స్వీకారం అనంతరం పసుమర్తి చంద్రరావు, బాగం ప్రభాకర్, షేక్ తురాబ్ అలీ, నగేష్, పెద్దాబోయిన శ్రీనివాస్, పరిమి భరత్, కొండపల్లి మురళి, మోహన్, ప్రసాద్, చందు, ఈ.సత్యం, మోహన్‌రెడ్డి, మధురెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్‌కి మేడేపల్లి విద్యార్థులు

నవతెలంగాణ-ముదిగొండ

రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ క్రీడలకు మండలపరిధిలో మేడేపల్లి గ్రామానికి చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు హైస్కూల్ పిఈటి బి.కృష్ణయ్య శనివారం తెలిపారు. ఖమ్మం రికాబజార్ హైస్కూల్లో నిర్వహించిన షూటింగ్ బాల్ ఎంపిక పోటీల్లో గ్రామానికి చెందిన ముదిగొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న బొడ్డు విక్రమ్‌తో పాటు, మేడేపల్లి హైస్కూల్లో 10వ తరగతి చదువుతున్న ఎస్కే.నేహాల్ పాషా, పల్లె హర్షవర్ధన్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని, శని, ఆదివారం నల్లగొండలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. రాష్ట్రస్థాయిలో షూటింగ్ బాల్ క్రీడలకు ఎంపికైన బొడ్డు విక్రమ్, ఎస్కే. నేహాల్ పాషా, పల్లె హర్షవర్ధన్‌లను ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వాసిరెడ్డి శ్రీనివాస్, మేడేపల్లి హైస్కూల్ హెచ్ఎం బండి నాగేశ్వరరావు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రస్థాయిలో కూడా రాణించి జాతీయ స్థాయికి ఎంపిక కావాలని వారు కోరుతూ ఆకాంక్షించారు.

ధన్యజీవి యాకయ్య

- బీజేపీని ఓడించాలన్న లక్ష్యం కాంగ్రెస్‌కు లేదు
- ఎక్కడ పోగొట్టుకున్నామో అక్కడే వెతుక్కుంటాం
- నోట్లకు ఓట్లు కొనుగోలు చేయడంతోనే ఓట్లు తగ్గాయి
- దేవులపల్లి ప్రథమ వర్ధంతి సభలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కనకయ్య

నవ తెలంగాణ-ఇల్లందు

దశాబ్దాలుగా పార్టీని వెన్నంటి ఉండి అభివృద్ధికి కృషిచేసి, తోడ్పాటు అందించిన దేవులపల్లి యాకయ్య ధన్యజీవని సిపిఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య అన్నారు. స్థానిక ఏలూరి భవన్లో శనివారం దేవులపల్లి యాకయ్య ప్రథమ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మచ్చ వెంకటేశ్వర్లు, ఏజే రమేష్, ఖమ్మం జిల్లా కమిటీ సభ్యులు దుగ్గి కృష్ణ, మండల కార్యదర్శి నబీ తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు ఈ సందర్భంగా మాట్లాడారు. దేవులపల్లి యాకయ్య నియోజవర్గానికి చేసిన సేవలను కొనియాడారు. ధన్యజీవని శ్లాఘించారు. పట్టణం మండలంలో అనేక దాడులు జరిగినప్పటికీ పార్టీని నిలబెట్టి కార్యకర్తలను నాయకులను కాపాడారని అన్నారు. సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రైతు వ్యవసాయ యువజన సంఘాలలో కీలక పాత్ర వహిస్తూ అభివృద్ధికి దోహదం చేశారని అన్నారు. ఆయన సేవ స్ఫూర్తిగా తీసుకొని ప్రతి కార్యకర్త పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.



బిజెపిని ఓడించాలన్న లక్ష్యం కాంగ్రెస్కు లేదు

మతాల మధ్య చిచ్చు పెట్టి పబ్బం గడుపుకునే బిజెపిని ఓడించాలనే లక్ష్యం కాంగ్రెస్ పార్టీకి లేదు. అందుకనే ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల ముందు పొత్తులంటూ చివరి వరకు సాగదీసి పొమ్మనలేక పొగ పెట్టారని అన్నారు. కాంగ్రెస్ ఓంటెద్దు పోకడ, వైఖరి మూలంగానే తాము 19 స్థానాల్లో ఒంటరిగా పోటీ చేయాల్సి వచ్చిందని అన్నారు. పోటీ మూలంగానే చేసిన రాజకీయ పార్టీలు నోట్లకు ఓట్లు కొన్నారని అన్నారు. దీని మూలంగానే ఓట్లు తగ్గాయని అన్నారు. సిపిఎం పార్టీ పోరాటాలను, ప్రజలను నమ్ముకున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో దేవులపల్లి యాకయ్య సతీమణి సోమలక్ష్మి, కూతురు అల్లుడు సంధ్య, ఆలేటి కిరణ్, సిపిఎం పార్టీ నాయకులు కూకట్ల శంకర్, అబ్బాస్, జై బున్నిసా, మన్యం మోహన్ రావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యాకయ్య ఆశయ సాధనకు కృషి చేయాలి : సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మచ్చ వెంకటేశ్వర్లు

నేడు పదవి వ్యామోహాలు, డబ్బు, భ్రమలు పనిచేస్తున్నాయని వీటిని తట్టుకొని నిలబడటం మామూలు విషయం కాదని దేవలపల్లి యాకయ్య ఇచ్చిన స్ఫూర్తితో ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మచ్చ వెంకటేశ్వర్లు అన్నారు. పార్టీ ఉద్యమంలో రాటుదేలిన నేతని అన్నారు. చర్ల మండలంలో కూడా పనిచేశారని ఉద్యమాలలో కార్యక్రమాలలో ఆల్ ఇండియా రాష్ట్ర స్థానిక మహాసభల్లో యాకయ్యతో కలిసి పనిచేశామని మంచి స్ఫూర్తి కలిగిన వ్యక్తని ఆయనతో ఎంతో సాహిత్యం ఉందని అని అన్నారు. ఇలాంటి ఎందరో నేతలు కరిగిపోతున్నారని వారి ఆశయాలు క్రమశిక్షణ అలవర్చుకుని ముందుకు పోవాల్సిన అవసరం ఉందని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

మంచి కమ్యూనిస్టు యాకయ్య : సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు దుగ్గి కృష్ణ

కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడి పార్టీని నిలబెట్టిన ఘనత దేవులపల్లి యాకయ్యదేనని మంచి కమ్యూనిస్టని సిపిఎం ఖమ్మం జిల్లా కమిటీ సభ్యులు దుగ్గి కృష్ణ అన్నారు. కామేపల్లి మండలానికి ఇన్చార్జిగా పనిచేసిన సమయంలో ఆదివాసి కుటుంబం నుండి తనను పార్టీలోకి తీసుకువచ్చారని తెలిపారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా గ్రామాలు, మండలాల్లో తిరిగానని ప్రజలు ఎంతో సహకరించి ప్రేమ ఆప్యాయతలు చూపారని తనను ఆదరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

గురు శిష్యులకు పదవీ గండం తప్పదా?

- 'బంధం'కు మున్నాల ముచ్చటగానే చైర్మన్ గిరి?
- రాజీనామా చేస్తారా? అంటిపెట్టుకొని ఉంటారా?
- కోరిక తీరకుండానే పదవి పోయేనా?
- కొత్త ప్రభుత్వం తొలగించే వరకు కొనసాగుతారా?

నవతెలంగాణ - బోనకల్

ఎన్నో అభ్యంతరాలు, మరెన్నో అవాంతరాలు, అడ్డంకులు మధ్య వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి బోనకల్ మండల పరిధిలోని ముష్టికుంట గ్రామానికి చెందిన బంధం శ్రీనివాసరావుకి దక్కింది. ఈ పదవి కోసం అనేకమంది పోటీ పడ్డారు. చివరకు మధిర మాజీ ఎమ్మెల్యే కొండ బాల కోటేశ్వరరావు ఆశీస్సులతో జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు సిఫార్సుతో బంధం శ్రీనివాసరావుకి మధిర వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి దక్కింది. ఈ ఏడాది జులై 4న మార్కెట్ కమిటీ చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేశారు. సాంప్రదాయ ప్రకారం కొత్త ప్రభుత్వం ఏర్పడిన వెంటనే పాత ప్రభుత్వంలో నామినేట్ అయిన పదవులకు రాజీనామా చేయవలసి ఉంది. ఎంతో ప్రేమతో చైర్మన్ పదవి దక్కించుకున్న బంధం శ్రీనివాసరావుకి కాలం కలిసి రావడం లేదు. ఆరు నెలలు కూడా గడవకముందే బీఆర్ఎస్ పార్టీ ఇటీవల జరిగిన ఎన్నికలలో ఓడిపోవడంతో కొత్త ప్రభుత్వం కొలువు తీరింది. సాంప్రదాయం ప్రకారం మధిర వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి హుందాతనంగా బంధం శ్రీనివాసరావు రాజీనామా చేస్తారా లేక తనను ప్రభుత్వమే తొలగించే వరకు ఆ పదవిలో కొనసాగుతారా అనేది ప్రశ్నార్థకంగా మారింది. గౌరవప్రదంగా రాజీనామా చేసి గౌరవంగా తప్పుకుంటారా అనేది ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారింది. అయితే ఇది ఇలా ఉండగా కాంగ్రెస్ నాయకులు మాత్రం బిఆర్ఎస్ ప్రభుత్వంలో నామినేట్ అయిన బంధం శ్రీనివాసరావు వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. కొత్త ప్రభుత్వం తొలగించే వరకు అంటిపెట్టుకొని ఉండే బదులు గౌరవంగా రాజీనామా చేయటమే మంచిదని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కూడా అంటున్నారు. రాజీనామా చేయకుండా ఉంటే కొద్దికాలం మాత్రమే పదవిలో ఉంటామని ఆ తర్వాత అయినా ప్రభుత్వం బంధం శ్రీనివాసరావుని తొలగించడం ఖాయమని కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేస్తున్నారు. చైర్మన్ గా పూర్తిస్థాయిలో పదవిలో కొనసాగకుండానే మధ్యలోనే అర్ధాంతరంగా పదవి పోతుందనే భయం అతనిలో నెలకొనే ఉందనేది సమాచారం.



బంధం శ్రీనివాసరావు గురువు మధిర మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ కార్పోరేషన్ చైర్మన్ గా కొండబాల కోటేశ్వరరావు కూడా కొనసాగుతున్నారు. కొండ బాల కోటేశ్వరరావు కూడా సాంప్రదాయం ప్రకారం తన పదవికి రాజీనామా చేస్తారా, లేక ప్రభుత్వం తొలగించే వరకు ఆ పదవుల్లోనే కొనసాగుతారా అనేది చర్చనీయాంశంగా మారింది. గురు శిష్యులకు పదవీ గండం తప్పుతుందా, లేక కాంగ్రెసులో చేరి పదవిని కాపాడుకుంటారా అనేది ప్రశ్నార్థకంగా మారింది. తమకు తాముగా కొండబాల కోటేశ్వరరావు, బంధం శ్రీనివాసరావు స్వచ్ఛందంగా రాజీనామా చేస్తారా లేక ప్రభుత్వం ఆర్డినెన్స్ ద్వారా తొలగించే వరకు ఆ పదవిలో కొనసాగుతారా వేచి చూడవలసిందే.


ముగ్గురు మంత్రులకూ టీడబ్ల్యూజేఎఫ్ శుభాకాంక్షలు

నవతెలంగాణ-ఖమ్మం

జిల్లా నుంచి మంత్రులుగా ఎన్నికైన మల్లు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డికి తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ఖమ్మం జిల్లా కమిటీ శనివారం ఓ ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపింది. జిల్లా నుంచి తొలిసారి ముగ్గురు మంత్రులుగా ఎంపిక అవ్వడం శుభ పరిణామం అని ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పల్లా కొండలరావు, కొత్తపల్లి శ్రీనివాస రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ సాతుపాటి రామయ్య పేర్కొన్నారు. శనివారం కేటాయించిన శాఖల్లోనూ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కకు ఆర్థిక, విద్యుత్ శాఖలు దక్కడం హర్షనీయమని తెలిపారు. పొంగులేటి శ్రీనివాసరెడ్డికి రెవెన్యూ, గృహ నిర్మాణంతో పాటు సమాచార శాఖలు, తుమ్మల నాగేశ్వరరావుకు వ్యవసాయం, చేనేత, సహకార శాఖలు లభించడంతో జిల్లాకు రాష్ట్రంలోనే అధిక ప్రాధాన్యం లభించినట్లయిందని పేర్కొన్నారు. సమాచారశాఖ మంత్రిగా పొంగులేటి శ్రీనివాసరెడ్డి జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాల్సిందిగా కోరారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా జర్నలిస్టులకు సౌకర్యాలు కల్పించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

ఉచిత ప్రయాణానికి మహిళా ప్రయాణికులు ఆసక్తి

నవతెలంగాణ- బోనకల్



కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని శనివారం నుంచి కల్పించడంతో ఆర్టీసీ బస్సులో మహిళలతో సందడి సందడిగా మారాయి. స్థానిక ఖమ్మం బస్టాండ్ సెంటర్లో ఆర్టీసీ బస్సులన్నీ 90 శాతం మహిళలతో కలకలలాడాయి. ఆర్టీసీ బస్సుల కోసం గతంలో ఎదురు చూడని మహిళలు శనివారం మాత్రం ఆర్టీసీ బస్సుల కోసం గంటలకొద్దీ వేచి ఉండటం విశేషం. శనివారం మాత్రం ఆర్టీసీ బస్సులన్నీ మహిళా ప్రయాణికులతోటే సం దడి సందడిగా మారాయి. ఈ సందర్భంగా మహిళలను నవ తెలంగాణ పలకరించగా తమకు ఆర్టీసీ బస్సులలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం పట్ల మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో తాము ప్రయాణం చేయాలంటే ఎక్కువగా ఆటోలను ఆశ్రయించవలసి వచ్చింది అన్నారు. కానీ ప్రస్తుతం తాము ఆటోలలో ఎక్కవలసిన అవసరం లేకుండా చార్జీలు చెల్లించవలసిన పరిస్థితి లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం తమకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని ఆర్టీసీ బస్సులలో కల్పించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రత్యేకంగా మహిళల కోసమే ఈ సౌకర్యం ఏర్పాటు చేయటం కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న మంచి నిర్ణయం అని మహిళలు ఆనందం హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉచిత బస్సు ప్రయాణంపై మహిళలు హర్షం

ముదిగొండ : తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా కొలువుదీరిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వము ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీల్లో భాగంగా ఏఐసిసి అధినేత సోనియాగాంధీ జన్మదిన సందర్భంగా మహిళలకు ఆర్టీసీ బస్సులు ఉచిత ప్రయాణాన్ని అమలు చేసింది.ఆర్టిసి బస్సులో ఉచిత ప్రయాణంపై మండలంలోని వివిధ గ్రామాల మహిళలు హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని అభివర్ణించారు.

అశ్వారావుపేట నాలుగో ఎమ్మెల్యేగా జారే ప్రమాణం స్వీకారం

పలువురి శుభాకాంక్షలు...

నవతెలంగాణ - అశ్వారావుపేట



అశ్వారావుపేట నియోజక వర్గం నాలుగో ఎమ్మెల్యేగా జారే ఆదినారాయణ శనివారం అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేసారు. ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ క్రమంలో ఆయన తెలంగాణ మూడో అసెంబ్లీలో అశ్వారావుపేట నియోజక వర్గం నుండి నాలుగో ఎమ్మెల్యేగా జారే ఆదినారాయణ ప్రమాణ స్వీకారం చేయడం గమనార్హం. గిరిజన సంక్షేమ శాఖ విద్యా విభాగంలో ఆశ్రమం పాఠశాల పి.ఇ.టి గా విధులు నిర్వహించే ఆదినారాయణ ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు అయిన అనంతరం మొదటి సారి 2014 లో జరిగిన ఎన్నికల్లో ఉపాధ్యాయ వృత్తికి రాజీనామా చేసి టీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసారు. వైఎస్ ఆర్‌సిపి అభ్యర్థి తాటి వెంకటేశ్వర్లు విజయం సాధించగా జారే ఆదినారాయణ మూడో స్థానంలో నిలిచారు. నాటి నేటి వరకు ఏదో కార్యక్రమం పేరుతో నియోజక వర్గం ప్రజల్లో తలలో నాలుకలా మెలగడం తో విజయం వరించింది. 2014 లో పాఠశాల నుండి నేరుగా రాజకీయాల్లోకి వచ్చిన జారే నేడు అసెంబ్లీలో ప్రవేశించారు. నేడు ప్రమాణ స్వీకారం చేసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జారే ఆదినారాయణ ఇరువురిది అశ్వారావుపేట నియోజక వర్గం దమ్మపేట మండలం గండుగుల పల్లి ఒకే ఊరు కావడం మరో ప్రత్యేకత. దీంతో పలువురు నాయకులు, అధికారులు,సంఘం నాయకులు వీరి ఇరువురికి శుభాకాంక్షలు తెలిపారు.

సోమవారం నుండి గ్రీవెన్స్ డే

నవతెలంగాణ-ఖమ్మం

ఎన్నికల దృష్ట్యా తాత్కాలికంగా రద్దు చేసిన గ్రీవెన్స్ డే ను తిరిగి వచ్చే సోమవారం నుండి నూతన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ వీపీ.గౌతమ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రీవెన్స్ డేను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

పాటిమీదిగుంపులో కాంగ్రెస్ నాయకుడు బిచ్చా మృతి

నవతెలంగాణ-కారేపల్లి



కారేపల్లి మండలం పాటిమీదిగుంపుకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు భూక్యా బిచ్చానాయక్(68) శనివారం మృతి చెందాడు. మృతదేహంపై కాంగ్రెస్ నాయకులు పార్టీ పతాకాన్ని ఉంచి నివాళ్లులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గుగులోత్ బాలకృష్ణ, భూక్యా వెంకన్న, శంకర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారికి పంచామృతాలతో అభిషేకం

నవతెలంగాణ-ఎర్రుపాలెం

తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన మహా దివ్య క్షేత్రమైన జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయానికి శనివారం కావడంతో భక్తులు వేలాదిగా తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. తెల్లవారు జామునే స్వామి వారికి పంచామృతాలతో సర్వాంగా అభిషేకం ఘనంగా నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వ హించారు. అనంతరం శ్రీ వారికి పట్టు వస్త్రములు ధరింప జేసి, పూల మాలలు అలంకరించి ప్రత్యేక అలంకరణ గావించి అంగ రంగ వైభవంగా స్వామి వారిని భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయానికి భక్తులు వేలాదిగా తరలివచ్చి స్వామి వారిని అమ్మ వార్లను దర్శించుకున్నారు. తెల్లవారు జాము నుండే ఆలయంలో వేద పండితులు సుప్రభాత సేవ, వేద పారాయణం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.వచ్చిన భక్తులు స్వామి వారి ఆలయంతో పాటుగా అన్ని ఉప ఆలయాలను దర్శించుకున్నారు. స్వామి వారికి అలివేలు మంగా, పద్మావతి దేవేరులతో స్వామి వారికి నిత్య కళ్యాణం భక్తుల సమక్షంలో అర్చకులు కురవి సుబ్రహ్మణ్యం శాస్త్రి నిర్వహించి తీర్థ ప్రసాదాలను అందించారు. మహిళా భక్తులు పొంగళ్ళు చేసి స్వామి వారికి నివేదించి తమ మొక్కలు తీర్చుకున్నారు. నూతన వాహనాల కొనుగోలు దారులు తమ వాహనాలకు ప్రత్యేక పూజలు నిర్వ హించుకున్నారు. జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి సేవ సమితి ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, అర్చక బృందం, భక్తులు పాల్గొన్నారు.

దుర్గా మల్లేశ్వర స్వామికి అన్నాభిషేకం

నవతెలంగాణ-ఎర్రుపాలెం

మండల పరిధిలోని బనిగండ్లపాడు గ్రామంలో ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం అన్నాభిషేకం కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు కాశవఝల నరసింహమూర్తి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత దంపతులుచే కుంకుమ పూజ నిర్వహించి అనంతరం స్వామి వారికి అన్నాభిషేకం ని ర్వహించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్ ఐలూరి వెంకటేశ్వరరెడ్డి, గ్రామపంచాయతీ సర్పంచ్ జంగా పుల్లారెడ్డి, పెద్ద గోపవరం సొసైటీ అధ్యక్షులు శీలం అక్కిరెడ్డి, రాజులు దేరపాడు సర్పంచ్ వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బండారు నరసింహారావు, యన్నం పిచ్చిరెడ్డి, అంకమ్మ తల్లి ఆలయ పూజారి వేమిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి 6,000 సాయం

- తమిళనాడు సీఎం స్టాలిన్

తమిళనాడు : తమిళనాడులో మిచౌంగ్ తుఫాను ప్రభావితమైన కుటుంబాలన్నింటికీ ఒక్కొక్కరికి రూ.6,000 చొప్పున ఆర్థిక సాయాన్ని ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ ప్రకటించారు. ఈ మొత్తాన్ని రేషన్ షాపుల ద్వారా అందచేయనున్నామని తెలిపారు. వరదల్లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ఇచ్చే పరిహారాన్ని రూ. 4లక్షల నుండి రూ.5 లక్షలకు పెంచారు. తుఫాను కారణంగా రాష్ట్రంలో దెబ్బతిన్న గుడిసెలను బాగు చేయడానికి రూ.5,000 నుంచి రూ.8,000 ఇవ్వనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఆహార పొట్లాలు, పాలపొడి, తాగునీటి సీసాలు, బ్రెడ్, బిస్కెట్లు తుఫాను ప్రభావిత ప్రాంతాలకు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో 25 వేల మందికి పైగా పారిశుధ్య కార్మికులు, విపత్తు నిర్వహణ బందాలతో కలిసి యుద్ధప్రాతిపదికన పనిచేస్తున్నారని సీఎం చెప్పారు.

పంట నష్ట పరిహారం

33శాతం కంటే ఎక్కువ దెబ్బతిన్న వరి పొలాలకు పరిహారం మొత్తాన్ని హెక్టారుకు రూ.13,500 నుంచి రూ.17,000కి పెంచారు. ఎండిపోయిన పంటల నష్టపరిహారం హెక్టారుకు రూ.7,410 నుంచి రూ.8,500కు పెంచారు.

ఆవులు, గేదెల కోల్పోయిన వారికి రూ.30,000 నుంచి రూ.37,500 పెంచారు. మత్స్యకారులకు, వలలతో సహా పూర్తిగా దెబ్బతిన్న పడవలకు పరిహారం రూ.32,000 నుంచి రూ.50,000కి పెంచారు. పాక్షికంగా దెబ్బతిన్న పడవలకు, మొత్తం రూ.10,000 నుండి రూ.15,000కు పెంచారు.

రైతుబంధు ఎప్పుడు జమ చేస్తారు..?

- మాజీ మంత్రి హరీశ్‌రావు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అధికారంలోకి వచ్చాక డిసెంబర్ తొమ్మిదో తేదీన రైతు బంధు కింద రూ. 15 వేలు ఇస్తామని చెప్పారనీ, అవి ఎప్పుడు ఇస్తారో చెప్పాలని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. శనివారం అసెంబ్లీలోని మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. అధికార పక్షమైనా.. ప్రతిపక్షమైనా ఎప్పటికీ తాము ప్రజల పక్షాన నిలబడుతామన్నారు. కొత్తగా ప్రమాణ స్వీకారం చేసిన ఎమ్మెల్యేలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. రైతాంగమంతా రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం కోసం వేచి చూస్తున్నదని తెలిపారు. 'వడ్లు అమ్ముకోకండి.. తాము బోనస్‌తో వడ్లు కొనుగోలు చేస్తామని కాంగ్రెస్ నేతలు ఎన్నికల ప్రచారంలో చెప్పారు. అధికారంలోకి వచ్చారు కదా రూ. 500 బోనస్‌తో వడ్లు ఎప్పుడు కొంటారో చెప్పాలి' అని డిమాండ్ చేశారు. మిగ్‌జాం తుపాను కారణంగా కొన్ని చోట్ల వడ్లు తడిశాయనీ, అలాంటి రైతులను ఆదుకోవాలని కోరారు.

ఒకటి నుంచి 8 సీట్లకు ఎదిగాం

- 36 లక్షల ఓట్లు తెచ్చుకున్నాం.. అధికారం దిశగా దూసుకెళ్తున్నాం : బీజేపీ నేత ఈటల రాజేందర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో గత అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ నుంచి ఒక్కరే ఎమ్మెల్యేగా గెలిచారనీ, ఇప్పుడా సంఖ్య 8 మంది ఎమ్మెల్యేలకు చేరిందని బీజేపీ నేత, మాజీ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. రాష్ట్రంలో 36 లక్షల ఓట్లు తెచ్చుకున్నామనీ, అధికారం దిశగా దూసుకెళ్తున్నామని చెప్పారు. బీజేపీ గతంతో పోలిస్తే డబుల్ సీట్లు సాధించడం ఆనందంగా ఉందన్నారు. గొప్ప విజయాన్ని కట్టబెట్టిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. వేరే గాలి వీస్తున్నా తప్పుడు ప్రచారం జరుగుతున్నా ప్రజలు బీజేపీని ఆదరించారన్నారు. ఎంపీగా పోటీచేస్తానో..లేదో తెలియదనీ, ఈ విషయంలో పార్టీ నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు మాట్లాడుతూ.. బీజేపీ, ఎంఐఎం కలిస్తే తమ బలం పెరుగుతుందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి చేసిన వ్యాఖ్యల్ని ఖండించారు. తమకు ఏ పార్టీతోనూ పొత్తు ఉండదని నొక్కి చెప్పారు.

కడియం మాటలతో తమకు సంబంధం లేదన్నారు. ప్రొటెం స్పీకర్‌గా అక్బరుద్దీన్ ఓవైసీకి అవకాశం కల్పించినందుకే బీజేపీ ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని బాయ్‌కాట్ చేశారని స్పష్టం చేశారు. ఓటమి నుంచి గుణపాఠాలు నేర్చుకుని ముందుకెళ్తామన్నారు. కార్యకర్తలెవ్వరూ నిరుత్సాహానికి గురికావొద్దని కోరారు.

తుమ్మినా..దగ్గినా కూలిపోయే స్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం

- లోపాయికారీ ఒప్పందంతోనే ప్రొటెం స్పీకర్‌గా అక్బరుద్దీన్ : కిషన్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తుమ్మినా..దగ్గినా కూలిపోయే పరిస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందనీ, లోపాయికారీ ఒప్పందంలో భాగంగానే ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీని ప్రొటెం స్పీకర్‌గా చేశారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి విమర్శించారు. సభలో చాలా మంది సీనియర్లున్నప్పటికీ అక్బరుద్దీన్‌నే ఎందుకు ఎంచుకున్నారని ప్రశ్నించారు. రెగ్యులర్ స్పీకర్ వచ్చాక ఆయన సమక్షంలోనే తమ పార్టీ ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకారం చేస్తారని స్పష్టం చేశారు. అందుకే ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని తమ ఎమ్మెల్యేలు బహిష్కరించారని తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీకి 14 శాతం ఓట్లు లభించాయనీ, 8 మంది ఎమ్మెల్యేలు గెలిచారని తెలిపారు.

గెలిచిన చోట్ల మంచి మెజార్టీ వచ్చిందనీ, పలు నియోజకవర్గాల్లో ద్వితీయ స్థానాల్లో నిలిచామని చెప్పారు. నూతన శాసనసభ కొలువుతీరుతున్న సమయంలో కాంగ్రెస్ పార్టీ తన పాత అలవాటు ప్రకారం శాసనసభ నియమాలు, విధానాలు, గౌరవాన్ని కాలరాసిందని విమర్శించారు. శాసనసభలో సీనియర్ సభ్యులను ప్రొటెం స్పీకర్‌గా నియమించే సంప్రదాయం ఉందనీ, దాన్ని ఆ పార్టీ తుంగలో తొక్కిందని చెప్పారు. మజ్లిస్ పార్టీతో చేసుకున్న లోపాయికారి ఒప్పందం మేరకే అక్బరుద్దీన్‌ను ప్రొటెం స్పీకర్‌గా నియమించారని విమర్శించారు. ఆయన్ను ప్రొటెం స్పీకర్‌గా నియమించడాన్ని తమ పార్టీ ఖండిస్తోందన్నారు. సభలో కాంగ్రెస్ పార్టీకి బొటాబొటీ మెజార్టీ ఉన్న నేపథ్యంలోనే ఎంఐఎంతో మిలాఖత్ అయ్యిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం శాసనసభ నియమాలను ఉల్లంఘించినందుకే ఆ కార్యక్రమాన్ని బహిష్కరించామని స్పష్టం చేశారు. కాంగ్రెస్, ఎంఐఎం ఒక్కటేనన్న విషయాన్ని ఇప్పటికే చాలాసార్లు చెప్పామన్నారు. ఇప్పుడు అదే నిజం అవుతున్నదని చెప్పారు. శాసనసభ నిబంధనలను ఉల్లంఘించి ప్రొటెం స్పీకర్ బాధ్యతలు అక్బరుద్దీన్‌కు ఇవ్వడంపై గవర్నర్‌కు ఫిర్యాదు చేశామన్నారు.

వికలాంగులకు ఉచిత ప్రయాణ హామీని అమలు చేయాలి :ఎన్‌పీఆర్‌డీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వికలాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామంటూ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె వెంకట్, ఎం అడివయ్య, కోశాధికారి ఆర్ వెంకటేశ్ శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మహాలక్ష్మి పథకంపేరుతో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిన రాష్ట్ర ప్రభుత్వం, వికలాంగులకు ఇచ్చిన హామీని ఎందుకు అమలు చేయడం లేదో చెప్పాలని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వికలాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తూ నిర్ణయాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు.

తక్షణ కాల్పుల విరమణ కోసం ఐరాస పిలుపు

వీటో పవర్‌తో అడ్డుకున్న అమెరికా

న్యూయార్క్ : ఇజ్రాయెల్ హమాస్ మధ్య భీకర పోరు వేళ .. తక్షణ కాల్పుల విరమణ కోసం ఐరాస భద్రతా మండలి పిలుపునిచ్చింది. ఈ దాడుల కారణంగా గాజాలోని సామాన్య ప్రజల బతుకు ఛిద్రమవుతున్నదని, గాజాలో తక్షణమే కాల్పులు విరమణ జరగాలని ఐరాస భద్రతా మండలి చేసిన తీర్మానాన్ని అమెరికా వ్యతిరేకించింది. అందుకోసం తన వీటో పవర్‌ను ఉపయోగించింది. కాల్పుల విరమణ కోసం తీర్మానాన్ని ఆమోదించడానికి గతంలో చేసిన అనేక ప్రయత్నాలు వీటో చేయబడ్డాయి.

ఐక్యరాజ్యసమితి వివరణ

ఇజ్రాయెల్ దాడుల్లో గాజాలోని విస్తారమైన ప్రాంతాలు బంజరు భూమిగా మారాయి. వ్యాధి ముప్పుతోపాటు ఆహారం, ఇంధనం, నీరు, ఔషధాల కొరతను ఎదుర్కొంటున్న 80 శాతం జనాభా స్థానభ్రంశం చెందారని ఐక్యరాజ్యసమితి పేర్కొంది. 'అంతర్జాతీయ మానవతా చట్టం పౌరులను రక్షించే బాధ్యతను కలిగి ఉంటుంది' అని గుటెరెస్ చెప్పారు.

వీటో అధికారంతో తీర్మానాన్ని అడ్డుకున్న అమెరికా

గాజాలో మానవతా సంక్షోభ నివారణ నిమిత్తం ఇటీవల ఐరాస చీఫ్ ఆంటోనియో గుటెరస్ అసాధారణ అధికారాన్ని ఉపయోగించారు. యూఎన్ ఛార్టర్‌లోని ఆర్టికల్ 99ను ప్రయోగించారు. ఈ ప్రత్యేక అధికారంతో అంతర్జాతీయంగా ఆందోళనలను కలిగించే పరిస్థితుల్లో భద్రతా మండలిని సమావేశపరచవచ్చు. దీనిలో భాగంగా సమావేశమైన మండలిలో ఓటింగ్ జరిగింది. అయితే మండలిలో శాశ్వత సభ్యదేశమైన అమెరికా తన వీటో అధికారంతో తీర్మానాన్ని అడ్డుకుంది. మండలిలో మొత్తం 15 సభ్య దేశాలు ఉన్నాయి.



ఓటింగ్‌కు బ్రిటన్ దూరం..

గాజాలో తక్షణమే కాల్పుల విరమణ కోసం భద్రతా మండలిలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ప్రతిపాదించిన ముసాయిదాకు 13 మంది అనుకూలంగా ఓటేశారు. బ్రిటన్ ఓటింగ్‌కు దూరంగా ఉంది. హమాస్ చర్యల పట్ల ఎలాంటి ఖండన లేకపోవడంతో ఓటింగ్‌కు దూరమయ్యామని బ్రిటన్ తెలిపింది.

అమెరికా, ఇజ్రాయెల్ వ్యతిరేకత

అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు కాల్పుల విరమణను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. అది హమాస్ పుంజుకునేందుకు ఉపయోగపడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. అయితే గాజాలో పౌరుల రక్షణ కోసం, బందీల విడుదల కోసం యుద్ధంలో స్వల్ప విరామాలకు మాత్రం అమెరికా అనుకూలంగా ఉంది.

అమెరికన్ రాయబారి రాబర్ట్ వుడ్ స్పందన

అమెరికన్ రాయబారి రాబర్ట్ వుడ్ మాట్లాడుతూ.. తీర్మానం వాస్తవికతకు దూరంగా ఉందన్నారు. "నేల మీద సూదిని ముందుకు కదిలించలేరు" అని చెప్పారు. ఈ తీర్మానం ఇప్పటికీ షరతులు లేని కాల్పుల విరమణ కోసం పిలుపునిస్తుందని చెప్పారు. ఇది అక్టోబర్ 7న హమాస్ చేసిన పనిని పునరావతం చేయగలదు అని అభిప్రాయపడ్డారు.

పాలస్తీనా ప్రతినిధి స్పందన

"మీరు దానిని (యుద్ధాన్ని) సమర్థిస్తే, మానవత్వానికి వ్యతిరేకంగా చేసిన నేరాలకు మద్దతు ఇస్తున్నారు" అని పాలస్తీనా ప్రతినిధి రియాద్ మన్సూర్ అన్నారు.

కార్మికుల మనసు దోచిన రాజ్‌ఠాకూర్

- సింగరేణి కార్మికుని వేషధారణతో అసెంబ్లీకి
- భావోద్వేగానికి గురైన ఎమ్మెల్యే

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



సింగరేణి ప్రాంతం నుంచి వచ్చాడు. తొలిసారి గెలిచి అసెంబ్లీలో అడుగుపెట్టాడు. తాను సింగరేణి కార్మికుల ప్రతినిధినంటూ కార్మికుల డ్రస్సు వేసుకుని, తట్ట, చెమ్మాస్ చేతిలో పట్టుకుని, లైట్‌తో కూడిన హెల్మెట్ పెట్టుకుని శాసనసభ ఆవరణలోకి శనివారం ఎంట్రీ ఇచ్చాడు. అందరి చూపూ తనవైపు తిప్పుకున్నాడు. అసెంబ్లీ ఆవరణలోకి రాగానే భావోద్వేగానికి లోనయ్యాడు. ఇంతకీ అతనెవరనుకుంటున్నారా? కాంగ్రెస్ నుంచి గెలుపొందిన రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్. తొలిరోజు తన వేషధారణతో అసెంబ్లీకి వచ్చి సింగరేణి కార్మికుల మనస్సు దోచేశాడు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడారు. '25 ఏండ్ల నా సుదీర్ఘ పోరాటం ఫలించింది. సింగరేణి ప్రాంతం నుంచి కార్మికుల ప్రతినిధిగా అసెంబ్లీకి వచ్చా. వారి గౌరవం కాపాడుతా. గడీల పాలనకు చరమగీతం పాడి నాకు భారీ మెజార్టీ ఇచ్చిన సింగరేణి కార్మికులకు, ఉద్యోగులకు, ప్రజలందరికీ ధన్యవాదాలు. సింగరేణి కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఓపెన్‌కాస్టులు ఇబ్బందికరంగా మారాయి. ఆ ప్రాంతమంతా కాలుష్యమైపోయింది. చుట్టూ నీళ్లున్నా కాలుష్యంతో తాగలేని పరిస్థితి ఉంది. అక్కడి వాతావరణంతో పెరాలసిస్, గుండెజబ్బులు, ఇతరత్ర అనారోగ్య సమస్యలతో ప్రజలు చనిపోతున్నారు.

ఆ ప్రాంతంలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాల్సిన పరిస్థితి నెలకొంది. అక్కడ పర్యావరణం పునరుద్ధరించాలంటే వేల ఎకరాల్లో మొక్కలు నాటాలి. నేడు సింగరేణిలో కార్మికుల సంఖ్య ఏటేటా తగ్గిపోతున్నది.

యువతకు మేలు చేయాలి. సింగరేణి ప్రాంతంలో చేయాల్సిన పనులెన్నో ఉన్నాయి. నాకు సాధ్యమైనంత మేరకు నియోజకవర్గ ప్రజలకు, సింగరేణి కార్మికులకు మేలు జరిగేలా సింగరేణి కార్మికుల ప్రతినిధిగా అసెంబ్లీలో మాట్లాడుతా' అంటూ భావోద్వేగంతో అన్నారు. అసెంబ్లీకి తన కుటుంబంతో కలిసి వచ్చారు.

ఎస్ఎల్‌బీసీ కాల్వ పొడిగింపు కోసం కృషి చేస్తా : కె.జయవీర్‌రెడ్డి



ఎస్ఎల్‌బీసీ కాలువను మరో తొమ్మిది కిలోమీటర్లు పొడిగించేందుకు తన వంతు కృషి చేస్తానని కాంగ్రెస్ శాసనసభ్యుడు కుందూరు జయవీర్‌రెడ్డి అన్నారు.

శనివారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యేగా అవకాశమిచ్చిన ఏఐసీసీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. తన తాత, తండ్రిని ఆదర్శంగా తీసుకుని నాగార్జునసాగర్ నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేస్తానని హామీనిచ్చారు

మా కుటుంబాలు రోడ్డున పడతాయి

- సీఎం రేవంత్ రెడ్డి తగిన పరిష్కారం చూపించాలి
- నెలకు రూ.15 వేల జీవన భృతి అందించాలని విజ్ఞప్తి
- హైదరాబాద్‌లో ఆటో డ్రైవర్స్ సమావేశం



నవతెలంగాణ-ముషీరాబాద్

ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడం వల్ల రాష్ట్రవ్యాప్తంగా ఆటోడ్రైవర్ల కుటుంబాలు రోడ్డున పడతాయని తెలంగాణ ఆటో మోటార్స్ డ్రైవర్స్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వేముల మారయ్య అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడంపై తెలంగాణ ఆటో మోటార్స్ డ్రైవర్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేముల మారయ్య మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించిన నేపథ్యంలో తమకు జీవన భృతి కింద నెలకు రూ. 15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఆటో డ్రైవర్లకు తగిన పరిష్కార మార్గాలు చూపాలని కోరారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాల ప్రకారం ఆటో మోటార్స్ రవాణా కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి అర్హులైన వారికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలన్నారు. ఆటో మీటర్ రేట్లు పెంచి కొత్త పర్మిట్ ఇవ్వాలని కోరారు.

ఓలా, ఉబర్ సంస్థలను ప్రభుత్వం వారి ఆధీనంలోకి తీసుకొని నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో యూనియన్ కార్యదర్శి చిన్న బాల నరసింహ, రాష్ట్ర ఉపాధ్యక్షులు శాంతం రమేష్, గ్రేటర్ హైదరాబాద్ ప్రెసిడెంట్ నిరంజన్, ఎండి. వాజిద్, ఎండి పర్వేజ్ తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్‌కే ప్రతిపక్ష నేత హోదా

నవతెలంగాణ- గజ్వేల్



గజ్వేల్ అసెంబ్లీ నుండి 2014, 2018 శాసనసభ ఎన్నికల్లో కేసీఆర్ గెలుపొంది ముఖ్యమంత్రి బాధ్యతలను రెండుసార్లు చేపట్టారు. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో గజ్వేల్ అసెంబ్లీ స్థానం నుంచి మూడోసారి గెలుపొందిన కేసీఆర్‌కు ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు తగిన మెజార్టీ రాలేదు. దీంతో ప్రతిపక్షంలో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. 39 మంది శాసనసభ్యులు బీఆర్ఎస్ నుంచి గెలుపొందగా కేసీఆర్‌ను శాసనసభాపక్ష నేతగా శనివారం ఎన్నుకున్నారు. గజ్వేల్ ప్రాంతానికి 10 సంవత్సరాలు ముఖ్యమంత్రి హోదా దక్కడం ఎంత గౌరవంగా ఉందని ఆ పార్టీ కార్యకర్తలు అంటున్నారు. ప్రతిపక్ష నేతగా గజ్వేల్ నుంచి గెలిచిన కేసీఆర్ ఉండటం వల్ల తమకు ఎలాంటి నష్టమూ లేదని, దీనిని తాము అవమానంగా భావించడం లేదని అన్నారు. సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించడానికి, నిలదీయడానికి అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు.

ప్రజలు ఎలాంటి తీర్పు ఇచ్చినా స్వీకరించడానికి సిద్ధంగా ఉండాలని ఎన్నికల ప్రచారసభల్లో తమ నాయకుడు కేసీఆర్ చెప్పారని, ప్రభుత్వంలోకి రాలేకపోయినంత మాత్రాన బాధపడటం లేదని బీఆర్ఎస్ కార్యకర్తలు అంటున్నారు. అయితే కేసీఆర్ అనారోగ్యపరంగా 8 వారాలకుపైగా విశ్రాంతి తీసుకోవాలని డాక్టర్లు సూచించడంతో అసెంబ్లీ సమావేశాలకు హాజరు కావడం లేదు. కేసీఆర్ త్వరగా ఆరోగ్యంగా కోలుకోవాలని గజ్వేల్ నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు రెండు రోజులుగా దేవాలయాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నారు.

మహిళా కార్పొరేటర్‌కి అవమానం

- రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ప్రారంభంలో ప్రోటోకాల్‌పై వివాదం

నవతెలంగాణ-ఖమ్మం/ విలేకరులు

కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం అమలు కార్యక్రమాన్ని శనివారం ఖమ్మంలోని ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలోని మాతా శిశు సంరక్షణ కేంద్రంలో కలెక్టర్ వి.పి గౌతమ్ ప్రారంభించారు. ఈ సమయంలో ఇక్కడ ప్రొటోకాల్ వివాదం చోటు చేసుకుంది. పథకం అమలు జరిగిన ప్రాంతం 54వ డివిజన్. ప్రొటోకాల్ నిబంధనలను అనుసరించి ఆ ప్రాంత డివిజన్ కార్పొరేటర్ మిక్కిలినేని మంజుల వేదికపైకి వచ్చి కలెక్టర్ పక్కన కూర్చున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.మాలతి వేదికపై కూర్చున్న మహిళా ప్రజాప్రతినిధి మంజులను మీరు కాస్త లేచి పక్కన కూర్చోవాలని చెప్పడంతో ఆమె అవమానానికి గురయ్యారు. ప్రభుత్వం తీసుకున్న కార్యక్రమంలో తాను ఒక ప్రజాప్రతినిధిగా వేదికపై ఆసీనురాలినైతే తనను ప్రజల ముందే ఒక మహిళా అధికారి అక్కడి నుంచి పక్కకు జరగమని చెప్పడం సరికాదని ఆమె అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ రాజీవ్ ఆరోగ్య పథకం పేద ప్రజలకు ఒక వరం లాంటిదని అన్నారు. ఈ సందర్భంగా చేయూత పథకానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ బి. మాలతి, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. రాజేశ్వర రావు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారిణి విద్యాచందన, జిల్లా సంక్షేమ అధికారిణి సుమ పాల్గొన్నారు.

రాష్ట్రమంతా ఆరోగ్యశ్రీ...

వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలలో మహాలక్ష్మి (మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం) , చేయూత (రాజీవ్ ఆరోగ్యశ్రీ) రెండు పథకాలను జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి వైద్య ఆరోగ్య, రవాణా శాఖ అధికారులతో కలిసి ప్రారంభించారు. రంగారెడ్డి జిల్లా కొండాపూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం పెంపును రంగారెడ్డి జిల్లా కలెక్టర్ భారతీ హోళికేరి ప్రారంభించారు. సూర్యాపేట జిల్లాకేంద్రంలోని ఏరియాస్పత్రిలో కలెక్టర్ వెంకట్రావు, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ కోటాచలం, ఏరియాస్పత్రి పర్యవేక్షకులు డాక్టర్ మురళీధర్‌రెడ్డి, డీఐఓ డాక్టర్ వెంకటరమణ, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్ పాల్గొన్నారు.

బీట్ ఆఫీసర్ ఆత్మహత్యాయత్నం

- 30 నిద్ర మాత్రలు మింగిన వైనం
- మంచిర్యాల ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స
- ఎఫ్ఆర్ఓ వేధింపులతోనేనని బాధితురాలి ఆరోపణ3

నవతెలంగాణ-కోటపల్లి

మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం వెంచపల్లి బీట్ ఆఫీసర్ లత ఆత్మహత్యాయత్నం చేసింది. శనివారం తెల్లవారుజామున అపస్మారక స్థితిలో ఉండగా భర్త హుటాహుటిన మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రయివేట్ ఆస్పత్రిలో చేర్పించారు. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం..లత వెంచపల్లి బీట్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తోంది. తన బీట్‌లో ప్లాంటేషన్‌లో ఒడిసా కూలీలు పని చేస్తున్నారు.

వారికి డబ్బులు సరిగ్గా అందడం లేదంటూ ఎఫ్ఆర్ఓను సంప్రదించింది. దీనికి ఎఫ్ఆర్ఓ డబ్బులు లేవని, ఎక్కడ చెప్పుకుంటారో చెప్పుకోండని బెదిరింపు ధోరణితో మాట్లాడాడు. దీంతో కూలీలు డీఎఫ్ఓ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. వెంటనే డీఎఫ్ఓ ఎఫ్ఆర్ఓకు ఫోన్ చేసి వివరాలు కోరారు. డబ్బులు సెక్షన్ ఆఫీసర్‌కి ఎప్పుడో ఇచ్చామని సమాధానం ఇచ్చాడు. తర్వాత ఎఫ్ఆర్ఓ లతను తన ఆఫీస్‌కు పిలిపించుకొని ఇష్టం వచ్చిన రీతిలో దుర్భాషలాడుతూ నీ వల్లనే నా పరువు పోయింది..నువ్వు మెంటల్ హాస్పిటల్‌కు వెళ్లి జాయిన్ అవ్వాలి..అంటూ గంట పాటు మానసికంగా వేధించాడు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన లత రాత్రి 30 నిద్ర మాత్రలు మింగింది. తెల్లవారుజామున భర్త చూడగా అపస్మారక స్థితిలో కన్పించింది. వెంటనే మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై ఎఫ్ఆర్ఓను వివరణ కోరగా తాను ఎఫ్‌బీఓను పిలిపించి మాట్లాడింది నిజమే కాని, వేధింపులకు గురిచేయలేదని అన్నారు. విధుల్లో భర్త జోక్యం ఎక్కువవుతోందని, తగ్గించాలని చెప్పానని అన్నారు.

ఐఐటీల్లో తగ్గిన నియామకాలు

ఆర్థిక మందగమనమే కారణం3



న్యూఢిల్లీ : ప్రపంచవ్యాప్తంగా ఆర్థికాభివృద్ధి నత్తనడక నడుస్తోంది. ఈ వాతావరణం మన దేశంలోనూ కన్పిస్తోంది. ఫలితంగా ప్రతిష్టాత్మక ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీలు)లలో సైతం క్యాంపస్ నియామకాలు తగ్గిపోతున్నాయి. ఐఐటీలలో తుది నియామకాల వారం ఈ నెల 1న ప్రారంభమైంది. గత సంవత్సరంతో పోలిస్తే నియామకాలు 15%-30% మధ్య తగ్గిపోయాయి. నియామకాల ప్రక్రియ ప్రారంభమై వారం రోజులు గడిచినప్పటికీ అనేకమంది విద్యార్థులకు ఇప్పటికీ ఉద్యోగాలు రాలేదు. రాబోయే రోజులలో పరిస్థితి మరింత దారుణంగా ఉండవచ్చునని అంచనా. సాధారణంగా కంప్యూటర్ సైన్స్ కోర్సులు చదివే విద్యార్థులకు పలు రకాల ఉద్యోగాలు లభిస్తుంటాయి. వారికి అనేక ఆఫర్ లెటర్లు కూడా వస్తుంటాయి. కానీ ఈ సంవత్సరం పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. కొందరు విద్యార్థులకైతే ఒక్క ఆఫర్ కూడా రాలేదు. '8-10 మంది విద్యార్థులను తీసుకునే కంపెనీలు ఇప్పుడు ఒకరిద్దరిని మాత్రమే తీసుకుంటున్నాయి. కొన్ని కంపెనీలు క్యాంపస్‌కు వస్తున్నప్పటికీ ఎవరినీ ఉద్యోగంలోకి తీసుకోవడం లేదు' అని ఖరగ్‌పూర్ ఐఐటీకి చెందిన ఓ విద్యార్థి వాపోయాడు. టెక్నాలజీ, కన్సల్టింగ్, ఇతర సేవల రంగాలు సహా పలు రంగాలలో ఆర్థికాభివృద్ధి మందగించడమే ఈ పరిస్థితికి కారణం. ఆర్థిక మార్పిడులు, భౌగోళిక రాజకీయ ఆర్థిక ఆందోళనలు, మాంద్యం భయాలు అంతర్జాతీయంగా ఆర్థిక వృద్ధికి ప్రతిబంధకాలుగా మారాయి. ముఖ్యంగా ఐటీ రంగంలో ఈ పరిస్థితి కొట్టొచ్చినట్లు కన్పిస్తోంది. రాబోయే రెండు మూడు త్రైమాసికాలలో కూడా ఇది కొనసాగవచ్చునని ఫౌండిట్ జాబ్ పోర్టల్ (గతంలో మాన్‌స్టర్) సీఈఓ శేఖర్ గారిస తెలిపారు. ఆటోమొబైల్, రిటైల్, బ్యాంకింగ్ వంటి టెక్నాలజీ యేతర రంగాలు నియామకాలను గణనీయంగా తగ్గించాయి. పాత ఐఐటీలు ఢిల్లీ, బాంబే, కాన్పూర్, మద్రాస్, ఖరగ్‌పూర్, రూర్కీ, గౌహతి, వారణాసిలో కూడా ఆందోళనకర పరిస్థితులు కన్పిస్తున్నాయి. దేశంలో మొత్తం 23 ఐఐటీలు ఉండగా ఇతర సంస్థల కంటే పాత ఐఐటీలు ఎంతో ప్రతిష్టాత్మకమైనవి. ఈ సంస్థలలో ప్రవేశం పొందాలంటే ఎంతో పోటీని ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఈ సంస్థలలో చదివిన విద్యార్థులను ఉద్యోగాలలోకి తీసుకునేందుకు కంపెనీలు పోటీ పడుతుంటాయి. అయితే ఇప్పుడు ఆ వాతావరణం కన్పించడం లేదు. 'ఇది ఓ చక్రం లాంటిది. గతంలో తాకిడి ఎక్కువగా ఉన్నప్పుడు విద్యార్థులను ఉద్యోగాలలో చేర్చుకునేందుకు కంపెనీలు ఒక దానితో మరొకటి పోటీ పడ్డాయి. ఇప్పుడు వేగం మందగించింది. గతంలో తీసుకున్నంత మంది విద్యార్థులు ఇప్పుడు అవసరమా అని ఇతరులు కూడా ప్రశ్నించుకుంటున్నారు' మరో విద్యార్థి చెప్పాడు. ఖరగ్‌పూర్ ఐఐటీలో ఇప్పటి వరకూ ఏడుసార్లు నియామక ప్రక్రియను నిర్వహించారు. 1,181 మంది విద్యార్థులకు ఆఫర్ లెటర్లు అందాయి.

గత సంవత్సరం ఇదే సమయంలో 1,300 మందికి ఆఫర్ లెటర్లు ఇచ్చారు. ఐఐటీ వారణాసి (బీహెచ్‌యూ) గత సంవత్సరం నాలుగు రోజులలోనే వెయ్యి ఆఫర్ లెటర్లు పొందగా ఇప్పుడు 850 లెటర్లు మాత్రమే వచ్చాయి.

ఉక్కిరిబిక్కిరవుతున్న తాత్కాలిక ఉద్యోగులు

- ఢిల్లీలో మితిమీరిన వాయు కాలుష్యమే కారణం

న్యూఢిల్లీ : రాజధాని ఢిల్లీలో అరకొర ఆదాయంతో జీవితాలు నెట్టుకొస్తున్న తాత్కాలిక ఉద్యోగులు మితిమీరుతున్న వాయు కాలుష్యం కారణంగా ఉక్కిరిబిక్కిరవుతున్నారు. రాజధానిలో వాయు నాణ్యత క్షీణిస్తోంది. వాయు నాణ్యత సూచిక పడిపోతుండడంతో శ్వాసకోశ వ్యాధిగ్రస్తుల ఇబ్బందులు చెప్పనలవి కావడం లేదు. ప్రజల ఆరోగ్యంపై వాయు కాలుష్యం తీవ్రమైన ప్రతికూల ప్రభావం చూపుతోంది. కార్మికుల్లో ఉత్పాదక సామర్థ్యం తగ్గిపోతోంది. ఆరోగ్య సంరక్షణపై ఖర్చు పెరుగుతోంది. ముఖ్యంగా డిజిటల్ వేదికలు, యాప్‌లపై ఆధారపడుతూ తాత్కాలిక ఉద్యోగులు చేస్తున్న వారు ఎక్కువగా బహిరంగ ప్రదేశాలలో గంటల తరబడి ప్రయాణించాల్సి వస్తుంది. వీరు పూర్తి స్థాయి ఉద్యోగులు కారు. తాత్కాలిక లేదా అప్పగించిన విధుల ఆధారంగా పని చేస్తూ కుటుంబాలను పోషించుకుంటారు. ఊబర్, రాపిడో వంటి సంస్థల ద్వారా సేవలు అందించే వారు, ఆహార పదార్థాలు సరఫరా చేసే వారు, ఫ్రీలాన్స్ రచయితలు, గ్రాఫిక్ డిజైనర్లు ఈ కోవలోకి వస్తారు. ఇలాంటి పనులు చేసే వారికి ఉద్యోగ భద్రత అంటూ ఏమీ ఉండదు. ఎలాంటి ఉద్యోగ ప్రయోజనాలూ ఉండవు. న్యాయ పరమైన రక్షణ కూడా లభించదు. పైగా వీరు ఎప్పటికప్పుడు వస్తున్న మార్పులకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాల్సి ఉంటుంది. అయినప్పటికీ చేసే పని, దానికి ఉన్న డిమాండ్‌ను బట్టి వేతనం లభిస్తూ ఉంటుంది.



ఎదురులేని ప్రయాణం

ప్రఖ్యాత న్యాయ సలహాదారు, మీడియా వ్యూహకర్త, వ్యవస్థాపకు రాలు ప్రియాంక ఖిమానీ. ఆమె స్థాపించిన ఖిమాని & అసోసియేట్స్ అనే సంస్థ ద్వారా భారతీయ సంగీతంలో పాశ్చాత్య దేశాల ప్రభావం తగ్గించేందుకు ప్రయత్నం చేస్తుంది. అలాగే ప్రపంచ ప్రేక్షకుల ముందు మన దేశ కళాకారులను నిలబెడుతుంది. మన దేశ సంగీతాన్ని విశ్వవ్యాప్తం చేస్తుంది. ఇలా లా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్‌లో ఎదురులేని ప్రయాణం చేస్తున్న ఆమె పరిచయం నేటి మానవిలో...

సంగీతం ఆమె జీవితంలో ఓ అందమైన భాగం. థియేటర్‌కి పరిచయం, పాఠశాల స్థాయి నుండే థియేటర్‌కి పరిచయమయింది. సృజనాత్మక ప్రాజెక్ట్‌లలో పాల్గొనడం మొదలుపెట్టింది. రేడియో ఆర్టిస్టుగా ఎన్నో స్క్రిప్ట్‌లు రచించింది. మోడలింగ్ కూడా చేసింది. ఇంట్లో ఆర్థిక సమస్యల నుండి బయటపడేందుకు ప్రతి రోజు ఎన్నో గంటలు విశ్రాంతి లేకుండా శ్రమించేది. ఓ న్యాయవాదిగా కళాకారుల హక్కుల కోసం ఎంతో కృషి చేస్తున్నది. వినోద రంగంలో న్యాయ సలహాల అవసరాలను తగ్గించాలనే ఉద్దేశంతో నమ్ముతూ లా చేసింది.

స్కూల్ వయసులోనే...

ముంబయిలోని ఓ సాధారణ గుజరాతీ కుటుంబంలో పుట్టి పెరిగింది ప్రియాంక. 'నేను పెరిగిన స్థలం, పరిస్థితులు నా వ్యక్తిత్వాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దాయి. నా తల్లిదండ్రులు చాల్‌లో ఇల్లు కొనుగోలు చేయకముందే మాహిమ్ స్టేషన్ వెలుపల వారు నడుపుతున్న ఫోటోకాపీయింగ్ ('జిరాక్స్' అని వారు పిలుస్తారు) దుకాణం నడుపుతూ నన్ను పెంచారు' అని ఆమె చెబుతుంది. ప్రియాంక ఇప్పుడు అనేక స్థానిక భాషలను అనర్గళంగా మాట్లాడగలదు. చిన్నతనం నుండి విభిన్న నేపథ్యాలు, వర్గాల వ్యక్తులతో కలిసిపోయి వారితో సంభాషించడం వల్లనే ఇది సాధ్యమయింది. 15 ఏండ్ల వయసులో ఆమె తన మొదటి టీవీ షో తమన్నా హౌస్‌కు 60-ఎపిసోడ్ల వరకు థ్రిల్లర్‌ను రాసింది.

సాఫీగా సాగలేదు

కుటుంబ ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రియాంక తాను తీసుకుంటున్న ప్రతి నిర్ణయాన్ని ఆదాయ వనరులకు ఆధారంగా మలుచుకుంది. ముంబైలోని జై హింద్ కాలేజీలో టీవీ షోలకు రాస్తూనే బయోటెక్నాలజీ చదివింది. తర్వాత గవర్నమెంట్ లా కాలేజీలో లా చదువుతున్నప్పుడు ప్లేస్‌మెంట్ వచ్చినపుడు కెరీర్‌తో పాటు జీతం చాలా అవసరం కావడం వల్ల చేరిపోయింది. కానీ ఈ పని ఆమె అనుకున్నట్టుగా లేదు. అయితే ఆమె న్యాయవాద వృత్తి అంతా సాఫీగా సాగలేదు. యువతిగా, మహిళగా ఈ రంగంలో ఎన్నో అడ్డంకులను ఎదుర్కొంది. 'చాలా మందికి న్యాయవాది అంటే ఒక నిర్దిష్ట మూస పద్ధతి ఉంది. నెరిసిన జుట్టు, దూకుడు, వాదన, నక్కజిత్తులు వంటివి ఉండాలని భావిస్తారు. అలాగే మహిళలు ఏదో ఒకవిధంగా పురుషుల నియంత్రణలో ఉండాలని అందరూ ఆశిస్తారు. అలాంటి వారి చేతుల్లో ఉండాలని నేను కోరుకోలేదు' ఆమె అంటుంది.

సమస్యలు పరిష్కరించింది

ఏమైనప్పటికీ ఈ సవాళ్లు ఏవీ ప్రియాంకను ఆపలేకపోయాయి. ఆత్మవిశ్వాసంతో ఆమె ముందుకే వెళ్ళింది. సోను నిగమ్ నుండి లతా మంగేష్కర్ వరకు వినోద పరిశ్రమలోని పెద్ద పెద్ద వారికి చట్టపరమైన సంక్షోభం ఏర్పడినపుడు ఓ న్యాయ వాదిగా పరిష్కరించింది. ఓ లాయర్‌గా ప్రియాంక ప్రయాణం చాలా సంతృప్తికరంగా ఉంది. ఆమె ఏండ్లుగా అధ్యయనం చేసి పరిపూర్ణ జ్ఞానంతో ఎదిగింది. క్లయింట్‌కు వివాదాస్పద విషయాల్లో అవసరమైన సలహా ఇవ్వడం ఆమె ప్రవృత్తిని, వ్యూహరచన చేసే సామర్థ్యాన్ని పదును పెట్టాయి.

భవిష్యత్తు విషయానికొస్తే...

'ఎవరికైనా సలహాదారుగా ఉండాలంటే మనమై వారికి నమ్మకం చాలా ముఖ్యం. క్లయింట్లు మన అనుభవం, జ్ఞానం కోసం మాత్రమే మన వద్దకు వస్తారు. అయితే వారు తమ జీవితంలోని అత్యంత క్లిష్టమైన నిర్ణయాల కోసం మనల్ని కలుస్తారు. మనల్ని వారు విశ్వసిస్తారు. కాబట్టి ఇచ్చే సలహా వారికి ఎంతో అమూల్యమైనది. పరిశ్రమ పరిజ్ఞానం, న్యాయ పరిజ్ఞానంతో క్లయింట్లతో శాశ్వత సంబంధాన్ని పెంపొందించుకోవాలి. మన కోసం ఒక బలమైన పునాదిని నిర్మించుకోవడంలో కష్టపడి పనిచేయడం నేర్చుకోవాలి. కొంత కాలంగా ఆమె సంస్థ మెర్లిన్, సిడి బేబీ, డౌన్‌టౌన్ మ్యూజిక్, బెర్క్లీ కాలేజ్ ఆఫ్ మ్యూజిక్ వంటి ప్రముఖ అంతర్జాతీయ సంస్థలకు మార్గదర్శకత్వాన్ని అందించింది. ఈ విధంగా భారతీయ వినోద పరిశ్రమకు బహుళజాతి ప్రేక్షకుల ప్రాప్యతను పెంచడానికి ఖిమాని చేసిన ప్రయత్నాలు అసమానమైనవి.

అధికంగా అంచనా వేయను

వృత్తితోనే ఆమె ఓపికగా ఉండటం నేర్చుకుంది. ఇంకా దృఢంగా, వ్యూహాత్మకంగా, వాణిజ్యపరంగా ప్రవీణ్యతను సంపాదించింది. 'ఒకరి కీర్తి, జీవితం నా చేతుల్లో ఉన్నాయని నేను ఎప్పుడూ గర్వంగా భావించను. నా నైపుణ్యాన్ని నేను అధికంగా అంచనా వేయను. నన్ను నేను మెరుగులు దిద్దుకునేందుకు నిత్యం కృషి చేస్తూనే ఉంటాను' అంటూ ఆమె వివరించింది. లాభాపేక్షలేని ఉమెన్ ఇన్ మ్యూజిక్ ఇండియా చాప్టర్ చైర్‌పర్సన్‌గా కూడా ఉన్న ప్రియాంక చాలా మంది నుండి ఎన్నో విషయాలు నేర్చుకున్నానని చెబుతుంది. అలాగే రోజువారీ అనుభవాలు, వ్యక్తుల నుండి అపారమైన ప్రేరణను పొందుతుంది.







ఆకంటే అలుసా..?

ఎవరినైనా కూరలో కరివేపాకు లెక్క అని తీసేసి మాట్లాడతారు. కానీ కరివేపాకు మాత్రం తీసేసేది కాదండి... ఇది వంటలకు రుచి, సువాసన ఇవ్వడమే కాదు ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను సైతం అందిస్తుంది. అవేంటో తెలుసుకుందాం.

- శరీరంలోని విష వ్యర్థాల్ని కరివేపాకు తరిమేస్తుంది. జీర్ణ వ్యవస్థను మెరుగుపరుస్తాయి. మలబద్ధకం సమస్యకు చెక్ పెడతాయి.
- డయేరియా సమస్యకు సరైన పరిష్కారం కరివేపాకు. దీనిలో కారిబాజోల ఉంటుంది. అది విరేచనాలకు బ్రేక్ వేస్తుంది. అందుకే ప్రతీ కూరలో కరివేపాకు కచ్చితంగా ఉండేలా చూసుకోవాలి.
- దగ్గు, జలుబులకు చెక్ పెడుతుంది. అందుకే ఈ కాలంలో తప్పక వాడాలి.
- కరివేపాకులో ఫోలిక్ యాసిడ్ ఉంటుంది. ఇది రక్త హీనతను తగ్గిస్తుంది.
- కరివేపాకుల్లో యాంటీఆక్సిడెంట్స్ చాలా ఉంటాయి. అవి బాడీలో షుగర్ లెవెల్స్‌ని కంట్రోల్ చేస్తాయి. డయాబెటిస్ సమస్య ఉన్నవారు కరివేపాకు తింటే ఎంతో మంచిది.
- కిడ్నీ సమస్యలతో బాధపడేవారు కరివేపాకుల్ని ఉడకబెట్టి తాగితే మంచిదే. యూరినరీ సమస్యలకు కూడా కరివేపాకు బాగా పనిచేస్తుంది.
- సరైన పోషకాలు లేని వారికి జుట్టు తెల్లబడుతుంది. అలా జరగకుండా ఉండేందుకు కరివేపాకులు సాయపడతాయి. జుట్టు బాగా పెరిగేందుకు కూడా సహకరిస్తాయి.
- శరీరంలో చెడు కొలెస్ట్రాల్‌ని తగ్గించేందుకు కరివేపాకు బాగా పనిచేస్తుంది. చర్మాన్ని కూడా కాపాడతాయి.

ఇట్ల చేద్దాం

చేపలు కడిగేటప్పుడు శెనగపిండి పట్టించి ఐదు నిమిషాలు ఆగాలి. తర్వాత శుభ్రం చేస్తే నీసు వాసన పోతుంది.



ఎమ్మెల్యేల ప్రమాణం...

సభ్యులు ఎనిమిది మంది సభకు హాజరు కాలేదు. అక్బరుద్దీన్ ఒవైసీ ప్రొటెం స్పీకర్‌గా ఉండడంతో ప్రమాణం చేయబోమని రాజాసింగ్ ప్రకటించిన విషయం తెలిసిందే. స్పీకర్ ఎన్నిక తర్వాత ప్రమాణస్వీకారం చేస్తామని ఆయన ప్రకటించారు.

ప్రమాణం చేయని 18 మంది ఎమ్మెల్యేలు

మొదటి రోజు అసెంబ్లీ సమావేశాల్లో 18 మంది ఎమ్మెల్యేలు ప్రమాణస్వీకారం చేయలేదు. 119 మంది ఎమ్మెల్యేలకు గానూ వంద మంది ఎమ్మెల్యేలు శనివారం ప్రమాణస్వీకారం చేశారు. ప్రొటెం స్పీకర్‌తో కలిపి ఈ సంఖ్య 101. మరో 18 మంది ఎమ్మెల్యేలు ప్రమాణస్వీకారం చేయలేదు. వారిలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్‌ఎల్పీ నేత కె చంద్రశేఖర్‌రావు, మాజీ మంత్రులు కెటి రామారావు, కడియం శ్రీహరి, టి పద్మారావు, తోపాటు మహేశ్వర్ రెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ, వెంకట రమణారెడ్డి, పాడి కౌశిక్ రెడ్డి, కొత్త ప్రభాకర్ రెడ్డి, పైడి రాకేశ్ రెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, పాల్వాయి హరీశ్‌బాబు, పాయల్ శంకర్, రామారావు పవార్, రాజాసింగ్ ఉన్నారు.

ఆంగ్లంలో ప్రమాణం చేసింది వీరే

మొదటి అసెంబ్లీ సమావేశాల్లో 17 మంది ఎమ్మెల్యేలు ఆంగ్లంలో ప్రమాణస్వీకారం చేశారు. ఆంగ్లభాషలో ప్రమాణం చేసిన వారిలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్యేలు లాస్య నందిత, ఎన్ పద్మావతి రెడ్డి, అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల, బండారి లక్ష్మారెడ్డి, గడ్డం వినోద్, మధుసూదన్ రెడ్డి, కేపీ వివేకానంద, కాలేరు వెంకటేశ్, ప్రేమ్‌సాగర్ రావు, లక్ష్మీకాంతరావు, మదన్‌మోహన్ రావు, ముఠా గోపాల్, మైనంపల్లి రోహిత్, తెల్లం వెంకట్రావ్, గడ్డం వివేక్ ఇంగ్లీష్‌లో ప్రమాణం చేసిన వారిలో ఉన్నారు. ఎంఐఎం నుంచి గెలుపొందిన జాఫర్ హుస్సేన్, కౌసర్ మొహియుద్దీన్, జుల్ఫికర్ అలీ, మహమ్మద్ మాజీద్ హుస్సేన్, మహమ్మద్ మొబిన్ ఉర్దూలో ప్రమాణం స్వీకారం చేశారు. మిగిలిన 80 మంది సభ్యులు తెలుగులోనే ప్రమాణం చేశారు. పవిత్ర హృదయంతో ప్రమాణం చేసిన వారు సీతక్క, ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, అరెకపూడి గాంధీ, చిక్కుడు వంశీకృష్ణ, దొంతి మాధవరెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డి, గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, కె శంకరయ్య, కసిరెడ్డి నారాయణరెడ్డి, కవ్వంపల్లి సత్యనారాయణ, కూనంనేని సాంబశివరావు, మాగంటి గోపీనాథ్, వేముల వీరేశం పవిత్ర హృదయంతో ప్రమాణం చేశారు. మిగిలిన సభ్యులంతా దైవసాక్షిగా ప్రమాణస్వీకారం చేశారు.

విపక్ష సభ్యులను పలకరించిన రేవంత్

అసెంబ్లీ సమావేశాల ప్రారంభానికి ముందు సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు విపక్ష సభ్యుల వద్దకు వెళ్లి పలకరించారు. మాజీ మంత్రులు టి హరీశ్‌రావు, గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, పి సబితా ఇంద్రారెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, మల్లారెడ్డి,తలసాని శ్రీనివాస్‌యాదవ్, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి తోపాటు ఎంఐఎం సభ్యులను మర్యాదపూర్వ కంగా కలిసి కరచాలనం చేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రమాణస్వీకారం చేసిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని, ఇతర మంత్రులను మర్యాదపూర్వకంగా కలిసి వెళ్లారు.

14కు అసెంబ్లీ వాయిదా

అసెంబ్లీ సమావేశాలు ఈనెల 14వ తేదీకి వాయిదా పడ్డాయి. మొదటి రోజు ఎమ్మెల్యేల ప్రమాణస్వీకార కార్యక్రమం ముగిసిన అనంతరం సభను వచ్చే గురువారానికి వాయిదా వేస్తున్నట్టు ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ ఒవైసీ ప్రకటించారు.

ప్రమాణస్వీకారాన్ని బహిష్కరించిన బీజేపీ ఎమ్మెల్యేలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అసెంబ్లీలో శనివారం నిర్వహించిన శాసనసభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని బీజేపీ ఎమ్మెల్యేలు మూకుమ్మడిగా బహిష్కరించారు. నూతనంగా ఎన్నికైన ఆ పార్టీ ఎమ్మెల్యేలు తొలుత బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డితో ప్రత్యేకంగా భేటీ అయ్యారు.

ఆయనతో కలిసి చార్మినార్‌లోని భాగ్యలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తర్వాత ఎమ్మెల్యేలంతా కలిసి ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. అక్కడ నుంచి గన్‌పార్కుకు చేరుకున్నారు. అమరవీరుల స్థూపానికి ఏడుగురు ఎమ్మెల్యేలు (రాజాసింగ్ రాలేదు) నివాళులు అర్పించారు. ప్రొటెం స్పీకర్‌గా అక్బరుద్దీన్‌ను నియమించడాన్ని నిరసిస్తూ అసెంబ్లీ గేట్-2 వద్ద వారు నిరసనకు దిగారు. ఐదుగురు సీనియర్ ఎమ్మెల్యేలుండగా అక్బరుద్దీన్‌కు ఎలా అవకాశమిస్తారంటూ నినదించారు. పోలీసులు వారికి నచ్చజెప్పి అక్కడ నుంచి బీజేపీ కార్యాలయానికి తరలించారు. ఆ తర్వాత ఇదే విషయంపై ఫిర్యాదు చేసేందుకు బీజేపీ ఎమ్మెల్యేలంతా రాజ్‌భవన్‌కు వెళ్లారు. అక్కడ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అందుబాటులో లేరు. దీంతో ఆమె కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. సభలో చాలామంది సీనియర్లు ఉన్నప్పటికీ అక్బరుద్దీన్‌ను ప్రొటెం స్పీకర్‌గా నియమించడాన్ని కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లారు.

కిషన్‌రెడ్డితో భేటీ

బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం నాడు నూతనంగా ఎన్నికైన ఎనిమిది మంది ఎమ్మెల్యేలు రాజాసింగ్, పి.హరీశ్‌బాబు, పాయల్ శంకర్, ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, రామారావు పవార్, పాడి రాకేశ్‌రెడ్డి, కె.వెంకటరమణారెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తాలతో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి ప్రత్యేకంగా సమావేశమయ్యారు.

అసెంబ్లీ సమావేశాలు, ప్రమాణ స్వీకారం, ప్రొటెం స్పీకర్‌గా ఓవైసీ ఎంపిక అంశంపై వారు చర్చించారు. ప్రొటెం స్పీకర్ ఎవరున్నా సభకు హాజరుకావడమే సరైనదని కొందరు ఎమ్మెల్యేలు వాదించినట్టు తెలిసింది. ప్రొటెం స్పీకర్‌గా అక్బరుద్దీన్ నియమితులైన దృష్ట్యా తమ ఎమ్మెల్యేలంతా అసెంబ్లీలో శాసనసభ్యుల ప్రమాణ స్వీకారానికి హాజరుకాబోరని రాజాసింగ్ ప్రకటన చేసిన తర్వాత హాజరైతే బాగుండబోదని కిషన్‌రెడ్డి వారించినట్టు సమాచారం. దీంతో ఎమ్మెల్యేలంతా ప్రమాణ స్వీకారాన్ని బహిష్కరించాలనే నిర్ణయానికి వచ్చినట్టు తెలిసింది. బీజేపీ శాసన సభాపక్ష నేతను ఎన్నుకోవడంపైనా చర్చ జరిగినట్టు తెలిసింది.

బీజేపీ ఫ్లోర్ లీడర్ రేసులో రాజాసింగ్, ఏలేటి మహేశ్వర్ రెడ్డి, వెంకటరమణరెడ్డి పేర్లు పరిశీలనలో ఉన్నాయి. పోటీ తీవ్రంగా ఉండటంతో బీజేపీ శాసనసభా పక్ష నేతగా ఎవర్ని నియమించాలనేది ఇప్పుడు ఆ పార్టీ నాయకత్వానికి సవాల్‌గా మారింది. గత శాసనసభలోనూ రఘునందన్‌రావు, ఈటల రాజేందర్, రాజాసింగ్‌లలో ఎవర్ని నియమించాలనే విషయం ఎటూ తేల్చకపోవడంతో శాసనసభాపక్ష నేత లేకుండానే కాలం వెళ్లబుచ్చిన విషయమూ తెలిసిందే.

మంత్రులకు శాఖలు కేటాయింపు

(మొదటిపేజి తరువాయి)

ఇవ్వనున్నారు. త్వరలోనే మంత్రివర్గ విస్తరణ జరిగే అవకాశం ఉందని మంత్రిపదవులు దక్కని ఎమ్మెల్యేలు ప్రమాణస్వీకారం సందర్భంగా అసెంబ్లీ లాబీల్లో అనుకోవడం వినిపించింది. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ సైతం ఇచ్చింది. ప్రకటించిన శాఖల వివరాలిలా ఉన్నాయి.

'చేయూత'తో 90.10 లక్షల కుటుంబాలకు లబ్ధి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలోని నిరుపేదలకు ఆరోగ్య భద్రత కల్పించే రాజీవ్ ఆరోగ్య శ్రీ 'చేయూత' పథకం క్రింద రూ. 10 లక్షల వరకు ఉచితంగా వైద్య సాయం అందించడం వల్ల 90.10 లక్షల కుటుంబాలకు లబ్ధి చూకూరుతుందని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని పేదలందరికీ ఉచితంగా కార్పొరేట్ వైద్యం గుర్తించిన ఆస్పత్రుల్లో లభిస్తుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి శనివారం శాసన సభ ప్రాంగణంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ స్కీం ద్వారా 1,672 వైద్యపరమైన విభిన్న ప్యాకేజీలు అందుబాటులోకి రావడంతో పాటు 21 స్పెషాలిటీ సేవలు కూడా అనారోగ్య బాధితులకు సమకూరుతాయని వివరించారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం ఆరోగ్య శ్రీ హెల్త్ కేర్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు నాణ్యమైన వైద్య సేవలను అందించి, తద్వారా వారికి ఆర్థిక ఇబ్బందులు కలుగకుండా చూడాలనేది ఈ పథకం ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు.

ఛాలెంజ్‌గానే ఆర్థికశాఖ తీసుకున్నా

- ఆర్థికమంత్రి మల్లు భట్టివిక్రమార్క

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణ రాష్ట్రం రూ.ఐదున్నర లక్షల కోట్ల అప్పుల్లో ఉందనీ, ఈ విషయం తెలిసే ఛాలెంజ్‌గా ఆర్థికశాఖను ఎంచుకున్నానని ఆ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారనీ, దాన్ని సరిదిద్దాల్సిన గురుతర బాధ్యత తనతో పాటు ఆ శాఖ అధికారులందరిపై ఉన్నదని చెప్పారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలోని ఆర్థిక శాఖ కార్యాలయంలో శనివారంనాడాయన ఆ శాఖఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు, ఆదాయ వ్యయాలు, అప్పుల గురించి ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి కే రామకష్ణారావు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సంపద సృష్టించి, దాన్ని ప్రజలకు పంచడం కోసం ఆదాయ వనరుల అన్వేషణ కోసం అధికారులు తమ మేధస్సును ఉపయోగించాలని చెప్పారు. ఉద్యోగులుగా కాకుండా రాష్ట్రాభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని కోరారు. రాష్ట్రంలో తాను పాదయాత్ర చేసినప్పుడు అన్ని వర్గాల ప్రజలు చెప్పుకున్న బాధలు విన్న తర్వాత, తెచ్చుకున్న తెలంగాణకు అర్థం లేదని భావించానన్నారు. వారి సమస్యలను పరిష్కరించేందుకే కాంగ్రెస్‌పార్టీ ఆరు గ్యారెంటీల అభయహస్తాన్ని మ్యానిఫెస్టోలో ప్రకటించామన్నారు. ఇండ్లు లేక కొందరు, కొలువులు లేక నిరుద్యోగులు, ఉన్నత చదువులు చదివించలేక విద్యార్థుల తల్లిదండ్రులు, ఉన్నత చదువులు చదివిన కొలువులు రాకపోవడంతో పెళ్లిళ్లలో క్యాటరింగ్ సప్లయర్స్‌గా వెళ్లి పనిచేస్తున్న యువత దుస్థితిని పాదయాత్రలో చూశానని చెప్పుకున్నారు. ఉచితాలను ప్రజలకు ప్రభుత్వాలు ఫ్రీగా ఇవ్వడం లేదనీ, మానవ వనరులపై పెట్టుబడి పెడుతున్నామనే భావించాలని అన్నారు. దానివల్ల జీడీపీ పెరుగుతుందని వివరించారు. సమావేశంలో ఆర్థిక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కే రామకృష్ణారావు, సెక్రటరీ టీకే శ్రీదేవి, జాయింట్ సెక్రటరీలు కష్ణ భాస్కర్, కే హరిత, అడిషనల్ సెక్రటరీ ఆర్ రవి తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి, ఆరోగ్యశ్రీ పథకాలకు శ్రీకారం

(మొదటిపేజి తరువాయి)

ఆనందంగా ఉందని చెప్పారు. తెలంగాణను సంక్షేమ , అభివృద్ధి రాజ్యంగా మారుస్తామని రేవంత్ అన్నారు.

జీరో ఛార్జీ టికెట్, ఆరోగ్యశ్రీ లోగో ఆవిష్కరణ

ఈ సందర్భంగా మహాలక్ష్మి ఉచిత ప్రయాణం కోసం జీరోఛార్జీ టికెట్‌ను, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం లోగో, పోస్టర్‌ను సీఎం ఆవిష్కరించారు. పథకాల ప్రారంభం అనంతరం సీఎం రేవంత్, మంత్రులు, ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ ఒవైసీ, సీఎస్ శాంతికుమారి, డీజీపీ రవిగుప్తా , ఆర్టీసీ ఎండీ సజ్జనార్, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఇతర అధికారులు కలిసి అసెంబ్లీ ఆవరణ నుంచి ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వరకు బస్సులో ప్రయాణం చేశారు. సీఎం రూ. 10 చెల్లించి కండక్టర్ నుంచి టికెట్ తీసుకున్నారు.

పాల్గొన్న మంత్రులు, ప్రముఖులు

మహాలక్ష్మి, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాల ప్రారంభోత్సవంలో మంత్రులంతా పాల్గొన్నారు. సీఎం రేవంత్‌తోపాటు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్‌గౌడ్, ఎన్.ఉత్తమ్‌కుకమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దనసరి అనసూయ సీతక్క, దామోదర రాజనరసింహ, కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు వచ్చారు. అలాగే సీఎస్, డీజీపీ, వైద్యఆరోగ్య శాఖ ముఖ్యకార్యదర్శి రిజ్వీ, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ అశోక్‌రెడ్డి, డైరెక్టర్ రాజమౌళి తదితరులు హాజరయ్యారు.

వాకర్ సాయంతో నడిచిన కేసీఆర్

(మొదటిపేజి తరువాయి)

ఆయన హైదరాబాద్ సోమాజిగూడలోని యశోద ఆస్పత్రిలో వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు. గాయం నుంచి క్రమంగా కోలుకుంటున్నారు. శస్త్రచికిత్స తర్వాత కేసీఆర్‌ను వైద్యులు శనివారం నడిపించారు. వారి సూచనల మేరకు వాకర్ సాయంతో బీఆర్‌ఎస్ అధినేత మెల్లగా అడుగులు వేశారు. ఇందుకు సంబంధించిన వీడియోని ఆ పార్టీ ఎక్స్ వేదికగా షేర్ చేసింది. ఇది చూసిన నెటిజన్లు, పలువురు రాజకీయ ప్రముఖులు కేసీఆర్ త్వరగా కోలుకుని ప్రజా సేవలోకి రావాలని ఆకాంక్షిస్తున్నారు.

శస్త్రచికిత్స తర్వాత కేసీఆర్ ఆరోగ్యం మెరుగుపడిందని యశోద కన్సల్టెంట్ డాక్టర్ ప్రవీణ్ రావు తెలిపారు. త్వరితగతిన కోలుకునేందుకు అనుకూలంగా ఆయన శరీరం సహకరిస్తోందని చెప్పారు. మానసికంగా కూడా కేసీఆర్ దృఢంగా ఉన్నారని వెల్లడించారు. మరో రెండు,మూడు రోజుల్లో ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఆరు నుంచి ఎనిమిది వారాల విశ్రాంతి అవసరమన్నారు. తుంటి మార్పిడి శస్త్ర చికిత్స చేసిన పేషెంట్ల ను వారి వారి శారీరక, మానసిక సామర్థ్యాన్ని పరిశీలించి వారిని "మొబిలైజేషన్ స్టార్ట్" చేస్తారని చెప్పారు. ఇందులో భాగంగా కేసీఆర్ బెడ్ బయటకు తీసుకొచ్చి కూర్చొబెట్టి వాకర్ సాయంతో నడిపించే ప్రయత్నం చేసినట్టు తెలిపారు. " కేసీఆర్ గారి ఆరోగ్య పరిస్థితిలో ప్రోగ్రెస్ బాగుంది. చాలా వేగంగానే రికవరీ అవుతున్నారు. వాకర్‌తో బెడ్ బయటకు వచ్చి కూర్చున్నారు. వాకర్ సాయంతో మేము రూమ్‌లో నడిపించే ప్రయత్నం చేసినప్పుడు కేసీఆర్ శరీరం బాగా స్పందించింది. అక్కడ రూమ్ లో వాకర్ సాయం తో నడిచారు. దీన్ని మెడికల్ పరిభాషలో " మొబిలైజేషన్ స్టార్ట్" అంటారు. హిప్ రీప్లేసెమెంట్ జరగ్గానే పేషెంట్ ను నడిపించే ప్రయత్నం చేస్తాం. వారు ఆపరేషన్ నొప్పి తగ్గి "మినిమం పెయిన్" తో కోలుకుంటున్నారు. బ్రీతింగ్ ఎక్సర్‌సైజ్‌లు కూడా చేయిస్తున్నాం. మెడికల్‌గా స్టేబుల్ గా ఉన్నారు. కేసీఆర్ బాడీ బాగా సహకరిస్తున్నది. సాధారణ ఆహారం తీసుకుంటున్నారు. మరికొద్ది రోజుల పాటు ఫిజియో థెరపీ కొనసాగించాల్సి వుంటుంది. ఇలానే శరీరం సహకరిస్తే మరో రెండు మూడు రోజుల్లో కేసీఆర్ డిశ్చార్జ్ చేస్తాము" అని డాక్టర్ ప్రవీణ్ రావు వెల్లడించారు.

పారిశ్రామిక, ఐటీ రంగాల్లో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలుపుతాం.. : మంత్రి శ్రీధర్‌బాబు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పారిశ్రామిక, ఐటీ రంగాల్లో తెలంగాణ రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలుపుతామని పరిశ్రమలు, ఐటీ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. శనివారం అసెంబ్లీ ఆవరణలో ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో యూపీఏ ప్రభుత్వం ప్రకటించిన ఐటీఐఆర్ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర ప్రభుత్వంతో చర్చిస్తారని వెల్లడించారు.ఫార్మాసిటీ విషయంలో ప్రజలు ఆలోచనలు కూడా పరిగణనలోకి తీసుకుని ఓ నిర్ణయానికి వస్తామన్నారు.శాసన సభలో మంచి ఫలవంతమైన చర్చలు జరిగేలా చూస్తామని తెలిపారు.

కాసుల వర్షం

- కాశ్వీ, అనాబెల్‌కు రూ. 2 కోట్లు
- వృందాకు రూ. 1.3 కోట్లు
- డబ్ల్యూపీఎల్ ప్లేయర్స్ వేలం




నవతెలంగాణ-ముంబయి

మహిళల ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) వేలంలో భారత యువ క్రికెటర్ల కాసుల పంట పండింది. డబ్ల్యూపీఎల్ తొలి వేలంలో నిరాశ ఎదురైనా.. ఏడాది కాలంగా కఠోర సాధన చేసిన కాశ్వీ గౌతమ్, వృందా దినేశ్‌లు కండ్లు చెదిరే బిడ్లు దక్కించుకున్నారు. పేస్ ఆల్‌రౌండర్ కాశ్వీ గౌతమ్ రూ. 2 కోట్లకు గుజరాత్ జెయింట్స్ సొంతమవగా, డ్యాషింగ్ బ్యాటర్ వృందా దినేశ్ రూ. 1.3 కోట్లకు యూపీ వారియర్స్ శిబిరంలో చేరింది. అన్‌క్యాప్డ్ ప్లేయర్లుగా వేలంలోకి వచ్చిన ఈ ఇద్దరు అత్యధిక ధరతో అందరి దృష్టిని ఆకర్షించారు. ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ అనాబెల్ సుదర్‌లాండ్ సైతం రూ.2 కోట్లు దక్కించుకుంది. అత్యధిక మొత్తం సొంతం చేసుకున్న విదేశీ ప్లేయర్‌గా నిలిచింది. డబ్ల్యూపీఎల్ మినీ వేలం శనివారం ముంబయిలో జరిగింది.



ఢిల్లీ క్యాపిటల్స్ సొమ్మంతా సుదర్‌లాండ్‌పై పెట్టేసింది. ఆమె కోసం రూ. 2 కోట్లు వెచ్చించిన క్యాపిటల్స్ అందుబాటులో ఉన్న పర్సులో ఏకంగా 88 శాతం ఖర్చు చేసింది. శ్రీలంక కెప్టెన్ చమరి ఆటపట్టు రూ. 30 లక్షల కనీస ధరతో వేలంలోకి రాగా.. ఎవరూ ఆసక్తి చూపలేదు. విండీస్ మాజీ కెప్టెన్ డాటిన్, ఆసీస్ ఆల్‌రౌండర్ కిమ్ గార్త్‌లకు సైతం వేలంలో నిరాశే ఎదురైంది. భారత క్రికెటర్లు ఏక్తా బిస్త్ రూ. 60 లక్షలు, వేద కృష్ణమూర్తి, సబ్బినేని మేఘన రూ. 30 లక్షలు దక్కించుకున్నారు. తొలి సీజన్‌లో రూ. 1.6 కోట్ల దక్కించుకున్న దేవిక వైద్య.. ఈ సారి బిడ్లను ఆకర్షించలేదు. షబ్నిమ్ ఇస్మాయిల్ (దక్షిణాఫ్రికా) కోసం ముంబయి ఇండియన్స్ రూ. 1.2 కోట్లు వెచ్చించగా.. ఆసీస్ బ్యాటర్ లిచ్‌ఫీల్డ్‌ను రూ. 1 కోటితో గుజరాత్ జెయింట్స్ సొంతం చేసుకుంది. ఇక తెలుగమ్మాయి త్రిష పూజిత రూ. 10 లక్షల కనీస ధరకు గుజరాత్ జెయింట్స్ గూటికి చేరుకుంది. ఇక మహిళల ప్రీమియర్ లీగ్ రెండో సీజన్ 2024 ఫిబ్రవరిలో జరుగనుంది. ముంబయి, బెంగళూర్‌లలోని ఏదేని నగరం సీజన్ మొత్తానికి ఆతిథ్యం ఇవ్వనుంది.

ఇక ధనాధన్



- భారత్, దక్షిణాఫ్రికా తొలి టీ20 నేడు
- ఇరు జట్ల నుంచి బరిలో యువ ఆటగాళ్లు

రాత్రి 7.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..



ఇటు భారత్, అటు దక్షిణాఫ్రికా.. 2024 టీ20 ప్రపంచకప్ ముంగిట ఆడనున్న సన్నాహక మ్యాచులు ఆరు టీ20లు. భారత్‌తో సిరీస్ అనంతరం సఫారీ ఏకంగా ప్రపంచకప్ జట్టును ప్రకటించనుంది. భారత్‌కు అఫ్గనిస్థాన్‌తో సిరీస్ సైతం ఉంది. రెండు జట్లు ఐపీఎల్, ఎస్‌ఏ20 లీగ్‌ల్లో ప్రదర్శనను సైతం పరిగణనలోకి తీసుకుంటాయి. ఇరు జట్లలో సీనియర్లు దూరమైన వేళ కుర్ర క్రికెటర్లు ప్రపంచకప్ జట్టులో బెర్త్‌పై కన్నేసి బరిలోకి దిగుతున్నారు. భారత్, దక్షిణాఫ్రికా తొలి టీ20 పోరు నేడు.

నవతెలంగాణ-డర్బన్

సెలక్షన్ డైలామా!

టీమ్ ఇండియా తుది జట్టు కూర్పుపై కుస్తీ పడుతోంది. శుభ్‌మన్ గిల్ రాకతో ఓపెనింగ్ జోడీ ఎవరనేది ఉత్కంఠగా మారింది. ఆసీస్‌తో సిరీస్‌లో యశస్వి జైస్వాల్, రుతురాజ్ గైక్వాడ్ రాణించారు. రుతురాజ్ ఓ మ్యాచ్‌లో శతకంతో చెలరేగాడు. యశస్వి పవర్‌ప్లేలో పవర్‌ఫుల్ ప్రభావం చూపించాడు. గిల్ ఓపెనర్‌గా వస్తే ఈ ఇద్దరిలో ఒకరు బెంచ్‌కు పరిమితం కావాల్సి ఉంటుంది. శ్రేయస్ అయ్యర్ వైట్‌బాల్ ఫార్మాట్‌లో దూకుడు చూపిస్తున్నాడు. వేగంగా పరుగులు సాధిస్తున్నాడు. అయినా, యువ క్రికెటర్ తిలక్ వర్మకు ఈ ఫార్మాట్‌లో అవకాశం ఇవ్వాలనే వాదన బలంగా వినిపిస్తోంది. బ్యాటింగ్ లైనప్‌లో కుడి-ఎడమ కాంబినేషన్‌కు సైతం తిలక్ వర్మ ఉపయుక్తం. సూర్య కుమార్, రింకూ సింగ్‌లు మంచి ఫామ్‌లో ఉన్నారు. యువ వికెట్ కీపర్ జితేశ్ శర్మ కంగారూలపై ఖతర్నాక్ ప్రదర్శన చేశాడు. క్రీజులోకి వచ్చీ రాగానే దంచికొడ్తున్నాడు. జితేశ్‌కు మరిన్ని అవకాశాలు కల్పించేందుకు జట్టు మేనేజ్‌మెంట్ సముఖంగా కనిపిస్తోంది. స్పెషలిస్ట్ స్పిన్నర్‌గా వరల్డ్ నం.1 రవి బిష్ణోయ్‌తో చైనామన్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ పోటీపడుతున్నాడు. ఆసీస్‌తో సిరీస్‌లో బిష్ణోయ్ అత్యధిక వికెట్లు కూల్చాడు. సఫారీలపైనా ప్రభావం చూపేందుకు సిద్ధమవుతున్నాడు. మరోవైపు కుల్దీప్ యాదవ్ సైతం భీకర ఫామ్‌లో ఉన్నాడు. ఈ ఇద్దరిలో ఎవరు తుది జట్టులో నిలుస్తారో చూడాలి. మహ్మద్ సిరాజ్, అర్షదీప్ సింగ్, ముకేశ్ కుమార్‌లలో ఒకరు బెంచ్‌కు పరిమితం కావాల్సి ఉంటుంది. రవీంద్ర జడేజా, దీపక్ చాహర్‌లు ఆల్‌రౌండర్లుగా జట్టులో నిలువనున్నారు!.

భలే మంచి ఛాన్స్!

టీ20 ప్రపంచకప్ ముంగిట వెస్టిండీస్‌తో సఫారీలు మరో మూడు టీ20లు ఆడాల్సి ఉంది. కానీ ఆ సిరీస్‌లో ప్రపంచ కప్ జట్టే తలపడనుంది. దీంతో వరల్డ్‌కప్ రేసులో నిలిచేందుకు, సత్తా చాటేందుకు సఫారీ క్రికెటర్లకు ఇదే చివరి అవకాశం. దీంతో భారత్‌తో సిరీస్‌లో ఆకాశమే హద్దుగా చెలరేగేందుకు సిద్ధమవుతున్నారు. రీజా హెండ్రిక్స్, స్టబ్స్, ఫెరీరా, మార్కో జాన్సెన్ సహా జెరాల్డ్, బర్గర్‌లు వరల్డ్‌కప్ బెర్త్‌పై కన్నేశారు. స్వదేశంలో అనుకూల పరిస్థితుల్లో మెరిస్తే.. ప్రపంచకప్ జట్టు రేసులో నిలిచేందుకు అవకాశం ఎక్కువ. కెప్టెన్ ఎడెన్ మార్క్‌రామ్, డెవిడ్ మిల్లర్ సైతం తమదైన జోరు చూపించాలని ఎదురు చూస్తున్నారు. గత సీజన్ ఎస్‌ఏ20లో మార్క్‌రామ్ పరుగుల మోత మోగించాడు. కొన్నాండ్లుగా ఈ ఫార్మాట్‌లో మిల్లర్ అద్భుతాలు చేస్తున్నాడు. ఈ జోడీ బ్యాట్‌తో అంచనాలు అందుకుంటే.. సఫారీలకు బ్యాటింగ్ లైనప్‌లో కష్టాలు ఉండవు. షంషి, కేశవ్ మహరాజ్‌లు భారత్‌పై మాయ చేసేందుకు చూస్తుండగా.. జాన్సెన్, జెరాల్డ్‌లు పేస్ సత్తా చాటనున్నారు.

రూ.450 కోట్లు ఆర్జన!

దక్షిణాఫ్రికా క్రికెట్ బోర్డు క్రిస్మస్‌ను ముందే జరుపుకోనుంది. మూడు ఫార్మాట్ల పర్యటనకు భారత జట్టు రావటంతో.. ఆ దేశ క్రికెట్ బోర్డు రానున్న 20 రోజుల్లో ఏకంగా రూ.450 కోట్లు ఆర్జించనుంది. మూడు టీ20లు, మూడు వన్డేలు, రెండు టెస్టులు భారత జట్టు ఇక్కడ ఆడనుంది. తొలి టీ20 మ్యాచ్‌కు ఇప్పటికే టికెట్లు పూర్తిగా అమ్ముడయ్యాయి. సిరీస్‌లో మిగతా మ్యాచులకు సైతం టికెట్లు హాట్ కేకుల్లా అమ్ముడు కానున్నాయి. దీంతో పండుగ సీజన్‌లో సఫారీ క్రికెట్ బోర్డు కాసుల పంట పండనుంది.

పిచ్, వాతావరణం

డర్బన్‌లో నేడు ఉదయం వర్షం కురిసే అవకాశం ఉంది. మధ్యాహ్నం వరకు చిరుజల్లులు కొనసాగనున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. మ్యాచ్ సమయంలో వర్షం సూచనలు లేకపోయినా వాతావరణం మేఘావృతమై ఉండనుంది. దీంతో తొలి ఇన్నింగ్స్‌లో పేసర్లు వికెట్ల వేటలో ప్రభావం చూపనున్నారు. ఇక్కడ గతంలో ఆసీస్‌తో మ్యాచుల్లో తొలి ఇన్నింగ్స్‌ల్లో 190 పైచిలుకు పరుగులు నమోదయ్యాయి. నేడు భారత్, సఫారీ టీ20లోనూ భారీ స్కోర్లకు అవకాశం ఉంది. ఇక్కడ టాస్ ప్రభావం పెద్దగా ఉండదు.

తుది జట్లు (అంచనా)

భారత్ : యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్/రుతురాజ్ గైక్వాడ్, శ్రేయస్ అయ్యర్, సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), రింకూ సింగ్, జితేశ్ శర్మ (వికెట్ కీపర్), రవీంద్ర జడేజా, దీపక్ చాహర్, కుల్దీప్ యాదవ్/రవి బిష్ణోయ్, మహ్మద్ సిరాజ్, అర్షదీప్ సింగ్/ముకేశ్ కుమార్.

దక్షిణాఫ్రికా : హెండ్రిక్స్, మాథ్యూ మార్క్‌రామ్ (కెప్టెన్), క్లాసెన్ (వికెట్ కీపర్), డెవిడ్ మిల్లర్, ఫెరీరా, మార్కో జాన్సెన్, కేశవ్ మహరాజ్, జెరాల్డ్, బర్గర్, షంషి.

జోనల్ క్రికెట్ షురూ

- గ్రామీణ క్రికెట్‌కు పెద్ద పీట
- హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్



హైదరాబాద్ : 12 ఏండ్లుగా కనుమరుగైన ప్రతిష్టాత్మక జోనల్ క్రికెట్‌ను హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్ రావు శనివారం పున ప్రారంభించారు. రంజీ ట్రోఫీకి హెచ్‌సీఏ జట్టుకు ఈ టోర్నీలో సత్తా చాటిన కుర్రాళ్లను ఎంపిక చేస్తారు. హైదరాబాద్, ప్రెసిడెంట్, రెస్ట్ ఎలెవన్‌లు గ్రూప్-ఏలో ఉండగా.. సికింద్రాబాద్, సెక్రటరీ, డిస్ట్రిక్స్ ఎలెవన్ గ్రూప్-బిలో పోటీపడుతున్నాయి. ఫైనల్ మ్యాచ్ ఈ నెల 22 నుంచి ఉప్పల్ స్టేడియంలో జరుగనుంది. సికింద్రాబాద్‌లోని జింఖానా గ్రౌండ్స్‌లో సికింద్రాబాద్, సెక్రటరీ ఎలెవన్ మధ్య మ్యాచ్‌ను టాస్ వేసి జగన్‌మోహన్ రావు ప్రారంభించారు. 'హెచ్‌సీఏ కేవలం హైదరాబాద్‌కు పరిమితం కాదు. 33 జిల్లాల్లోనూ క్రికెట్‌ను సమాంతరంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. ఇక నుంచి జిల్లా స్థాయిలో టోర్నమెంట్లు, శిక్షణ శిబిరాలు నిర్వహిస్తాం. హెచ్‌సీఏ జట్లలో గ్రామీణ క్రికెటర్లు కనీసం 50 శాతం వరకు ఉండేలా చర్యలు తీసుకుంటాను. హైదరాబాద్ క్రికెట్‌ను దేశంలోనే అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తానని' జగన్‌మోహన్ రావు తెలిపారు.

డిసెంబర్ 21న ఎన్నికలు

రెజ్లింగ్ సమాఖ్యపై రిటర్నింగ్ ఆఫీసర్



న్యూఢిల్లీ : భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) ఎన్నికలు ఎట్టకేలకు జరుగనున్నాయి. గతంలో పంజాబ్, హర్యానా హైకోర్టు విధించిన స్టే ఆర్డర్‌ను సుప్రీంకోర్టు తొలగించటంతో.. ఎన్నికలకు మార్గం సుగమం అయ్యింది. డిసెంబర్ 21న ఎన్నికలు, కౌంటింగ్, ఫలితాల వెల్లడికి తాజాగా రిటర్నింగ్ ఆఫీసర్ నోటీఫికేషన్ విడుదల చేశారు. ఆగస్టు 12న ఎన్నికలకు రంగం సిద్ధం కాగా.. ఒక్క రోజు ముందు నిలుపుదల ఆదేశాలతో ప్రక్రియ అక్కడితో నిలిచిపోయింది. పర్యావసానంగా డబ్ల్యూఎఫ్ఐపై అంతర్జాతీయ రెజ్లింగ్ సమాఖ్య సస్పెన్షన్ వేటు సైతం వేసింది. డిసెంబర్ 21న ఎన్నికలు, ఫలితాలు.. పంజాబ్, హర్యానా హైకోర్టు ముందున్న రిట్ పిటిషను తీర్పుకు లోబడి ఉంటాయని రిటర్నింగ్ ఆఫీసర్ విశ్రాంత న్యాయమూర్తి ఎం.ఎం కుమార్ తెలిపారు. ఆగస్టు 7 నాటికి ఓటర్ల జాబితా ఖరారు కావటంతో.. ఇప్పుడు ఆ తర్వాత ప్రక్రియ మాత్రమే ఉంటుందని నోటిఫికేషన్‌లో స్పష్టం చేశారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల జాబితా సైతం ఆగస్టు 7 నాటిదే అంతిమమని పేర్కొన్నారు. దీంతో ఇక నేరుగా ఓటింగ్‌కు ఏర్పాట్లు చేయనున్నారు. న్యూఢిల్లీలోని ఒలింపిక్ భవన్‌లో పోలింగ్ జరుగుతుందని రిటర్నింగ్ ఆఫీసర్ వెల్లడించారు. బిజెపి ఎంపీ, డబ్ల్యూఎఫ్ఐ మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్ మహిళా అథ్లెట్లను లైంగికంగా వేధించాడని, అతడిపై చర్యలు తీసుకోవాలని భారత స్టార్ రెజ్లర్లు జంతర్ మంతర్ వద్ద సుమారు రెండు నెలల పాటు నిరసన చేపట్టిన సంగతి తెలిసిందే.

ముగిసిన జిమ్నాస్టిక్స్ పోటీలు



హైదరాబాద్ : రంగారెడ్డి జిల్లా 27వ జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్స్ శనివారం ముగిశాయి. సుచిత్రలోని విజె జిమ్నాస్టిక్స్ అకాడమీలో జరిగిన పోటీల్లో గర్ల్స్, బాయ్స్ విభాగాల్లో కలిపి సుమారు 500 మంది జిమ్నాస్ట్‌లు పోటీపడ్డారు. డిసిపి సత్యనారాయణ, సిఎంఆర్ స్కూల్ ప్రిన్సిపాల్ ఉమ, జిమ్నాస్టిక్స్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్‌పాల్ రెడ్డి తదితరులు విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

నవచిత్రం

ఘనంగా తండేల్ ప్రారంభం



నాగ చైతన్య అక్కినేని, దర్శకుడు చందూ మొండేటి కాంబినేషన్‌లో గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాసు నిర్మించనున్న క్రేజీ ప్రాజెక్ట్ 'తండేల్'. శనివారం ఈ సినిమా గ్రాండ్‌గా ముహూర్తం వేడుకను జరుపుకుంది. నాగార్జున, వెంకటేష్‌తోపాటు పలువురు సినీ ప్రముఖులు ఈ పూజా కార్యక్రమానికి హాజరయ్యారు.

ముహూర్తం షాట్‌కు నాగార్జున కెమెరా స్విచాన్ చేయగా, వెంకటేష్ క్లాప్ ఇచ్చారు. అల్లు అరవింద్ స్క్రిప్ట్‌ను దర్శకుడికి అందజేశారు. ఈ సందర్భంగా అల్లు అరవింద్ మాట్లాడుతూ, 'మా హీరో, దర్శకుడు ఎప్పుడు షూటింగ్ అనే కంగారు లేకుండా, ఈ కథని మనం అనుకున్న స్థాయిలో అద్భుతంగా చూపించాలనే దానిపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఈ కథని ఒక వరల్డ్‌లోకి తీసుకెళ్ళి చూపించాలి. ఆ వరల్డ్ క్రియేట్ చేయడానికి అన్ని జాగ్రత్తలు తీసుకున్నాం. నాగచైతన్యకు సరైన జోడిగా సాయిపల్లవి వచ్చారు' అని తెలిపారు.

'ఏడాదిన్నరగా కథపై వర్క్ చేశాం. వాసు, అరవింద్ అద్భుతంగా ప్రోత్సహించారు. నాగచైతన్య, సాయి పల్లవి, మిగతా టెక్నీషియన్స్ అందరూ బెస్ట్ ఇవ్వడానికి రెడీ అయిపోయారు. వాళ్ళంతా నన్ను ఎంతగానో మోటివేట్ చేస్తున్నారు' అని దర్శకుడు చందూ మొండేటి చెప్పారు.

సాయి పల్లవి మాట్లాడుతూ, 'దర్శకుడు, రచయిత, నిర్మాతలు అందరికీ ఈ సినిమా పట్ల ఒక విజన్ ఉంది. ఆ విజన్ మీ అందరికీ సరిగ్గా చేరుతుందని ఆశిస్తున్నాను' అని అన్నారు. 'ఇది ప్రతి సినిమాలా కాదు. చాలా ప్రత్యేకమైనదని, బలమైన కథ, కావాల్సిన సమయం తీసుకొని పక్కాగా ప్లాన్ చేసుకొని వెళ్దామని అరవింద్ ముందు నుంచి మమ్మల్ని ఎంతగానో ప్రోత్సహించారు. కథకు కావాల్సిన బడ్జెట్, సపోర్ట్ ఇస్తున్న ఆయనకు ధన్యవాదాలు. నా కెరీర్‌లో గుర్తుండిపోయే సక్సెస్ 100% లవ్ అరవిందే ఇచ్చారు. ఇప్పుడు ఈ చిత్రాన్ని ఆయన నిర్మించడం చాలా ఆనందంగా ఉంది. అలాగే వాసుకి ధన్యవాదాలు. చందూ దర్శకుడిగా కంటే నాకు మంచి స్నేహితుడు. తనతో ప్రతి విషయాన్ని ఓపెన్‌గా చర్చించగలుగుతాను. మా ఇద్దరం కలసి చేస్తున్న మూడో సినిమా ఇది. సాయి పల్లవి చాలా పాజిటివ్ ఎనర్జీ ఉన్న యాక్టర్. తను ఈ సినిమాలో భాగం కావడం ఆనందంగా వుంది. దేవిశ్రీ ప్రసాద్, షామ్‌దత్, శ్రీనాగేంద్ర ఇలా అద్భుతమైన టీం ఈ చిత్రానికి పని చేస్తుంది. ఈనెల 15 తర్వాత షూటింగ్ స్టార్ట్ చేస్తున్నాం' అని హీరో నాగ చైతన్య చెప్పారు.

నిర్మాత బన్నీ వాసు మాట్లాడుతూ, 'ఇది గీతాఆర్ట్స్‌కి చాలా ప్రత్యేకమైన స్క్రిప్ట్. ఇంత రీసెర్చ్ ఏ సినిమాకి జరిగి ఉండదు. చందు కథని అద్భుతంగా మలిచారు. ఆయనకి హ్యాట్సాఫ్ చెప్పాలి. ఇందులో చైతూది ఫిషర్ మ్యాన్ క్యారెక్టర్. దీనికి చైతు స్కిన్ టోన్‌తో పాటు అన్నీ ఎలా కుదురుతాయో అనే ఆలోచన ఉండేది. అయితే 'తండేల్' ఫస్ట్ లుక్ చూసి ఆడియన్స్‌తో పాటు నేను షాక్ అయ్యాను' అని అన్నారు.

డంకీ కోసం స్పెషల్ సాంగ్



షారూక్ ఖాన్

షారూక్ ఖాన్, డైరెక్టర్ రాజ్‌కుమార్ హిరానీ కాంబినేషన్‌లో రూపొందిన చిత్రం 'డంకీ'. ప్రపంచ వ్యాప్తంగా ఈ సినిమా ఈనెల 21న గ్రాండ్ రిలీజ్ అవుతుంది. అనౌన్స్‌మెంట్ రోజు నుంచి అంచనాలను పెంచుతున్న ఈ మూవీ నుంచి 'డంకీ డ్రాప్ 4' అంటూ ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. దీంతో అంచనాలు నెక్స్ట్ రేంజ్‌కి చేరుకున్నాయి. డైరెక్టర్ రాజ్ కుమార్ హిరాని అందరి హృదయాలను ఆకట్టుకునేలా ఈ చిత్రాన్ని తెరకెక్కించిన తీరుని అందరూ అప్రిషియేట్ చేస్తున్నారు. ఈ ఎక్స్‌పెక్టేషన్స్‌ను మరింత పెంచేలా ఈ సినిమా కోసం స్పెషల్ సాంగ్‌ను యు.ఎ.ఇలో చిత్రీకరించారు. మూవీ ప్రమోషన్స్ కోసం ఈ డాన్స్ నెంబర్‌ను మేకర్స్ చిత్రీకరించారని తెలుస్తోంది. 'షారూక్, హిరానీ కలిసి ఈ స్పెషల్ సాంగ్ ప్లాన్ చేశారు. పరిమితమైన క్రూ సాయంతో అబుదాబి సరిహద్దు ప్రాంతాల్లో పాటను చిత్రీకరించారు. యు.ఎ.ఇలో షారూక్‌కి మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ ఉండటంతో భారీ సంఖ్యలో అభిమానులు అక్కడకు చేరుకున్నారు' అని చిత్ర యూనిట్ తెలిపారు.

ఈ చిత్రంలో బోమన్ ఇరాని, తాప్సీ పన్ను, విక్కీ కౌశల్, విక్రమ్ కొచ్చర్, అనీల్ గ్రోవర్ వంటి టాలెంటెడ్ ఆర్టిస్టులు ప్రేక్షకులను మెప్పించటానికి సిద్ధమవుతున్నారు. ఏ జియో స్టూడియోస్, రెడ్ చిల్లీస్ ఎంటర్‌టైన్మెంట్, రాజ్‌కుమార్ హిరాణి ఫిల్మ్స్ బ్యానర్స్ సమర్పణలో రాజ్ కుమార్ హిరాణి, గౌరి ఖాన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అభిజీత్ జోషి, రాజ్ కుమార్ హిరాణి, కణిక ధిల్లాన్ ఈ చిత్రానికి రచయితలు. ఈ చిత్రం క్రిస్మస్ సందర్భంగా ప్రపంచ వ్యాప్తంగా భారీ ఎత్తున ఈనెల 21న రిలీజ్ అవుతుంది.

అందర్నీ నవ్వించే నమో..



విశ్వంత్ దుద్దంపూడి, అనురూప్ కటారి హీరోలుగా, విస్మయ హీరోయిన్‌గా శ్రీ నేత్ర క్రియేషన్స్, ఆర్బ్ ఫిల్మ్ ఫ్యాక్టరీ బ్యానర్ల పై ఏ.ప్రశాంత్ నిర్మిస్తున్న చిత్రం 'నమో'. సర్వైవల్ కామెడీ జోనర్‌లో పూర్తి వినోదాత్మక చిత్రంగా తెరకెక్కబోయే ఈ చిత్రంతో ఆదిత్య రెడ్డి కుందూరు దర్శకుడిగా పరిచయం కాబోతున్నారు. శనివారం ఈ చిత్ర ఫస్ట్ లుక్ పోస్టర్ లాంచ్ చేశారు. ఈ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా విచ్చేసిన దర్శకులు భీమనేని శ్రీనివాసరావు ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ఆదిత్య నా దగ్గర అసిస్టెంట్‌గా పని చేశారు. ఎంతో సిన్సియర్‌గా పని చేస్తాడు. నమో అనే పేరు వినగానే.. నరేంద్ర మోదీ గారి మీద కథ అనుకున్నా. నగేష్, మోహన్ హీరోల పాత్రల పేర్ల మీద టైటిల్ పెట్టానని తెలిపాడు. ఈ మూవీ పెద్ద విజయాన్ని సాధించాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. 'నా కథను ఒప్పుకున్న మా హీరో విశ్వంత్, హీరోయిన్ విస్మయకు థ్యాంక్స్. మా సినిమా చాలా బాగా వచ్చింది. సినిమా హాయిగా నవ్వుకునేలా ఉంటుంది' అని దర్శకుడు ఆదిత్య రెడ్డి కుందూరు చెప్పారు.

హీరో విశ్వంత్ దుద్దంపూడి మాట్లాడుతూ,'ఇదొక డిఫరెంట్ చిత్రం. మా డైరెక్టర్ ఆదిత్య డిఫరెంట్ కథ రాసుకున్నారు. ఎంతో వేగంగా సినిమాని పూర్తి చేశారు. ఈ 'నమో'ను ముమ్ముందు సిరీస్‌లుగా కూడా తీయొచ్చు' అని అన్నారు.

భయపెట్టడమే మా లక్ష్యం



సాయికిరణ్ దైదా

శ్రీరామ్, ఖుషీ రవి జంటగా నటించిన చిత్రం 'పిండం'. 'ది స్కేరియస్ట్ ఫిల్మ్' అనేది ఉప శీర్షిక. ఈ సినిమాతో సాయికిరణ్ దైదా దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. కళాహి మీడియా బ్యానర్‌పై యశ్వంత్ దగ్గుమాటి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ సినిమా ఈనెల 15న ప్రపంచవ్యాప్తంగా భారీగా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో దర్శకుడు సాయికిరణ్ దైదా మీడియాతో మాట్లాడుతూ, 'నల్గొండ జిల్లాలో ఒక ఘటన జరిగింది. అది మా నాయనమ్మ చెప్పడం వల్ల నాకు బాగా గుర్తుండిపోయింది. దాని చుట్టూ కథ అల్లుకుని, దీన్ని హర్రర్ జోనర్‌లో చెప్తే బాగుంటుందనే ఆలోచనతో ఈ సినిమా మొదలుపెట్టాను. యదార్ధ ఘటన చుట్టూ కల్పిత కథ అల్లుకోవటం జరిగింది. ప్రేక్షకులు హర్రర్ జోనర్ సినిమాలు చూడటానికి వచ్చేది భయపడటం కోసమే. ఆ హర్రర్ అనుభూతిని కలిగించి, భయం ఇవ్వాలి. ఇది నా మొదటి సినిమా కాబట్టి భారీ తారాగణం ఉండదు. కథ బలంగా ఉండాలి. దానిని దృష్టిలో పెట్టుకొని స్క్రిప్ట్‌ని ఎంతో శ్రద్ధతో రాసుకున్నాను. ఫస్ట్‌కాపీ చూసుకున్న తర్వాత విజయం పట్ల మరింత నమ్మకం కలిగింది. 'పిండం' అంటే రెండు అర్థాలు ఉన్నాయి. కడుపులో బిడ్డ పెరుగుతున్నప్పుడు పిండాకారం అంటారు. అలాగే ఒక మనిషి చనిపోయాక పెట్టేది కూడా పిండం అనే అంటాం. అసలు అది ఏంటి అనేది సినిమా చూస్తే తెలుస్తుంది. ఎందుకంటే కథలో కోర్ పాయింట్ అదే. టీజర్‌కి, ట్రైలర్‌కి రెండింటికీ మంచి స్పందన వచ్చింది. కేవలం టీజర్‌తోనే మా సినిమా బిజినెస్ అయిపోయింది. ట్రైలర్ చూసి ఎందరో అభినందించారు. మీరు టీజర్, ట్రైలర్‌లో చూసిన దానికంటే ఎన్నో రెట్ల కంటెంట్ సినిమాలో ఉంటుంది. ఈ సినిమా తర్వాత 'కృష్ణుడి లంక' అనే క్రైమ్ కామెడీ సినిమా చేయబోతున్నాను. దీని వివరాలు త్వరలోనే తెలియజేస్తాను' అని తెలిపారు.

సూపర్‌విలన్‌తో ఓ సామాన్యుడి పోరాటం



ఆకాంక్ష రంజన్ కపూర్

హీరో సందీప్ కిషన్, విఐ ఆనంద్ కాంబినేషన్‌లో ఎకె ఎంటర్‌టైన్‌మెంట్స్‌లో చేస్తున్న చిత్రం 'ఊరు పేరు భైరవకోన'. ఈ సినిమా త్వరలోనే విడుదలకు సిద్ధంగా ఉంది. లేటెస్ట్‌గా ఇదే బ్యానర్‌లో ప్రొడక్షన్ నెం.26 కోసం సందీప్‌కిషన్ మళ్ళీ నటిస్తున్నారు. 'ప్రాజెక్ట్‌జెడ్' సంచలన విజయం తర్వాత సందీప్ కిషన్‌తో సివి కుమార్ ఈ ప్రాజెక్ట్‌కి దర్శకత్వం వహిస్తున్నారు. 'ప్రాజెక్ట్‌జెడ్' వరల్డ్‌లో సెట్ చేయబడిన ఈ సైన్స్ ఫిక్షన్ యాక్షన్ థ్రిల్లర్ దీనికి సీక్వెల్.

ఈ చిత్రానికి 'మాయావన్' అని టైటిల్ పెట్టారు. అడ్వెంచర్స్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ సమర్పణలో రాంబ్రహ్మం సుంకర ఈ భారీ బడ్జెట్ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కిషోర్ గరికిపాటి (జికె) ఎగ్జిక్యూటివ్ నిర్మాత. ఈ చిత్రం సందీప్ కిషన్‌కు జోడిగా ఆకాంక్ష రంజన్ కపూర్ నటిస్తున్నారు. సూపర్‌విలన్‌తో ఓ సామాన్యుడి ఘర్షణ కథగా తెరకెక్కనున్న ఈ చిత్రానికి రచన, దర్శకత్వం: సివి కుమార్, నిర్మాత: రామబ్రహ్మం సుంకర, డీవోపీ: కార్తీక్ కె తిల్లై, సంగీతం: సంతోష్ నారాయణన్.

లవ్, లస్ట్ నేపథ్యంలో ఈ కథలో నేను..

అవతార్ ఫిలిమ్స్ బ్యానర్ పై ఎం.అచ్చిబాబు సమర్పణలో టి-కేశవ తీర్థ నిర్మించిన సినిమా 'ఈ కథలో నేను'. బుర్రా సాయి మాధవ్ రచన చేసిన ఈ సినిమాకి ఎమ్మెస్ ఫణిరాజ్ దర్శకుడు.

ఈ మూవీలోని పాటలు నచ్చి మంచి ఫ్యాన్సీ రేటుకి ఆదిత్య ఆడియో హక్కుల్ని సొంతం చేసుకుంది. ఈ చిత్ర ట్రైలర్‌ని దర్శకుడు క్రిష్ లాంచ్ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'సాయి మాధవ్ బుర్రా రచనలో వస్తున్న ఈ చిత్రం కచ్చితంగా ఈ ట్రెండ్‌కి, ఇప్పటి యూత్‌కి సరిపోయే విధంగా ఉంటుంది. ముఖ్యంగా ఈ సినిమా ట్రైలర్లో ఉన్న డైలాగ్స్ చాలా బాగున్నాయి. ఈ సినిమా డైరెక్టర్‌కి, టీమ్‌కి మంచి పేరు వస్తుంది. ఈ సినిమా మా సాయి మాధవ్‌కి మంచి పేరుతో పాటు మంచి విజయం అందించాలి' అని అన్నారు. 'సాయి మాధవ్ అందించిన కథ, స్క్రీన్‌ప్లే, మాటలు అందర్నీ తప్పకుండా అలరిస్తాయి' అని హీరో హోమానంద్ చెప్పారు.



హోమానంద్, సిమ్రాన్ పరింజా

సమర్పకుడు అచ్చిబాబు మాట్లాడుతూ, 'అతి త్వరలో చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్‌ని గ్రాండ్‌గా నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నాం' అని తెలిపారు. 'ఈ సినిమాలో సిరివెన్నెలతో పాటలు రాయించుకునే అదృష్టం మా సినిమాకి, నాకు దక్కింది. సిరివెన్నెల తనయుడు యోగిశ్రీ దీనికి మ్యూజిక్ చేశారు' అని దర్శకుడు ఎమ్మెస్ ఫణి రాజ్ చెప్పారు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886